

పరంజ్యోతి

## వినా భస్మత్రిపుండ్రేన..

శివ పూజ చేసేటపుడు సాకారముగా చెయ్యాలా లేక లింగ రూపిగా చెయ్యాలా? సాధారణంగా మనం శివుణ్ని లింగరూపిగానే పూజిస్తాం. శివుడు సాకారంగా ఉన్న దేవాలయాలు చాలా తక్కువగా ఉన్నాయి. లింగరూపిగానే శివుడు ఎక్కువగా పూజలందుకుంటున్నాడు. 'కృతే రత్నమయం లింగం'.. కృత యుగములో అయితే రత్నాలతో తయారు చేయబడిన లింగమును ఆరాధన చేసేవారు. 'త్రేతాయుగాం హేమసంభవం'.. త్రేతాయుగంలో బంగారంతో చేయబడిన శివలింగాన్ని పూజించేవారు. 'ద్వాపరే పారదం శ్రేష్ఠం'.. ద్వాపరయుగంలో పాదరసంతో చేయబడిన లింగమునకు పూజ చేసేవారు. ఇప్పటికీ అలహాబాదు త్రివేణీసంగమం వద్ద పాదరస లింగం ఉన్న దేవాలయం ఉంటుంది. నిజంగా దానిని చూసితీరాలి. ఇక, 'పార్థివంతు కలేయుగే'.. కలియుగంలో అయితే పార్థివ లింగాన్ని పూజించాలి. అనగా మట్టితో చేయబడిన శివలింగం. ఆరాధన చేసేటప్పుడు శౌచంతో పూజామందిర ప్రవేశం జరిగి మనస్సు బాగా నిలబడటం కోసం విభూతి, రుద్రాక్ష మాల, బిల్వపత్రం ముఖ్యం.

*వినా భస్మత్రిపుండేన వినా రుద్రాక్షమాలయా బిల్వపత్రం వినానైవ పూజయేచ్ఛం కరంబుధః*

సాధ్యమయినంతమటుకు పూజ చేసేటప్పుడు ఈ మూడూ తప్పకుండా ఉండేలా చూసుకోవాలి. ఇందులో భస్మం అంటే.. విభూతి. దానిని మూడు గీతలుగా లలాటము నందు పెట్టుకోకుండా పూజచేయవద్దు. స్త్రీలైనా, పురుషులైనా విభూతిని మూడుగీతలుగా మాత్రమే పెట్టుకోవాలి. అలాగే, రుద్రాక్షమాల వేసుకోకుండా పూజచేయరాదు. బిల్వపత్రం లేకుండా పూజచేయడం అంత మంచిదికాదు. బిల్వపత్రములను కొన్నిరోజులపాటు నిలవచేసి పూజచేసుకోవచ్చు. శాస్త్రం ప్రకారం.. శివ నామం గంగ. విభూతి యమున. రుద్రాక్ష సరస్వతి. ఒక గొప్ప శివభక్తుడు లలాటమునందు త్రిపుండ్రాలను ధరించి, బొట్టు పెట్టుకుని, మెడలో రుద్రాక్ష మాల వేసుకుని, శివపూజ పూర్తి చేసి బయటకు వచ్చాడు. ఆక్షణంలో ఆయనను మరొక వ్యక్తి చూశాడు. ఆయన పూజ ఎంత బాగా చేశాడన్నది పక్కన పెడితే.. అలా శివపూజ చేసి బయటకు వచ్చిన వ్యక్తిని చూసినందుకు ఇవతలి వ్యక్తి ఖాతాలో త్రివేణీ సంగమ స్నాన ఫలాన్ని వేసేస్తారు. విభూతి ధారణ చేసేవారు స్నానం చేయకుండా ఎక్కడికో అత్యవసరంగా వెళ్లవలసి వచ్చిన సందర్భములో వారు పొడి విభూతిని తీసుకుని లలాటమునందు ధరించవచ్చు. పొడివిభూతిని పెట్టుకుని వెళ్లడం వెనక ఒక రహస్యం ఉంది. స్నానం చేయక పోవడం వల్ల.. శరీరం అశౌచంతో ఉంటుంది. అశౌచంతో ఉన్న శరీరం తొందరగా వ్యగ్రత కలిగిన ప్రాణులచేత ఆవహింపబడుతుంది. అలా కాకుండా ఉండాలంటే రక్షణహేతువు ఉండాలి. అందుకని విభూతి పెట్టుకోవాలి. విభూతి.. తేజస్సును ప్రసాదిస్తుంది. అది విశేషమైన ఐశ్వర్యాన్ని, మోక్షాన్ని ఇవ్వగలదు. కాబట్టి.. 'అగ్నిరితి భస్మా వాయురితి భస్మా జలరితి భస్మా' అని మంత్రం చెప్పి విభూతిని లలాటమునందు ధరించాలి.



**- చాగంటి కోటేశ్వరరావు శర్మ**

# ఇస్రో హాఫ్ సెంచరీ

## పీఎస్ఎల్వీ 50వ ప్రయోగం విజయవంతం



నిప్పులు చిమ్ముతూ దూసుకెళ్తున్న పీఎస్ఎల్వీ-సీ48

▸▸ **21.16 నిమిషాల్లోనే పూర్తయిన ప్రయోగం**

శ్రీహరికోట(సూళ్లూరుపేట), డిసెంబరు 11: పీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇస్రో హాఫ్ సెంచరీ కొట్టేసింది. 50వ పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష కేంద్రం నుంచి బుధవారం ఇస్రో నమ్మిన బంటు పీఎస్ఎల్వీ-సీ48 రాకెట్ అత్యంత శక్తిమంతమైన రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం రీశాట్-2బీఆర్1ను కక్ష్యలోకి చేరవేసి శభాష్ అనిపించుకుంది. భూమికి 576 కిలోమీటర్ల ఎత్తులో, భూమధ్య రేఖకు 37 డిగ్రీల వాలులో సూర్యానువర్తన కక్ష్యలో విడిచిపెట్టింది. దీంతోపాటు వాణిజ్యపరంగా 4 దేశాలకు చెందిన 9 ఉపగ్రహాలను కూడా ఈ రాకెట్ కక్ష్యల్లోకి చేరవేసింది. బుధవారం మధ్యాహ్నం 3.25 గంటలకు 10 ఉపగ్రహాలతో బయల్దేరిన పీఎస్ఎల్వీ-సీ48 కేవలం 21.16 నిమిషాల్లోనే అన్నింటినీ నిర్ణీత కక్ష్యల్లో వదిలిపెట్టింది. దీంతో పీఎస్ఎల్వీ సిరీస్‌లో 48వ విజయం ఇస్రో ఖాతాలో చేరింది.

**ఇదో చరిత్రాత్మక రోజు: శివన్**

'మా స్పేస్ పోర్టు షార్‌తోపాటు మా విజయాశ్వం పీఎస్ఎల్వీకి ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు. షార్ 75వ ప్రయోగ మైలురాయిని దాటగా.. పీఎస్ఎల్వీ 50వ ప్రయోగంతో అర్ధసెంచరీని అధిగమించింది' అని ఇస్రో సారథి డాక్టర్ కె శివన్ అన్నారు. బుధవారం పీఎస్ఎల్వీ-సీ48 ప్రయోగానంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆయన ప్రసంగించారు. పీఎస్ఎల్వీ 50వ ప్రయోగం అనంతరం ఈ రాకెట్ అంచలంచెల అభివృద్ధి విశేషాలతో ఓ సంకలనాన్ని ఇస్రో ఛైర్మన్ శివన్ ఆవిష్కరించారు.

**ఇస్రోకు గవర్నర్ అభినందనలు**

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పీఎల్ఎస్వీ-సీ48 ప్రయోగం విజయవంతంగా నిర్వహించినందుకు ఇస్రో శాస్త్రవేత్తలను రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అభినందించారు. కేశాట్-2బీఆర్1 ప్రయోగం ద్వారా ఇస్రో కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరిందని ఆయన కొనియాడారు.

| రాకెట్ పేరు: | పీఎస్ఎల్వీ-సీ48 |
|---|---|
| ఎత్తు: | 44.4 మీటర్లు |
| బరువు: | 628 కిలోలు |
| ఉపగ్రహాలు: | దేశీయ రీశాట్-2బీఆర్1 |
| ఉపయోగం: | దేశ రక్షణ రంగానికి, వ్యవసాయ, అటవీ రంగాల సమాచారం, విపత్తుల సమయంలో సహాయం. |
| కాల పరిమితి: | 5 సంవత్సరాలు |
| విదేశీ ఉపగ్రహాలు: | 9 (అమెరికా 6, ఇజ్రాయెల్, ఇటలీ, జపాన్ ఒక్కోటి) |
| ప్రయోగ ఖర్చు: | రూ.300 కోట్లు |
| రీశాట్ తయారీకి: | రూ.220 కోట్లు |
| రాకెట్ తయారీకి: | రూ.80 కోట్లు |

**ఉపగ్రహాలు.. వాటి ఉపయోగాలు**

- **రీశాట్-2బీఆర్1:** ఇస్రో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రాడార్ ఇమేజింగ్ మెగా ఉపగ్రహం ఇది. సరిహద్దుల్లో ఉగ్రవాదుల కదలికలు, చొరబాట్లను పసిగట్టి స్పష్టమైన ఛాయాచిత్రాలతో రక్షణ రంగానికి సమాచారం అందిస్తుంది. దేశంలో వ్యవసాయ, అటవీ రంగాల సమాచారాన్ని కూడా అందిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలకు ఊతంగా నిలుస్తుంది.
- **క్యూబీఎస్ - ఎస్ఏఆర్:** భూ పరిశీలన కోసం జపాన్ ఈ రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహాన్ని ప్రయోగించింది.
- **టైవాక్ 0092:** ఆపత్కాలంలో ఉపయోగపడేందుకు ఇటలీ దీన్ని రూపొందించింది.
- **డుచిఫాట్:** ఇజ్రాయెల్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం ఇది.
- **1హోప్‌శాట్:** భూ పరిశీలన కోసం అమెరికా దీన్ని రూపొందించింది.
- **టైవాక్ - 0129:** అమెరికా సాంకేతిక ప్రదర్శన నిమిత్తం దీన్ని తయారు చేసింది.
- **లేమూర్ (4 ఉపగ్రహాలు):** వాతావరణ పరిశీలన, సముద్ర జలాల్లో ఓడల రాకపోకలను గుర్తించేందుకు అమెరికా ఈ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలను తయారు చేసింది.

# కారుణ్యం కొందరికే!

▸▸ **ఆర్టీసీలో 237మందికి ఉద్యోగాలు, 600 మందికి మొండిచేయి**

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలపై సంస్థ యాజమాన్యం ఎట్టకేలకు కరుణ చూపింది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో 2015వరకూ ఉన్నవాటికి న్యాయం చేసింది. 13 జిల్లాల్లో 237మందికి ఉద్యోగాలు ఇస్తూ ఎండీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2016నుంచి దరఖాస్తు చేసుకున్న మరో 600 మందికి మాత్రం ఆర్టీసీ మొండిచేయి చూపించింది. మరణించిన సిబ్బంది వారసులకు ఉద్యోగం ఇచ్చిన యాజమాన్యం తమకూ న్యాయం చేయాలని అనారోగ్యంతో మంచానపడిన కార్మికుల కుటుంబ సభ్యులు వేడుకొంటున్నారు. ఉద్యోగి చనిపోతే కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చే కారుణ్య నియామకాలను ఆర్టీసీ పాతికేళ్లుగా చేపడుతోంది. 2015తో ఆగిపోయిన వీటిని 2017లో అప్పటి గుర్తింపు కార్మిక సంఘం ఎన్ఎంయూ ఒత్తిడితో మరోసారి చేపట్టింది. అయితే 300మందికి కానిస్టేబుల్ ఉద్యోగాలిచ్చిన యాజమాన్యం ఎత్తు తక్కువగా ఉన్న వారికి కండక్టర్లు, ఇతర ఉద్యోగాలు ఇవ్వలేదు. వారందరికీ న్యాయం చేయాలని ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘం ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, కార్మిక పరిషత్, వైఎస్ఆర్ఎంయూ తదితర 8 సంఘాల జేఏసీ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చింది. మంత్రి పేర్ని నాని, ఆర్టీసీ ఎండీకి ఈయూ, ఎన్ఎంయూ, కార్మిక పరిషత్ వినతులిచ్చాయి. ఎట్టకేలకు స్పందించిన యాజమాన్యం 45 ఏళ్లు దాటినవారికి, ఆత్మహత్యకు పాల్పడిన సిబ్బంది కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇచ్చేందుకు నిరాకరించింది. ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షల్లో టెన్త్ పాసైనా, మరోసారి ఆర్టీసీ పెట్టిన పరీక్షలో ఫెయిలైనవారినీ పక్కనపెట్టింది. చివరకు 850కి పైగా ఉన్న దరఖాస్తుల్లో 237మందికి మాత్రం న్యాయం చేసింది. మరణించిన ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలిచ్చిన ఆర్టీసీ యాజమాన్యం తమపై వివక్ష చూపిస్తోందని మెడికల్ అన్‌ఫిట్ అయిన సిబ్బంది కుటుంబసభ్యులు సుమారు 170మంది వాపోతున్నారు. కాగా, కారుణ్య నియామకాలు చేపట్టిన ఆర్టీసీకి ఈయూ రాష్ట్ర నాయకులు పలిశెట్టి దామోదర్‌రావు, వైవీ రావు, ఎన్ఎంయూ రాష్ట్ర నేతలు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, వైఎస్ఆర్ మజ్దూర్ యూనియన్ నాయకులు చల్లా చంద్రయ్య, రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు పవన్ రైతు సౌభాగ్య దీక్ష



కాకినాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో గురువారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ రైతు సౌభాగ్య దీక్ష చేపట్టనున్నారు. కాకినాడ జేఎన్‌టీయూ ఎదురుగా ఉన్న మైదానంలో జనసేన ఏర్పాట్లు చేసింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి బకాయిలు చెల్లించాలని, మిల్లర్లకు ఇచ్చే ధాన్యానికి రశీదులు ఇవ్వాలనే డిమాండ్లపై పవన్ దీక్ష చేస్తున్నారు. గురువారం ఉదయం 7.30కు కాకినాడ జీఆర్‌టీ హోటల్ నుంచి నాదెండ్ల మనోహర్, నాగబాబుతో కలసి పవన్ దీక్షా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 8 గంటలకు దీక్ష ప్రారంభిస్తారు.

**లోకం తీరు**




**చలికాలం**

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 17.3 | 31.9 |
| అనంతపురం | 17.8 | 29.2 |
| విశాఖపట్నం | 20.8 | 30.4 |
| నెల్లూరు | 22.7 | 31.3 |
| శ్రీకాకుళం | 24.0 | 30.0 |

## పొంచి ఉన్న వర్షాభావం

విశాఖపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భూతాపం కారణంగా దేశంలో రానున్న రోజుల్లో తీవ్ర వర్షాభావం నెలకొంటుందని, లేదంటే కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు కురుస్తాయని దీనికి అనుగుణంగా రైతులు కూడా మారాలని కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజీవన్ సూచించారు. వాతావరణ సదస్సుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుతుపవనాల రాకలో మరింత జాప్యం పెరుగుతుందన్నారు. వర్షాభావ, వాతావరణ అసాధారణ పరిస్థితులను తెలుసుకునేందుకు భోపాల్‌లో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, ఇప్పటి వరకు జిల్లాల వరకే పరిమితమైన వాతావరణ బులెటిన్‌లను ఈ ఏడాది నుంచి బ్లాక్ స్థాయిలో ఇస్తున్నట్టు చెప్పారు. గ్రామస్థాయిలోనూ వాతావరణ బులెటిన్‌లను ఇచ్చేందుకు రూ.450 కోట్లతో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు.



**ఒక్క వేటుతో పేదరికం పోదు..**

పేదరికంపై పోరు.. కేన్సర్‌పై యుద్ధం లాంటిదే! పేదరికంపై పోరు ఒక్క రోజుతో పూర్తయ్యేది కాదు. పేదరిక నిర్మూలన అనేది దశలవారీగా జరుగుతుంది.

**- నోబెల్ గ్రహీతలు అభిజిత్ బెనర్జీ, ఎస్తేర్ డఫ్లో, మైఖేల్ క్రెమెర్**



**స్కూళ్లు, కాలేజీల్లో విధిగా 'గీత'!**

పాఠశాలలు, కళాశాలల పాఠ్యాంశాల్లో భగవద్గీతను తప్పనిసరి చేయాలి. 'గీత'ను విధిగా బోధించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి. మహాత్మాగాంధీ కూడా తన సమస్యలకు పరిష్కారంగా 'గీత'నే అనుసరించారు.

**- బీజేపీ ఎంపీ అర్వింద్ శర్మ**



## మెదడుపై పరిశోధనలకు 3డీ నరాలు!

వాషింగ్టన్, డిసెంబరు 11: మెదడు పనితీరుపై మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు అమెరికా శాస్త్రవేత్తలు 3డీ నరాలను అభివృద్ధి చేశారు. ఇవి కంప్యూటర్‌లో సీపీయూలా పనిచేస్తాయన్నారు. జీవ, నిర్జీవ కణజాలాలతో తయారు చేసిన ఈ నరాలతో శరీరం బయట న్యూరల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి పరిశోధనలు జరపనున్నారు. నరాలు ఒకదానికొకటి ఎలా అనుసంధానం అవుతాయో తెలుసుకొని వాటిని నియంత్రించగలిగితే భవిష్యత్తులో మెదడులాగా పనిచేసే బయాలాజికల్ కంప్యూటర్లను తయారు చేయవచ్చని వారు చెప్పారు. ఔషధాల పనితీరును తెలుసుకోవచ్చన్నారు. దీంతో పాటు అల్జీమర్స్‌కు గల కారణాలు తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు.

## టీవీతో చిన్నపిల్లల్లో ఊబకాయం

మాడ్రిడ్, డిసెంబరు 11: చిన్నపిల్లలు అదేపనిగా టీవీ చూస్తే వారికి ఊబకాయం వచ్చే ప్రమాదం ఎక్కువని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. స్పెయిన్‌కు చెందిన పరిశోధకులు 1,408 మంది పిల్లలపై వారి అలవాట్ల ఆధారంగా పరిశోధనలు నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. శారీరక శ్రమ, టీవీ, నిద్ర, ఆహారం ఈ అంశాల ప్రాతిపదికన అధ్యయనం నిర్వహించగా టీవీ వల్లే ఎక్కువ ప్రమాదమని తేలింది. అదే పనిగా టీవీ చూడటం వల్ల శారీరక శ్రమకు దూరమవడమే కాకుండా, ప్యాకేజ్డ్ ఫుడ్ తినడం అలవాటవుతుందని, వీటితో పాటు నిద్రపైన కూడా ప్రభావం పడుతుందని వారు చెప్పారు.



తనను కలిసిన సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థులను అభినందిస్తున్న సీఎం జగన్

## ▸▸ ఆ మెరికలకు 2 లక్షల ప్రోత్సాహం!

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రోబోటిక్స్, డ్రోన్‌లు, రిమోట్ సెన్సింగ్, కృత్రిమ మేధ వంటి అంశాలపై రష్యాలోని సోచి ప్రాంతంలో శిక్షణ పొంది వచ్చిన ఇద్దరు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులతో సీఎం జగన్ భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 25 మంది విద్యార్థులు రష్యాల్లో పర్యటించారు. వీరిలో ఏపీ నుంచి సీహెచ్ మహేశ్వరి(ప్రకాశంజిల్లా), కేఎల్‌పీ వర్షిణి(విశాఖజిల్లా)లు ఉన్నారు. పర్యటన ముగించుకుని వచ్చిన వీరు ఆ విశేషాలను వివరించేందుకు బుధవారం సీఎంను కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలిసి, తాము రూపొందించిన నమూనాలను వివరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన ముఖ్యమంత్రి చెరో రూ.లక్షను ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు.

## సెన్సార్ బోర్డుదే నిర్ణయం

▸▸ **'అమ్మరాజ్యంలో కడప బిడ్డలు' సినిమాపై హైకోర్టు స్పష్టీకరణ**

హైదరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'అమ్మరాజ్యంలో కడప బిడ్డలు' సినిమాకు 'ఏ, ఏ/యు, యు' కేటగిరీల్లో ఏది ఇవ్వాలో సెన్సార్ బోర్డే స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఈ చిత్రాన్ని విడుదల ఆపాలని కోరుతూ మతబోధకుడు కేఏ పాల్‌తోపాటు హైదరాబాద్‌కు చెందిన ఎం. ఇంద్రసేనా చౌదరి వ్యాజ్యాలు దాఖలు చేశారు. కాగా సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఆదేశించాలని కోరుతూ చిత్ర నిర్మాత, దర్శకుడు మరో వ్యాజ్యం దాఖలు చేశారు. కేఏ పాల్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని క్రితం విచారణలోనే ధర్మాసనం కొట్టివేసింది. మిగిలిన రెండు వ్యాజ్యాలపై బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వకుండానే ఇచ్చినట్లు చిత్ర దర్శకుడు ప్రచారం చేసుకున్నారని, వారేమీ స్వచ్ఛమైన భావం(క్లీన్ హ్యాండ్స్)తో కోర్టును ఆశ్రయించలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సెన్సార్ బోర్డు అభ్యంతరం లేవనెత్తిన సన్నివేశాలను తొలగించామని, అయినా సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వలేదని దర్శక నిర్మాత తరుపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు.

## కేంద్ర పథకాలతో నవరత్నాలకు లింకు

▸▸ **ఆర్థిక వెసులుబాటు కోసం రాష్ట్రం ప్రయత్నాలు**

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నిధుల లేమితో తలకు మించిన భారంలా తయారైన సంక్షేమ పథకాలను కేంద్ర పథకాలతో అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాలు, పాదయాత్ర హామీల పేరుతో నెలకో కొత్త సంక్షేమ పథకాన్ని ప్రకటిస్తోంది. రాష్ట్రానికి వస్తున్న ఆదాయానికి, పథకాల వ్యయానికి వ్యత్యాసం అధికంగా ఉండటంతో పాటు అప్పులు కూడా పుట్టడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వ పథకాలతో నవరత్నాల పథకాలను అనుసంధానించడం ద్వారా వాటిని నిరాటంకంగా కొనసాగిస్తూనే, వ్యయం తగ్గించుకోవాలని భావిస్తున్నారు. ఈ మేరకు అవసరమైన కసరత్తు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులను గ్రామ, వార్డు సచివాలయాల నిర్మాణానికి, జాతీయ గ్రామీణ హెల్త్ మిషన్ నిధులను ఆరోగ్యశ్రీ పథకానికి, సంక్షేమ శాఖలు కూడా తమ పరిధిలో ఉన్న నవరత్నాల అమలుకు కేంద్రంనుంచి వచ్చే నిధులు వినియోగించుకునే సాధ్యాసాధ్యాలపై పరిశీలనలు చేస్తున్నారు.

## ▸▸ పులివెందుల రోడ్లకు 40.70 కోట్లు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ నియోజకవర్గమైన పులివెందుల, ఇతర ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, అభివృద్ధి, విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.40.70 కోట్లు కేటాయించింది. ఈ మేరకు రోడ్లు-భవనాల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రధాన జిల్లా రహదారులు(ఎండీఆర్) కింద క్యాపిటల్, రెవెన్యూ వర్క్‌ల కింద ఆరు రోడ్ల నిర్మాణం, అభివృద్ధి, విస్తరణ పనులకు ఈ నిధులు ఇచ్చారు. ఎఫ్ఆర్‌బీఎం(ఫిస్కల్ రెస్పాన్సిబులిటీ-బడ్జెట్ మేనేజ్‌మెంట్) చట్టం నిబంధనలను సడలిస్తూ ఈ ప్రతిపాదనలను అమలు చేయడానికి నిధులు కేటాయిస్తున్నట్లు ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఉల్లి రైతుకు సొమ్మేదీ?

▸▸ **ప్రభుత్వ బకాయిలు రూ.3 కోట్లపైనే**

▸▸ **సర్కారు చర్యలతో ఎగుమతులు ఆపేసిన వ్యాపారులు**

▸▸ **చెల్లింపులు లేక.. ధర రాక.. సరుకు తగ్గించేసిన రైతులు**

కర్నూలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ధర అమాంతం పెరిగిందని.. ప్రభుత్వం-వ్యాపారులు పోటీపడి కొంటున్నారని... ఎగిరి గంతేసిన ఉల్లి రైతు పరిస్థితి ఇప్పుడు రెంటికీ చెడ్డ రేవడిలా తయారయ్యింది. ఓవైపు ప్రభుత్వం కొనుగోలు చేసిన సరుక్కి సకాలంలో సొమ్ము చేతికి రావడం లేదు. మరోవైపు ఎగుమతులు నిలిపివేయడంతో పెద్ద వ్యాపారులు సరుకు కొనడం లేదు. దీంతో ధర ఒక్కసారిగా ఐదు వేలకుపైగా పడిపోయింది. ధర తగ్గిపోవడంతో రైతులు మార్కెట్ యార్డుకు సరుకు తేవడం తగ్గించేశారు. గతంలో రోజుకు 8-10 వేల క్వింటాళ్లు రాగా.. ఇపుడు 2 వేల క్వింటాళ్లే వస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధర మండిపోతుండటంతో ప్రభుత్వం కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి ఉల్లిని కొనుగోలు చేసి రాష్ట్రంలోని రైతుబజార్లకు సరఫరా చేస్తోంది. రైతులు యార్డుకు తెచ్చిన సరుకును అధికారులు, వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. దీంతో రైతుల్లో ఆనందం రెట్టింపయ్యింది. అయితే ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లికి డబ్బులు ఇవ్వడంలో జాప్యం జరుగుతుండటంతో కార్యాలయం వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. మార్కెట్ యార్డులో రైతుల నుంచి అధికారులు నవంబరు 14 నుంచి నేటికీ 2 వేల మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేశారు. ఇంతవరకూ రూ.3.50 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇంకా రూ.3 కోట్ల వరకూ చెల్లించాల్సి ఉంది.

మార్కెట్ యార్డులో వారం కిందట క్వింటా ఉల్లి ధర రూ.13 వేలకు చేరింది. యార్డు చరిత్రలో ఈ ధర ఎప్పుడూ రాలేదని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ధర ఇంతగా పెరిగిపోవడానికి మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల్లో ఉల్లి పంట దెబ్బతినడమే కారణం. దీంతో కర్నూలులో సాగైన ఉల్లికి డిమాండ్ పెరిగింది. వ్యాపారులతో పోటీపడి అధికారులు కూడా ఉల్లిని కొన్నారు. రైతులకు మంచి ధర లభించింది. మరోవైపు ప్రభుత్వంపై భారం పెరిగింది. కిలో ఉల్లిపై భారం రూ.60 నుంచి రూ. 70కు చేరింది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బయటి రాష్ట్రాలకు ఉల్లి ఎగుమతులను నియంత్రించింది. ఇందుకోసం విజిలెన్స్‌ను రంగంలోకి దించింది. వీరు బయటి రాష్ట్రాలకు ఉల్లిని తీసుకెళుతున్న లారీలను ఎక్కడికక్కడే నిలిపివేశారు. వారం కిందట ఇచ్ఛాపురంలో రెండు, విజయవాడలో రెండు లారీలను నిలిపివేశారు. ఎగుమతులు లేకపోవడంతో యార్డులో కొనుగోళ్లను వ్యాపారులు ఆపేశారు. ప్రస్తుతం చిన్న వ్యాపారులే ఉల్లి కొనుగోలుకు వస్తున్నారు.

### సెల్ కొంటే ఉల్లి ఫ్రీ

మార్కాపురం, తణుకు రూరల్, డిసెంబరు 11: ఉల్లి డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ఇతర వ్యాపారులు సిద్ధమైపోయారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఓ సెల్ దుకాణదారుడు స్మార్ట్‌ఫోన్ కొంటే 2 కేజీలు, టచ్ ఫోన్ కొంటే 1 కేజీ ఉచితం అంటూ బోర్డు పెట్టాడు. పట్టణంలో మైక్‌తో ప్రచారం కూడా చేశాడు. అంతే ఒక్కరోజే 15 ఫోన్లకుపైగా అమ్మేశాడు.

### కిలో చికెన్‌కు అర కిలో ఉల్లి

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో చికెన్ వ్యాపారి చిలుకూరి సత్యనారాయణ బైపాస్ రోడ్డులో దుకాణం పెట్టేవాడు. అక్కడ వ్యాపారం సాగడం లేదని మరో ప్రాంతానికి మార్చి.. బుధవారం నుంచి అమ్మకాలు ప్రారంభించాడు. పనిలో పనిగా కస్టమర్లను ఆకర్షించేందుకు కిలో చికెన్‌కు అర కిలో, అర కిలో కొంటే పావు కిలో ఉల్లి ఫ్రీ అంటూ మైక్ పెట్టి మరీ ప్రచారం చేశాడు. అంతే ఒక్కరోజే 100 కిలోల ఉల్లి ఉచితంగా ఇచ్చేశాడు. అంటే 200 కిలోల చికెన్ అమ్మేశాడు. వ్యాపారం బాగుందని గురువారం కూడా ఆఫర్ కొనసాగిస్తానని ఉత్సాహంగా చెప్పాడు. కాగా, చిత్తూరు మార్కెట్ యార్డులో విక్రయిస్తున్న రాయితీ ఉల్లి కోసం బుధవారం తెల్లవారుజాము నుంచే జనం క్యూకట్టారు. ఉదయం 8గంటల నుంచి అమ్మకాలు చేపట్టి.. 11 గంటల వరకు ఏడు టన్నులు విక్రయించారు.

**కౌంటర్లు పెరిగినా అదే రద్దీ**



రైతుబజార్లలో రాయితీపై కిలో రూ.25కు విక్రయిస్తున్న ఉల్లి కోసం భారీ క్యూలు కొనసాగుతున్నాయి. అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసినా క్యూలైన్ల పొడవు తగ్గడంలేదు. బయట మార్కెట్‌లో ఇంతవరకు కిలో రూ.160 అమ్మిన ఉల్లి బుధవారం రూ.120కి తగ్గింది. కాగా, అనంతపురంలోని రైతుబజార్ల వద్ద ప్రజలు తెల్లవారుజామున మూడు గంటల నుంచే క్యూలో నిలుచుంటున్నారు. **- విశాఖపట్నం, అనంతపురం**

## ప్రభుత్వ కార్యక్రమంగా.. 'అమరజీవి' వర్ధంతి

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీ అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రొటోకాల్ విభాగం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. డిసెంబరు 15న రాష్ట్ర, జిల్లా స్థాయిలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

## బదిలీ జీవోలు బుట్టదాఖలు!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వందల మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. వారిలో ఏడుగురు ఇప్పటివరకూ కొత్త పోస్టుల్లో చేరలేదు. వీరంతా 3 రోజుల్లోగా బదిలీ అయిన శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ జీఏడీ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నెల రోజుల్లోగా విధుల్లో చేరలేదన్న కారణంతో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను సస్పెండ్ చేశారు. ఓ తహసిల్దార్‌కు ఇచ్చిన డిప్యూటీ కలెక్టర్ పదోన్నతిని కూడా రద్దు చేశారు. కాగా, బదిలీ చేసి నెలలు గడుస్తున్నా విధుల్లో ఎందుకు చేరలేదన్న దానిపై ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూశాయి.

**ఎన్నెన్నో కారణాలు..**

తమకు మరీ చిన్న పోస్టు ఇచ్చారనో, ప్రస్తుతం పనిచేస్తున్న పోస్టు నుంచి సంబంధిత శాఖ రిలీవ్ చేయలేదనో.. కారణాలతో కొందరు డిప్యూటీ కలెక్టర్లు కొత్త పోస్టుల్లో చేరలేదని తెలుస్తోంది. వీటికన్నా, కొందరు మంత్రులు అభ్యంతరం చెప్పడంతో వీరిని విధుల్లో చేర్చుకోని ఉదంతాలు ఉన్నాయని తెలిసింది. ఓ డిప్యూటీ కలెక్టర్‌ను విధుల్లో చేర్చుకోవద్దని నేరుగా ఓ అమాత్యుడు ఆదేశించినట్లు సమాచారం. విషయం తెలియని సదరు డిప్యూటీ కలెక్టర్ కొత్త పోస్టులో చేరేందుకు జిల్లాకు వెళ్లి కలెక్టర్‌ను కలిశారు. మీరు చేరడంపై జిల్లా మంత్రికి అభ్యంతరం ఉంది, మీ జాయినింగ్ రిపోర్టు తీసుకోం, వెనక్కు వెళ్లిపోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దీంతో ఆయన రెండున్నర నెలలుగా కొత్తపోస్టులో చేరలేదని తెలిసింది. ఇక మరో డిప్యూటీ కలెక్టర్ విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కీలకమైన పోస్టును వదులుకొని, ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరి అమరావతి పరిధిలో ఉండాలని వచ్చారు. బదిలీ జీఓ ఇచ్చిన మరుసటిరోజే సంబంధిత శాఖ కార్యదర్శిని కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. అయితే నెలలు గడుస్తున్నా ఇప్పటిదాకా ఆయన విధుల్లో చేరినట్లు, నిర్దేశిత పోస్టు ఇచ్చినట్లు ఆదేశాలివ్వలేదు. ఆ ఫైలుపై మంత్రి ఆమోదముద్ర వేయకపోవడమే దీనికి కారణమని తెలియడంతో సీఎంఓ జోక్యం చేసుకుంది. అయినా నేటికీ ఫలితం లేదు. పైగా ఈ ఫైలు పక్కనపెట్టి, అప్పటికే ఆ శాఖలో డిప్యుటేషన్‌పై పనిచేస్తోన్న మరో అధికారిని ఆదే పోస్టులో ఇన్‌చార్జిగా నియమించారు. ఆయనకు ఐదేళ్ల డిప్యుటేషన్ కాలం ముగియడంతో, ఆరో ఏడాది కూడా కొనసాగించాలని సీఎంఓకు ఫైల్ పంపించారు. ఇదిలా ఉంటే, మరో డిప్యూటీ కలెక్టర్‌ను సొంత ప్రాంతానికి బదిలీ చేశారన్న కారణంతో ప్రస్తుతం పనిచేస్తోన్న శాఖ ఆయన్ను రిలీవ్ చేయడం లేదని తెలిసింది.

# 'రెడ్డి' కాబట్టే ఇలాగా!?

- అసెంబ్లీ సాక్షిగా ఎన్‌కౌంటర్‌కు సమర్థనా?
- జగన్‌కు మందకృష్ణ సూటి ప్రశ్నలు



మంగళగిరి, డిసెంబరు 11: తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్ తమ సొంత సామాజిక వర్గానికి అన్యాయం జరిగినప్పుడు మాత్రమే ఆగమేఘాల మీద స్పందిస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్యాయం జరిగితే ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బుధవారం ఆయన గుంటూరు జిల్లా మంగళగిరిలో మీడియాతో మాట్లాడారు. "నిందితులను న్యాయవ్యవస్థ ద్వారా శిక్షించకుండా పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడాన్ని శాసనసభ సాక్షిగా జగన్ సమర్థించారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి సీఎం అయిన జగన్... ఆ హత్యలను సమర్థించడం, కేసీఆర్‌కు హ్యాట్సాఫ్ చెప్పడం శోచనీయం. హాజీపూర్‌లో ముగ్గురు బాలికలపై అత్యాచారం చేసి, మృతదేహాలను బావిలో పడవేసిన శ్రీనివాసరెడ్డిని, జడ్చర్లలో 15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి చంపిన నవీన్ రెడ్డినీ ఎన్‌కౌంటర్ చేయాలని సూచించే సాహసం జగన్ చేయగలరా? ఒక రెడ్డిని చంపిన నలుగుర్ని ఎన్‌కౌంటర్ చేసినప్పుడు... నలుగురు మహిళలను చంపిన మరో రెడ్డికి అదే శిక్ష ఎందుకు వేయరు?" అని మంద కృష్ణ ప్రశ్నించారు. వైఎస్ హయాంలో 11 మంది గిరిజన మహిళలపై పోలీసులు అత్యాచారాలకు పాల్పడి హత్యలు చేశారని చెప్పారు. ఆయేషామీరా హత్య కూడా వైఎస్ హయాంలోనే జరిగిందని, ఆమె తల్లిదండ్రుల ఆవేదన ఇప్పటికీ అరణ్య రోదనగానే మిగిలిందని పేర్కొన్నారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో తల్లి కూతుళ్లను హత్య చేసి తగులబెట్టారన్నారు. ఈ కేసుల్లో కేసీఆర్ పాలసీని జగన్ అమలు చేయగలరా అని ప్రశ్నించారు. "ఆర్థిక నేరగాళ్లపై తక్షణమే న్యాయ విచారణ జరిపించి, నేరం రుజువైతే ఉరిశిక్ష విధించేందుకు జగన్ ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేయగలదా? కేంద్రం ఆ చట్టం చేస్తే సమర్థించే దమ్ము జగన్‌కు ఉందా?" అని మంద కృష్ణ ప్రశ్నించారు.

## విశాట్ 2020 నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ పోస్టర్స్ విడుదల చేస్తున్న వీసీ ఎంవైఎస్ ప్రసాద్

గుంటూరు(విద్య), డిసెంబరు 11: బీటెక్, బీఫార్మశీల్లో ప్రవేశం కోసం విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే విశాట్-2020 నోటిఫికేషన్ గురువారం విడుదల చేశారు. వీసీ డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్ విశాట్ వివరాలను గుంటూరులో విలేకరులకు వివరించారు. విజ్ఞాన్ వర్సిటీలో ప్రవేశం కోసం 2020-21 సంవత్సరానికిగాను విశాట్‌ను ఏప్రిల్ 14 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేయడానికి ఏప్రిల్ 5 చివరి తేదీ అని పేర్కొన్నారు. గుంటూరు, హైదరాబాదు, విజయవాడ, విశాఖ, ఏలూరు, రాజమండ్రి ప్రాంతాల్లోని విజ్ఞాన్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షను రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.4కోట్ల వరకు ఫీజు రాయితీ కల్పిస్తున్నామని చెప్పారు. కోర్సులు, అడ్మిషన్ ఇతర వివరాల కోసం www.vignan.ac.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

## ముగ్గురు అన్నదాతల ఆత్మహత్య

ఎలమనేరు రూరల్/నిండ్ర/ఇంకొల్లు, డిసెంబరు 11: రుణభారం ముగ్గురు రైతుల పాలిట యమపాశమైంది. ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం దుద్దుకూరుకు చెందిన రైతు బిళ్లా ఇస్సాక్ (53), చిత్తూరు జిల్లా పలమనేరు పరిధిలోని బోడిరెడ్డిపల్లెకు చెందిన సోమశేఖర్ (45),నిండ్ర మండలం కొప్పేడు పంచాయతీకి చెందిన భాస్కర్ (49) లు అప్పులు తీర్చే దారి కనిపించక ఆత్మహత్య చేసుకున్నారు.

## ఏఎంటీజెడ్ సలహాదారుగా జితేంద్ర శర్మ

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్)కు సలహాదారుడిగా జితేంద్రశర్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తుర్వులు జారీ చేసింది. ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న ఏఎంటీజెడ్‌ను ప్రభుత్వం పరిశ్రమల శాఖకు బదిలీ చేసింది. ప్రస్తుతం ఏఎంటీజెడ్ ఎండీ, సీఈవోగా ఉన్న ఆయనను ప్రభుత్వం తొలగించింది. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శికి ఏఎంటీజెడ్ ఎండీ, సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

## 'ఆల్తూరుపాడు'కు రివర్స్ టెండర్.. 68 కోట్ల ఆదా

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులకు జల వనరుల శాఖ రివర్స్ టెండరింగ్‌కు వెళ్లింది. హైదరాబాద్‌కు చెందిన బీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ 26.72 శాతం తక్కువకు బిడ్ దాఖలు చేసింది. బుధవారం ప్రాథమిక టెండర్లను తెరిచారు. రూ.253.77 కోట్లకు టెండర్లు పిలిస్తే రూ.218.09 కోట్లకు బిడ్ వేసి బీవీఎస్ఆర్ ఎల్-1గా నిలిచింది. రివర్స్ టెండరింగ్‌లో అదే సంస్థ రూ.185.6 కోట్లకు తుది బిడ్ వేసింది. ఖజానాకు రూ.68 కోట్లు ఆదా అయినట్లు జలవనరుల శాఖ తెలిపింది.

## సభాపతి ఆదేశాలు అసెంబ్లీకే పరిమితం

- శాసనసభ, మండలికి వేర్వేరు వ్యవస్థలు
- మీడియా మొత్తాన్ని అనుమతించాలి
- చైర్మన్ షరీఫ్‌కు టీడీపీ ఎమ్మెల్సీల లేఖ

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): శాసనసభ, శాసనమండలిల నిర్వహణకు వేర్వేరు వ్యవస్థలను ఏర్పాటుచేయాలని టీడీపీ ఎమ్మెల్సీలు కోరారు. స్పీకర్ ఆధ్వర్యంలో అసెంబ్లీ నడిస్తే.. చైర్మన్ ఆధ్వర్యంలో శాసనమండలి నడుస్తుందన్నారు. మండలికి ప్రత్యేక సిబ్బంది, మార్షల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సభాపతి ఆదేశాలు శాసనసభ వరకు మాత్రమే వర్తిస్తాయన్నారు. మూడు టీవీ చానళ్లను సభలోకి అనుమతించవద్దని ఆయన ఇచ్చిన ఆదేశాలు అసెంబ్లీ వరకే వర్తిస్తాయన్నారు. మండలికి అన్ని మీడియా సంస్థలను అనుమతించాలని, మీడియా పాయింట్‌లో మండలికి ప్రత్యేకంగా పాయింట్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు టీడీపీ ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, సత్యనారాయణరాజు, సంధ్యారాణి, వి.వి.వి.చౌదరి, పోతుల సునీత, బుద్దా వెంకన్న మండలి చైర్మన్ షరీఫ్‌కు లేఖ రాశారు.

### మార్షల్స్ ప్రవర్తనపై ఫిర్యాదు

శాసనమండలి చీఫ్ మార్షల్, మార్షల్స్ అనుచిత ప్రవర్తనపై టీడీపీ మహిళా ఎమ్మెల్సీలు మండలి చైర్మన్ షరీఫ్‌కు బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గేట్లు మూసివేసి, తమ చేతుల్లో ఉన్న కాగితాలు చించేశారని, అరచేతులు చూపించాలని వేధించారని పేర్కొన్నారు. చీఫ్ మార్షల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ మహిళా ఎమ్మెల్సీలు గుమ్మడి సంధ్యారాణి, పోతుల సునీత మండలి చైర్మన్‌ను కలిశారు.

## ప్రజాప్రతినిధులతో ఇలాగేనా?

- చీఫ్ మార్షల్‌పై చంద్రబాబు ఆగ్రహం

అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద చీఫ్ మార్షల్‌పై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద టీడీపీ ఎమ్మెల్సీ సంధ్యారాణి వద్ద నుంచి ప్లకార్డులు, ఫ్లెక్సీలను చీఫ్‌మార్షల్ బలవంతంగా లాక్కున్నారు. మిగతావారి వద్ద ప్లకార్డులు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. 'సీఎం ఉన్నాది అయితే మీరూ ఆలానే తయారవుతారా? ప్రజాప్రతినిధులతో ఎలా వ్యవహరించాలో తెలియదా?' అని చంద్రబాబు మండిపడ్డారు.

# శభాష్ పోలీస్!

- చిన్నారిపై హత్యాచారం కేసులో శరవేగంగా దర్యాప్తు
- 10 పని దినాల్లో ఫోరెన్సిక్ నివేదిక.. వెంటనే చార్జిషీట్
- మదనపల్లి పోలీసుల రికార్డు.. డీజీపీ ప్రశంసలు

**5 రోజుల్లో నిందితుడి గుర్తింపు.. 8 రోజుల్లో అరెస్టు**

తిరుపతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అమ్మనాన్నలతో కలిసి బంధువుల పెళ్లికి వెళ్లిన ఐదేళ్ల చిన్నారి అత్యాచారం, ఆపై హత్య కేసు దర్యాప్తులో చిత్తూరు జిల్లా మదనపల్లె పోలీసులు స్ఫూర్తిదాయక వేగాన్ని ప్రదర్శించారు. నిందితుడిని పట్టుకోవడం దగ్గర నుంచి పక్కా ఆధారాలు సేకరించి చార్జిషీటు దాఖలు చేసేవరకూ చురుకుగా పని చేసిన పోలీసులు.. సత్వర ట్రయల్ చేపట్టమని కోర్టును కోరడం ద్వారా స్వల్ప వ్యవధిలోనే నిందితునికి శిక్ష పడేలా చూస్తామని ధీమాగా చెబుతున్నారు. గత నెల 8న చిన్నారిని అత్యంత కిరాతకంగా హతమార్చిన సమాచారం అందగానే రంగంలోకి దిగిన పోలీసులు ఊహాచిత్రం ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి ఐదు రోజుల్లోనే నిందితుడి గుట్టు పట్టేశారు. మరో మూడు రోజులకే అతన్ని అరెస్టు చేశారు. దర్యాప్తులో లభ్యమైన ఆధారాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి పది పనిదినాల్లోనే నివేదిక తెప్పించుకున్నారు. నిందితుని రిమాండుకు పంపిన సరిగ్గా 17 పని దినాల్లో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితునికి శిక్ష పడేలా పక్కా ఆధారాలు సిద్ధం చేసుకున్నారు. తద్వారా రాష్ట్ర పోలీసు శాఖ చరిత్రలోనే సరికొత్త రికార్డు నెలకొల్పి డీజీపీ గౌతమ్ సవాంగ్ నుంచి ప్రశంసలు అందుకున్నారు.

### అన్నీ చకచకా..

కేసు తీవ్రత దృష్ట్యా మదనపల్లె డీఎస్పీ రవి మనోహరాచారి పోలీసు అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. కల్యాణ మండపంలోని సీసీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు చివరికి అనుమానితుడిని గుర్తించారు. ఊహాచిత్రం విడుదల చేసి విస్తృత ప్రచారం కల్పించారు. మరోవైపు గతంలో లైంగిక నేరాలకు పాల్పడిన పాత నేరస్తుల వివరాలు సేకరించారు. ఈ క్రమంలో ఐదు రోజుల్లోనే నిందితుడైన మదనపల్లె పట్టణం బసినికొండకు చెందిన పఠాన్ మహమ్మద్ రఫీ ఇంటి తలుపు తట్టగలిగారు. ఘటన జరిగిన రోజు నిందితుడు ధరించిన దుస్తులే అతన్ని పట్టించాయి. అతన్ని తమదైన శైలిలో విచారించగా నిందితుడు నేరం అంగీకరించాడు. నిందితుడిని 17న రిమాండుకు తరలించిన పోలీసులు.. 22 నాటికి కోర్టు ద్వారా నిందితుడి దుస్తులతో పాటు దర్యాప్తులో లభ్యమైన కీలక సాక్ష్యాధారాలన్నింటినీ విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ నెల 7న నివేదిక కోర్టు ద్వారా పోలీసులకు అందింది. కేవలం పది పని దినాల్లోనే ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదిక అందడం పోలీసు శాఖ చరిత్రలోనే తొలిసారని చెబుతున్నారు. నివేదిక అందిన మూడో రోజే అంటే ఈ నెల 10న పోలీసులు చిత్తూరు ఫాస్ట్ ట్రాక్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.

# ఉల్లి క్యూలో ఓ వ్యక్తి కిందపడింది నిజం

- గంటల కొద్దీ నిలబడి నాకూ కళ్లు తిరిగాయి
- గుడివాడ ఘటనపై ప్రత్యక్ష సాక్షి వెల్లడి
- టీడీపీ ఆఫీస్‌లో చంద్రబాబును కలిసి.. అప్పటి పరిస్థితిని వివరించిన శ్యామల

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): "గుడివాడ రైతు బజార్‌లో మంగళవారం ఉదయం ఉల్లిపాయల కోసం భారీ క్యూలో నిలబడిన ఒక వ్యక్తి కింద పడిపోయిన మాట నిజం. నేను కూడా ఆ పరిస్థితిని ఎదుర్కొన్నాను" అని శ్యామల అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. గుడివాడలో సాంబిరెడ్డి అనే వ్యక్తి మరణం వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. ఉల్లిపాయల కోసం క్యూలో నిలబడిన ఆయన కింద పడిపోయి చనిపోయారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించగా, సాంబిరెడ్డి అసలు ఉల్లిపాయల కోసం వెళ్లలేదని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈ నేపథ్యంలో శ్యామల బుధవారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో మాట్లాడారు. "ఆ రోజు ఉల్లిపాయల కోసం గుడివాడ రైతు బజార్‌కు ఉదయం 6 గంటలకే వెళ్లాం. అప్పటికే భారీ లైన్లు ఉన్నాయి. 9 గంటల వరకు క్యూలైన్‌లో ఒకరినొకరు తోసుకొంటూనే ఉన్నారు. ఇంతలో క్యూలో ఉన్న ఒక వ్యక్తి కింద పడిపోయారు. దీంతో అమ్మకాలు నిలిపివేస్తున్నామని ప్రకటించి కౌంటర్‌ను మూసివేశారు. నా పరిస్థితి కూడా ఇబ్బందికరంగా తయారైంది. ముక్కు నుంచి రక్తం వచ్చింది. పక్కనున్న వ్యక్తిని బతిమాలితే మా వాళ్లకు ఫోన్ చేశారు" అని ఆమె బాబుకు వివరించారు. అయితే, గుడివాడ క్యూలో కింద పడిపోయిన వ్యక్తి ఎవరో తనకు తెలియదని, పడిపోయిన మాట మాత్రం వాస్తవమని ఆమె నొక్కిచెప్పారు. అనంతరం, చంద్రబాబు మాట్లాడుతూ, గుడివాడలో ఆ ఒక్క చోటే ఈ ఘటన జరిగిందని, సాంబిరెడ్డి అక్కడే పడిపోయి చనిపోయారని చెప్పారు. అసలేమీ జరగలేదని మంత్రులు దబాయిస్తుండడంతో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఈ మహిళ ఏం జరిగిందో చెప్పడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఇది లావుంటే, శ్యామల టీడీపీ కార్యాలయానికి వచ్చినట్టు తెలియగానే ఆమె కుమారుడిని గుడివాడలో అధికార పార్టీ నేతలు వేధింపులకు గురిచేస్తున్నట్టు అక్కడి టీడీపీ నేతలు చెప్పారు.

## నకిలీ వెబ్‌సైట్లపై ఫిర్యాదు

జగ్గయ్యపేట రూరల్, డిసెంబరు 11: కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి, వేదాద్రి ఆలయాలకు వచ్చే భక్తులను నకిలీ వెబ్‌సైట్ల ద్వారా మోసం చేస్తున్నారని సంబంధిత అధికారులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి, వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో పూజల నిర్వహణకు ఆన్‌లైన్ ద్వారా రూ.1,150లు చెల్లించాలని నకిలీ వైబ్‌సైట్లలో పెట్టినట్టు ఆలయ అధికారులు గుర్తించారు. ఈ మేరకు చిల్లకల్లు పోలీసులతో పాటు, సైబర్ క్రైంకు ఫిర్యాదు చేసినట్టు తిరుమలగిరి ఆలయ సహాయ కమిషనర్ సాయిబాబు తెలిపారు.


**వాహనాలు అమ్మకము**

| Vehicle No. | Make & Model | Year |
|---|---|---|
| AP16CU3064 | MARUTI WAGONR | 2014 |
| AP26AS1314 | NISSAN SUNNY XL | 2013 |
| AP07AN5445 | TOYOTA INNOVA 2.5 G | 2010 |
| AP37TC3355 | MAHINDRA XYLO-P | 2012 |
| AP16TF0197 | MAHINDRA BOLERO MAXI | 2013 |
| AP16TD2130 | TATA 207 RX | 2012 |
| AP03TD0245 | TATA ACE | 2014 |
| AP37TB6991 | TATA ACE | 2011 |
| AP07TB6855 | TATA ACE | 2011 |
| AP07TC1111 | BHARAT BENZ 3123 FBT | 2015 |
| AP16TW4446 | AL TUSKER SUPER 2214 FBT | 2006 |
| AP05W3579 | TATA 407 SFC | 2007 |
| AP16TH4555 | TATA SK 1613 FBT | 2006 |
| AP31TU5713 | TATA LPK 2516 FBT | 2008 |
| AP37TE3199 | TATA LPK 2518 FBT | 2015 |
| AP07TA8824 | TATA LPK 2518 FBT | 2011 |
| AP21TT0395 | TATA LPK 2516 FBT | 2008 |
| AP16TX2490 | TATA LPK 2516 FBT | 2006 |
| AP16CZ6251 | EICHER 380 | 2013 |
| AP04X8278 | AMW 4923 | 2009 |
| AP04X9112 | AMW 4923 | 2010 |
| AP37TC6690 | MAHINDRA BOLERO CAMPER | 2013 |
| AP03AX3581 | L&T CASE 770 | 2012 |
| AP07BA7055 | L&T CASE 770 | 2011 |
| AP07TA8792 | TATA ACE | 2011 |
| AP04X8598 | AMW 4923 | 2010 |

AUCTION PLACE : SHRIRAM AUTO MALL, GUTTIKONDA SIVANARAYANA YARD, NEW AUTONAGAR, KANURU, VIJAYAWADA
AUCTION DATE : 12-12-2019
Cont : SHRIRAM TRANSPORT FINANCE Co. Ltd.
D No:- 27-12-34, BSN REDDY COMPLEX, 3rd Floor, Gudavallivari Street, VIJAYAWADA. Ph: 0866-2579197.
98499 81258, 99499 11574



**ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED**
HEAD OFFICE:10-152/1, SRI SAI TOWERS, BANDAR ROAD KANURU, VIJAYAWADA-520007

Lr.No.Mktg/M2/1920(3)/KMS-2019-20 Dt.11.12.2019

**TENDER NOTICE**

EMPANELMENT OF SUPPLIERS THROUGH NEML E-REVERSE AUCTION PLATFORM FOR THIRD PARTY ASSAYING AGENCY TO CARRY OUT SAMPLING, QUALITY CHECKING AND CERTIFICATION OF SORTEX RICE FOR KMS 2019-20.

Tenders are invited from the interested agencies for registration as service providers to participate through e-Reverse auction conducting on NeML platform on behalf of APSCSC Ltd to carry out sampling, quality checking and certification of sortex rice in designated rice mills of Andhra Pradesh State.

For registration, interested agencies may visit in the website www.neml.in and www.apscsc.gov.in for application form and detailed terms & conditions.

Last date for online registration and completion of formalities for the e-Reverse auction shall be up to **5.00 pm of 26.12.2019.** The duly filled in application form should be submitted to **The Membership Department, NCDEX e-Markets Ltd.,101 & 101T, First floor, Ackruti Corporate Park, LBS Marg, Kanjurmarg (West), Mumbai-400079,Tel:9642332994,9962059599,022-66473153/54 Email: askus@neml.in**

The Tentative date of online e-auction through NeML e-Reverse Auction platform would be on **27.12.2019.** The details are available in the RFP on the website www.apscsc.gov.in and www.neml.in

General Manager(Mktg)



**SARDAR VALLABHBHAI PATEL NATIONAL POLICE ACADEMY**
(Government of India : Ministry of Home Affairs)
Shivarampalli, Hyderabad - 500 052.

No.33011/1/2013/Estt/03/A1 Dated:10 Dec, 2019

**WALK - IN - INTERVIEW**

The Sardar Vallabhbhai Patel National Police Academy, Shivarampalli, Hyderabad, Telangana-500 052 intends to fill following posts purely on monthly honorarium basis for its Publication Branch through Walk-in-interview on **30th December, 2019 (Monday) at 1000 hrs.**

| Sl.No. | Name of Post | No. of Posts | Fixed Honorarium per month |
|---|---|---|---|
| 1. | Copy Editors | 02 | Rs.52,000/- |
| 2. | Graphic Designer | 01 | Rs.30,000/- |

2. The details regarding eligibility criteria, fixed honorarium per month, application form and other relevant information are available on our **website:http://www.svpnpa.gov.in/vacancies.aspx.**

Sd/- **(S.Ajeetha Begum)**
Assistant Director (Estt.)



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**నీటి వనరుల శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటనకు సవరణ**

టెండరు సహిత వేలం (రివర్స్ టెండరింగ్) ప్రకటన నెం.1 SE/2019-20, తేదీ: -12-2019, **పని పేరు:** గుంటూరు జిల్లాలో లీడింగ్ ఛానల్ మరియు డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్ కలుపుకుని కిమీ.0.0000 నుండి 47.000 వరకు గుంటూరు ఛానల్ ఆధునీకీకరణ. షెడ్యూలు అమ్మకం తెరచు తేదీ: 09.12.2019 న ఉ.11.00 గం.కు. షెడ్యూలు ముగింపు తేదీ: 23.12.2019 న సా.4.00 గం.కు, బిడ్ దాఖలు ముగింపు తేదీ: 23.12.2019 న సా.5.00 గం.కు, ప్రీ బిడ్ సమావేశం: 19.12.2019 న మ.2.00 గం.కు, తదుపరి వివరాలకు సంప్రదించగలరు: **www.eprocurement.gov.in** ఫోన్ నం: 0863-2234554.

**సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, నీటిపారుదల సర్కిల్, గుంటూరు**

DIPR RO No.1289/CL/ADVT/1/1/2019-20, తేది:11.12.2019



No. PO(VSP)815/01/2019
**GOVERNMENT OF INDIA**
**Ministry of External Affairs**
**Regional Passport Office,** Visakhapatnam

**NOTICE INVITING E-TENDER FOR SELECTING DESIGN TO BUILT CONTRACTOR**
for
**Design, supply, fixing of interior works and furniture of Regional Passport Office, Vijayawada at Kanuru, Vijayawada, Andhra Pradesh**

On behalf of the President of India, E-tenders are invited by the Passport Officer, Regional Passport Office, Visakhapatnam under "Two Bid System" i.e. Technical Bid (Pre-qualification) and Financial Bid from appropriately qualified and adequately experienced Contractors for Design, supply, fixing of interior works and furniture of Regional Passport Office, Vijayawada at Kanuru, Vijayawada, Andhra Pradesh. The bids shall be submitted online only at Central Public Procurement Portal website i.e. **http://eprocure.gov.in/eprocure/app.** Manual bids shall not be accepted.

The bidder shall furnish an EMD amounting to Rs.1,60,000 (Rs.1,60,000 calculated as 2% of the estimated cost of project) in the form of Pay Order/Demand Draft from any commercial bank in favour of "Regional Passport Officer, Visakhapatnam payable at Visakhapatnam". The Original EMD of Rs 1,60,000 in the form of Pay Order/Demand Draft is to be submitted in a sealed envelope superscribed "Tender for selecting design to built contractor" at Regional Passport Office, Marripalem VUDA layout, NAD Post, Vizag-530009 e-mail: **rpo.vizag@mea.gov.in. *Tel:0891-2970210*** on or before the closing date and time of e-submission of online bids to Regional Passport Officer, Visakhapatnam, Ministry of External Affairs, Regional Passport Office Vizag. The detailed tender document along with its annexure may be downloaded from Central Procurement Portal **https://eprocure.gov.in/cppp/** and also the official website of the (Regional Passport Office, Visakhapatnam) at **https://passportindia.gov.in**

2. The objective of this Notice Inviting Tender is to select an a propriately qualified and adequately experienced "Design Build Contractor" by the Regional Passport Office, Visakhapatnam for Design, supply, fixing of interior works (Including laying of vitrified flooring), Electrical and LAN networking cabling, provision of Generator, UPS, air-conditioning and furniture of Regional Passport Office, Vijayawada at Kanuru, Vijayawada, Andhra Pradesh, India.

3. **Location and description of Property:** Ground, 1st and 4th Floor, measuring 7300sq.ft. carpet area, rented property of Regional Passport Office, Vijayawada at Kanuru, D.No.7-492, Besides Siddhartha Law College, Vijayawada, Andhra Pradesh, India -520007.

4. **Scope of Work:** Design, supply, fixing of interior works which includes, laying of vitrified flooring, full height modular partition for officers cabins and half height modular partition for workstations meant for staff, Electrical and LAN networking cabling, provision of Generator, UPS, air-conditioning and providing furniture to office as per the tentative drawing for Regional Passport Office, Vijayawada at Kanuru, Vijayawada, Andhra Pradesh.

5. **Period of Completion:** One hundred eighty (180) days from the Date of Issue of Work Order.

6. **Site visit:** Physical visit to the site is advisable to have a general idea about the extent of works required and the amount of involvement by the Contractor. Interested firms can visit the site between 10.30 hrs to 5.00 hrs from 12th December to 20th December, 2019 after prior appointment with Shri GV Prasad, Assistant Superintendent, Mobile No.9440578073.

7. **Submission:** The two bid system shall be followed for this tender. In this system, the bidder shall submit offer online only at Central Public Procurement Website: **http://eprocure.gov.on/eprocure/app.** Manual bids shall not be accepted under any circumstances.

The bids should be submitted online in two parts: (i) Technical Bid, which should contain the documents establishing the technical eligibility of the applicant and other documents required for establishing sound financial condition, as per terms & conditions of this tender; and (ii) Financial Bid, which should be as per the format given in this tender. The technical bids shall be opened on the appointed date at 3.00 PM. After scrutiny of technical bids, the Regional Passport Office shall shortlist the eligible bidders and inform them of the date and time of opening of the Financial Bids; All pages of the submission document must be numbered and self-attested with the seal of the bidder.

**NLP CHOUDARY**, Regional Passport Officer,
Marripalem VUDA Layout, NAD Post, Vizag-530009
Mail: rpo.vizag@mea.gov.in, Tel:0891-2970210










## మోదీకి క్లీన్‌చిట్

దేశవ్యాప్త ఎన్నార్సీ, పౌరసత్వ సవరణ బిల్లు ఇత్యాది అంశాలతో దేశం వేడిగా ఉన్న కాలంలో, గుజరాత్ ప్రభుత్వం ఐదేళ్ళక్రితం నాటి నానావతి కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం వెనుక ఏవో నిగూఢ లెక్కలు, సందేశాలున్నాయని కొందరి అనుమానం. మోదీకి క్లీన్‌చిట్ ఇచ్చే నివేదికలు ఎప్పుడు వెలుగుచూసినా ఈ తరహా వ్యాఖ్యలు తప్పవు కానీ, గుజరాత్ ఊచకోతల నింద నుంచి ఆయనను బయటపడవేసేందుకు ఇది ఉపకరిస్తుంది. అడ్డగోలు అబద్ధాలతో మోదీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు స్వచ్ఛంద సంస్థలు, విదేశీశక్తులు కుట్రపన్నాయన్న బీజేపీ నాయకుల వాదనకు మరింత బలం చేకూరుతుంది.

మోదీ మాత్రమే కాదు, ఆయన మంత్రివర్గ సహచరుల్లో ఒక్కరు కూడా ఈ ఊచకోతలకు కుట్రపన్నినట్టుగా, ప్రోత్సహించినట్టుగా, దిశానిర్దేశం చేసినట్టుగా ఆధారాలు లేవని కమిషన్ తేల్చేసింది. పదిహేనువందల పేజీల నివేదికలో ప్రధానంగా పోలీసులనే తప్పుబడుతూ, పోలీసులు బాధ్యతగా వ్యవహరించలేదనీ, సంఖ్య తక్కువైనందునో, ఆయుధ బలంలేనందునో మారణకాండను నిలువరించలేకపోయారని ప్రకటించింది. ఊచకోతల వెనుక రాష్ట్రప్రభుత్వ హస్తం ఉన్నదంటూ అప్పట్లో కీలకస్థానాల్లో ఉన్న ముగ్గురు ఐపీఎస్ అధికారులు ఆర్.బి. శ్రీకుమార్, రాహుల్ శర్మ, సంజీవ్ భట్‌లు సమర్పించిన సాక్ష్యాలు, ఆధారాలను తోసిపుచ్చడమే కాక, వారి విశ్వసనీయతనే ప్రశ్నించింది. అదనపు డీజీపీగా ఉన్న శ్రీకుమార్, అహ్మదాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న శర్మ, ఇంటెలిజెన్స్ విభాగంలో ఉన్న భట్ సమర్పించిన సీడీలు, ఫ్యాక్స్‌లు, ఆడియో రికార్డులు విశ్వసించదగినవి కావనీ, వాటిలో అనేకం నకిలీవని కమిషన్ అంటున్నది. మత కల్లోలాల వ్యాప్తిలో వారిపాత్రనూ, నివారణలో వైఫల్యాన్నీ తవ్వితీయవలసిన అవసరం ఉన్నదని సూచించింది. అక్కడక్కడ వీహెచ్‌పి, బజరంగ్‌దళ్ వంటి సంస్థలు దాడులకు పాల్పడినప్పటికీ, ఈ అల్లర్ల వెనుక ఏ మతసంస్థగానీ, పార్టీగానీ లేదనీ, పూర్తిగా 'గోద్రా' వేడి ఇందుకు కారణమని నిర్ధారించింది.

సబర్మతీ ఎక్స్‌ప్రెస్ ఘటనకు సంబంధించిన నివేదిక తొలిభాగం 2009లోనే వెలువడితే, తదనంతర మారణకాండకు సంబంధించిన రెండవభాగం శ్రీకుమార్ హైకోర్టులో కేసు వేసిన నేపథ్యంలో విడుదలైంది. కమిషన్ నిర్ధారణలను అటుంచితే, కరసేవకుల సజీవదహనానికి హిందువులను ప్రతీకారం తీర్చుకోనివ్వవలసిందిగా ముఖ్యమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలున్నందున తదనుగుణంగా వ్యవహరించమంటూ అప్పటి డీజీపీ పోలీసులను ఆదేశించారని శ్రీకుమార్ కమిషన్‌కు తెలియచేశారు. మంత్రులు, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర పెద్దలు ఊచకోతలు యథేచ్ఛగా సాగేట్టు ఇచ్చిన ఆదేశాల మొబైల్ ఫోన్ రికార్డులను రాహుల్ శర్మ సమర్పించారు. ఈ కారణంగా, వీరిద్దరి ప్రమోషన్లు నిలిపివేసి, గుజరాత్ ప్రభుత్వం వారిని రాచిరంపాన పెట్టిందని అంటారు. ఇక సంజీవ్‌భట్ కథ అందరికీ తెలిసిందే. ఇంటెలిజెన్స్ అధినేతగా తాను పాల్గొన్న మీటింగ్‌లోనే మోదీ ఊచకోతలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారనీ, మోదీ, ఆయన మంత్రులు, పోలీసు ఉన్నతాధికారులు ఊచకోతల నిరోధానికి ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించలేదని భట్ కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చారు. మరీ ముఖ్యంగా, గుల్బర్గ్ సొసైటీకీ, అందులో నివాసం ఉంటున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ ఎహ్సాన్ జాఫ్రీ ప్రాణానికీ ముప్పు ఉన్నట్టుగా తాను మోదీని ముందే హెచ్చరించానన్నారు. ఈ సొసైటీలో తీవ్ర హింస సాగి, జాఫ్రీ దహనమైన విషయం తెలిసిందే. దీనితో అప్పటివరకూ ప్రభుదాస్ వైష్ణానీ లాకప్‌డెత్ ఘటనలో భట్ పక్షాన నిలిచిన గుజరాత్ ప్రభుత్వం ఆయనపై కక్షసాధించడం ఆరంభించింది. సిఐడీ దర్యాప్తు భట్‌ను నిర్దోషిగా తేల్చిందంటూ ప్రాసిక్యూషన్‌కు సైతం అనుమతించని ప్రభుత్వం న్యాయస్థానంలో రివిజన్ పిటిషన్ ఉపసంహరించుకొని ప్రాసిక్యూషన్‌కు అనుమతించింది. అనుమతి లేకుండా సెలవు తీసుకున్నారన్న ఆరోపణతో కేంద్ర ప్రభుత్వం 2015లో భట్‌ను ఉద్యోగం నుంచి పీకేస్తే, ఓ న్యాయవాదిని డ్రగ్స్ కేసులో ఇరికించిన ఆరోపణలపై రాష్ట్రప్రభుత్వం భట్‌ను ఏడాదిపాటు జైల్లో తోసింది. ఆయన జైల్లో ఉండగానే, అక్రమ నిర్మాణమన్న వాదనతో ఇంటిని కూడా కూల్చేసింది. ఈ ఏడాది జూన్‌లో జామ్‌నగర్ సెషన్స్ కోర్టు ఈ మాజీ ఐపీఎస్ అధికారికి వైష్ణానీ కేసులో యావజ్జీవ ఖైదు విధించింది. లాకప్ డెత్ కేసులో ఒక ఐపీఎస్ అధికారికి ఈ శిక్షపడటం దేశచరిత్రలో అదే ప్రథమం. నరమేధాలకు ప్రత్యక్ష సాక్షులుగా నిలబడిన వారిని పాలకులు ఎలా శిక్షిస్తారో, కమిషన్లు పాలకులను ఎలా బయటపడవేస్తాయో ఈ పరిణామాలు మనకు తెలియచెబుతున్నాయి.

## అంపశయ్య పై 'అమ్మ భాష'

వచ్చే ఏడాదినుంచీ ప్రభుత్వ బడులన్నింటా తెలుగు మాధ్యమాన్ని ఎత్తివేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న అనూహ్య నిర్ణయం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో చదువుకునే విషయమై కనీసం పిల్లలు, వారి తల్లి దండ్రులు తమకు ఏదికావాలో ఎంచుకునే అవకాశం కూడా లేకుండా చేయడంపై భాషావేత్తలు సైతం విస్మయం చెందుతున్నారు. ఎటువంటి కసరత్తూ లేకుండా, సరైన అధ్యయనం చేయకుండా ప్రభుత్వం తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయం 5–15 ఏళ్ల మధ్యనున్న పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక విద్య ఖచ్చితంగా మాతృభాషలోనే ఉంటేనే శాస్త్రాలు సులభంగా బోధపడతాయని ఐక్యరాజ్య సమితి, యునెస్కో లాంటి సంస్థలు చెపుతున్నాయి. ఏ భాషలో విద్యాబోధన జరగదో ఆ భాష 40 సంవత్సరాలలో అంతరించిపోతుందని యునెస్కో హెచ్చరిస్తున్నా మన ప్రభుత్వానికి తలకెక్కకపోవడం విచిత్రం. పైగా ప్రజల్లో ఆంగ్ల మాధ్యమంపై ఉన్న మోజును ఆసరాగా తీసుకుని... ఉన్నత వర్గాల పిల్లలందరూ ఆంగ్ల మాధ్యమంలో చదువుతుంటే, బడుగు, బలహీనవర్గాల పిల్లలు తెలుగు మాధ్యమంలో చదివి ఎల్లకాలం వెనకబడి ఉండాలా అని పసలేని వింత వాదన ఈ ప్రభుత్వం తీసుకొస్తోంది. బడుగు బలహీనవర్గాల పిల్లలు మంచి ఉద్యోగాలు చేయడానికి కావాల్సింది ఆంగ్ల భాషలో ప్రావీణ్యం కానీ, ఆంగ్ల మాధ్యమంలో చదువు కాదు. పుట్టగొడుగుల్లా వెలిసిన ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రతి ఏటా లక్షలాది విద్యార్థులు బయటకు వస్తున్నా నాణ్యతలేని చదువుల వలన వారిలో 20శాతం మంది కూడా ఉద్యోగాలకు పనికి రారని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి లాంటి వారు ప్రస్తుతమున్న విద్యావ్యవస్థ లోపాలపై ఏనాడో విమర్శించారు. లోపం విద్యావ్యవస్థలో ఉందనీ, మాధ్యమంలో కాదని ఈ ప్రభుత్వం తెలుసుకోకపోవడం శోచనీయం.




1991లో మన దేశం సరళీకరణ ఆర్థిక విధానాలకు తెర తీసాక, విద్యావ్యవస్థ పూర్తి వ్యాపారంగా మారిపోయింది. కార్పొరేట్ ప్రపంచం తనకు అవసరమైన ఉద్యోగస్తులని తయారు చేసుకోవడానికి విద్యను ఓ ప్రాథమిక ఉత్పత్తి వనరుగా మార్చేసుకుంది. విద్య అంటే జ్ఞానం కోసం అనే అర్థం పోయి ఉద్యోగం కోసం, సంపాదన కోసం అనేది బలంగా నాటుకుపోయింది. అమెరికా వంటి దేశాలకు ఉద్యోగస్తులను ఎగుమతి చేసే విద్యావిధానాన్ని మనదేశం ఎప్పుడో అమలుపరచడానికి అలవాటు పడిపోయింది. ఆంగ్ల భాషను చిన్నిమనసులపై రుద్దుతున్నారు. తెలుగు భాషలో, తెలుగు సంస్కృతిలో పుట్టి పెరగాల్సిన బాల్యం ఆంగ్ల భాషతో, వారి సంస్కృతీ విశేషాలు చదువుకుంటూ ఇక్కడ పెరుగుతుంది. ఇక సాంకేతిక, వైద్య విద్యల్లో తెలుగు అసలు కనబడదు. డిగ్రీ స్థాయిలో, విశ్వవిద్యాలయాల్లో కూడా తెలుగు లేదు. తెలుగు ఎంఏ చదివే వాళ్ళు, దానిలో పరిశోధన చేసేవాళ్ళు మాత్రమే కనబడతారు. ప్రపంచం కుగ్రామంగా మారిన నేటి రోజుల్లో, అన్ని రంగాల్లో పోటీ పడాలంటే మనకీ ఆంగ్లం లాంటి అంతర్జాతీయ భాషలపై పట్టు ఉండాలి. అలా అనిచెప్పి మన తల్లిలాంటి మాతృ భాషని నిర్లక్ష్యం చేయడం ఎంతవరకూ సబబో మనం ఆలోచించుకోవాలి.

> **చదువు అనేది వ్యక్తిగతం కాదని అది సామాజికం అని, అంతిమంగా అది సమాజాభివృద్ధికి, సాటి మనుషుల కష్టాల్లో పాలుపంచుకునే మానవీయ సంవేదనలు కలిగించేదిగా విద్యావ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం కృషిచేయాలి. అదే సందర్భంలో వ్యాపార ప్రకటనలు పూర్తిగా తెలుగులోనే ఉండేలా చూడాలి. నామఫలకాలన్నీ స్వభాషలో ఉండేలా చూడాలి. శాస్త్ర, సాంకేతిక విద్యలు మాతృభాషలో చదువుకునేలా తెలుగు భాషా పదజాలాన్ని విస్తరింప చేయాలి.**

ఇప్పటికైనా ప్రభుత్వ వైఖరిలో మార్పు రావాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల్ని మెరుగుపరచాలి. రకరకాల దొంతరులుగా నడుస్తున్న పాఠశాల వ్యవస్థలన్నిటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి తగు కార్యాచరణను చేపట్టాలి. విద్యాహక్కు చట్టం ద్వారా 6 నుంచి 14 సంవత్సరాల వయసుగల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యనూ 1 నుంచి 8 వ తరగతి వరకు అందించాలి. పేదరికం లేదా మరో ఇతర కారణాల రీత్యా బడి మానేసే పిల్లలను దృష్టిలో పెట్టుకుని 6వ తరగతి నుంచీ రెసిడెన్షియల్ బడులను అవసరాన్ని బట్టి మండలాల్లో నెలకొల్పాలి. ప్రతి మూడువేల మంది జనాభాకు ఒక ప్రాథమిక పాఠశాలను, ప్రతి పదివేలమందికీ ఒక ఉన్నత పాఠశాలనూ ఏర్పాటుచేయాలి. అన్నిటికన్నా ముఖ్యంగా విద్యార్థులు కేవలం మార్కులు సాధించే యంత్రాలుగా కాకుండా వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా, వారి వ్యక్తిత్వం పరిణతి చెందేలా చదువుతోపాటు క్రీడలు, కళలు తదితర అంశాల్లో అభిరుచి, ప్రావీణ్యతలు పొందే విధంగా పాఠశాలల నిర్వహణ ఉండాలి. చదువు అనేది వ్యక్తిగతం కాదని అది సామాజికం అని, అంతిమంగా అది సమాజాభివృద్ధికి, సాటి మనుషుల కష్టాల్లో పాలుపంచుకునే మానవీయ సంవేదనలు కలిగించేదిగా విద్యావ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం కృషిచేయాలి. అదే సందర్భంలో వ్యాపార ప్రకటనలు పూర్తిగా తెలుగులోనే ఉండేలా చూడాలి. నామఫలకాలన్నీ స్వభాషలో ఉండేలా చూడాలి. శాస్త్ర, సాంకేతిక విద్యలు మాతృభాషలో చదువుకునేలా తెలుగు భాషా పదజాలాన్ని విస్తరింప చేయాలి. సచివాలయం మొదలుకుని అన్ని శాఖలు తెలుగులోనే పాలనావ్యవహారాలు నిర్వహించాలి. నాయకులు శాసనసభల్లో తెలుగులోనే చర్చలు కొనసాగించాలి. చలనచిత్రాలు మాతృభాషకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రోత్సాహకాలు ఏర్పాటు చేయాలి. విద్యావిధానంలో ఆయా రాష్ట్రాల సాంస్కృతిక వారసత్వానికి, పరిసరాలకు స్థానం ఇచ్చే పాఠ్యాంశాలను రూపొందించాలి. రాష్ట్ర ప్రభుత్వం భాషాప్రముఖుల్ని, విద్యావేత్తల్ని, భాషోద్యమకారుల్ని సమావేశపరచి మాతృభాషా సంరక్షణకు సంబంధించిన సలహాలు, సూచనలు తీసుకొని సత్వరం అమలుచేయాలి. అన్ని రాష్ట్రాలూ వారివారి భాషా వికాసంలో ముందుకెళ్తుంటే మన రాష్ట్రంలో పరిస్థితి దానికి భిన్నంగా ఉండడం దురదృష్టకరం. ఈ స్థితిలో మన మాతృభాషను కాపాడుకోవడం మనందరి బాధ్యత. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరుస్తుందని, ఇచ్చిన ఉత్తర్వుల(జీవో 81)ను వెనక్కి తీసుకొంటుందని మనందరం ఆశిద్దాం.

■ **కూసంపూడి శ్రీనివాస్**
అధికార ప్రతినిధి, జనసేన పార్టీ

# మూకదాడులకు మృదంగ సహకారం

*తక్షణం ప్రతీకారం కావాలని స్వప్నిక, ప్రణీతలు కోరుకోవడం సహజం. కానీ, ఆ కోరికను వరంగల్ యువత చేత అడిగి అడిగి చెప్పించిన దృశ్యమీడియా వైఖరిని ఆమోదించడం కష్టం. జరగబోయే ఎన్‌కౌంటర్‌కు ఇది భూమిక ఏర్పాటు చేసింది. ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్య అంగంగా ఉన్న మీడియా ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే దిశగా నడుచుకోవాలి తప్ప నాశనం చేసే దిశగా కాదు. సెన్సేషన్ కోసం ఇట్లాగే చేసుకుంటూ పోతే ఇతర ప్రజాస్వామ్య విధ్వంసకులను నిలదీసినట్టే మీడియాను కూడా నిలదీసే రోజులు వస్తాయి.*

**– డాక్టర్ కె. బాలగోపాల్**
*('అన్యాయ న్యాయానికి ఆమోదమా?', 2007)*




సందర్భం



■ కె. శ్రీనివాస్

పన్నెండేళ్ల కింద వరంగల్‌లో జరిగిన ఆసిడ్‌దాడి–ఎన్‌కౌంటర్ సంఘటనల అనంతరం బాలగోపాల్ ఇదే పత్రికలో రాసిన ఈ వ్యాసం ఇప్పటికీ ప్రాసంగికంగా ఉండడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అప్పుడు జరిగినట్టే, ఇప్పుడూ ఒక అఘాయిత్యం – ఎన్‌కౌంటర్ జరిగాయి. అప్పుడు ప్రజలలోని ఆగ్రహావేశాలను సంచలనాత్మకంగా మలచిన నేరం కేవలం దృశ్యమీడియాదే కావచ్చు, ఇప్పుడది అన్ని రకాల వార్తా సాధనాలకూ వర్తించవచ్చు. ఏ బాపతు ప్రజాస్వామ్య విధ్వంసకులనైనా ప్రజలు నిలదీస్తున్నారో లేదో తెలియదు, మీడియాను కూడా నిలదీస్తున్నారని అనుకోనక్కరలేదు. కానీ, సమాచార సాధనాలంటే రానురాను గౌరవం అడుగంటిపోతోంది. ఒక అప్రజాస్వామికమైన పర్యవసానాన్ని ప్రోత్సహించడమే కాదు, అందులో భాగస్వామ్యం తీసుకోవడానికి కూడా జర్నలిజం తహతహలాడుతున్నది.

వార్తలు చెప్పవలసిన గొంతు, దేశమంటే తానేనని హుంకరిస్తున్నది. టీవీ బాక్సులు బద్దలయ్యేలా కేకలు పెడుతున్నది. అక్కడికక్కడ తీర్పులు చెబుతున్నది. యుద్ధాలు చేస్తున్నది. శత్రువును గుర్తించి ద్రోహముద్రను అద్దుతున్నది. హత్యలను సమర్థిస్తున్నది.

వార్తలను రాయవలసిన చేయి కూడా నిష్పాక్షికత ఇరుసు మీద నిలబడలేక, అధికారం వైపు ఒరిగిపోతున్నది. అనేక అఘాయిత్యాల తరువాత, తెల్లవారి లేచి చూసుకుంటే, పాత్రికేయుల చేతికి కూడా ఎంతో కొంత నెత్తురు అంటి ఉంటున్నది.

ఇదేదో వ్యక్తుల పతనమో, సంస్థల స్వార్థమో కానక్కరలేదు. ఒక సమాజంలోని వివేకవంతుల శ్రేణి, విమర్శకుల బృందం, ఏ స్థాయిలో ఉంటే, ఆ సమాజపు అత్యున్నత వ్యక్తీకరణ కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది. పత్రికలు కూడా అంతే. అవి ఆవిర్భవించిన కాలంలో, అవి నాటి పౌర సమాజాన్ని ప్రతిబింబించాయి. సమాజం అంతా ఎంత అసమానతలతో, అవిద్యతో, అసంస్కారంతో ఉన్నా, దాని ఉన్నతస్థాయి చైతన్యానికి ప్రతినిధులుగా ఉన్నవారి విలువలే ఆదర్శాలుగా ఉంటాయి. ప్రధానస్రవంతి అని పిలిచే మెజారిటీ జన సముదాయం యథాతథ విలువలతో, హీన అధమ వ్యక్తీకరణలతో కూడిన సంవాదంలో కూరుకుపోయి ఉంటుంది. ఈ రెండు పౌరల మధ్య ఉండే తేడాను ప్రగతిశీలంగా తగ్గించుకుంటూ పోగలగడమే పురోగమనం. కానీ, విచక్షణ వివేకం కాక వేలంవెర్రిగా వ్యవహరించే మూకసాంస్కృతిక విలువలే ప్రధాన వేదిక మీదికి వచ్చి సమాజానికి తానే విలువల ప్రతినిధిని అని ప్రకటించుకుంటే ఎట్లా ఉంటుంది? నేటి మీడియా క్రమంగా ఆదర్శాలను వదిలి, యథాతథవాద, మూకస్వామ్య, వెకిలి, హీన, హింసాత్మక వ్యక్తీకరణల ఆకర్షణలోకి వేగంగా పతనమవుతున్నది. తరచి తరచి లోచూపును పెంచడం కాక, ఈలలు వేయించడానికి, కేరింతలు కొట్టించడానికి ఉత్సాహపడుతున్నది. మూకదాడులకు మృదంగసహకారం అందిస్తున్నది.

దిశను హత్య చేసిన హంతకులు, నేరశోధన ప్రక్రియలో, పోలీసులమీద దాడిచేసి ఎదురుకాల్పుల్లో హతులయ్యారు– అని పోలీసులు చెబుతున్నారు. కానీ, రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలు, అనేక రంగాల ప్రముఖులు అందరూ– అది ఉద్దేశ్యపూర్వకంగా, నేరస్థులకు బుద్ధిచెప్పడానికి చేసిన హత్యే అంటున్నారు. సాక్షాత్తూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా చటాన్‌పల్లి దగ్గర జరిగింది బూటకపు ఎన్‌కౌంటరే అన్నట్టుగా మాట్లాడారు. ఆయనకు అయితే, జాతీయ మానవహక్కుల కమిషన్ ఒక రాజ్యాంగ బద్ధ సంస్థ అని కూడా తెలియదు. ఏదో పౌరహక్కుల సంఘం లాంటి ప్రజాసంఘం అనుకుంటున్నాడు. ఎన్‌హెచ్ ఆర్‌సి– మీద చిరాకు పడడం ఇప్పుడు అందరికీ ఒక విప్లవాత్మక స్పందన. బూటకపు ఎన్‌కౌంటర్ అని గుర్తించి ప్రశంసిస్తేనేమో ఓకే. బూటకపు ఎన్‌కౌంటర్ అని ఖండిస్తే మాత్రం తప్పు. ప్రశంసించదగిన ఎన్‌కౌంటర్‌కు తగిన వాతావరణాన్ని సృష్టించడంలో మీడియా నిర్వహించిన పాత్ర అమోఘం. అదే ఎన్‌కౌంటర్ విషయంలో తరువాత చిక్కులొస్తే, ఆ వార్తలను పత్రికలు ప్రచురిస్తే పోలీసులకు కోపం.

హక్కుల గురించి మాట్లాడడమంటే, నేరస్థులను, నేరాన్ని సమర్థించడం అనుకునే వాతావరణాన్ని పెంచి పోషించారు. మీడియా చర్చల్లో చూడాలి, కొందరు యాంకర్లయితే, తీవ్రమయిన రక్తదాహంతో ఊగిపోతుంటారు. చనిపోయిన నలుగురు కాదు సమస్య. తక్కిన బాధ్యులే సమస్య. వరంగల్ ఎన్‌కౌంటర్ గురించి కూడా బాలగోపాల్ ఇలా అన్నారు. "పిల్లలు మానవతా విలువలకు దూరమవుతుంటే తల్లిదండ్రులు ఏం చేస్తున్నారని అడగనక్కరలేదు, వారు విద్యార్థులైతే వారి అధ్యాపకులు ఏం చేస్తున్నారని అడగనక్కరలేదు. వారితో కలసి సినిమాలకూ షికార్లకూ పోయే స్నేహితులు ఏం చేస్తున్నారని అడగనక్కర్లేదు. ప్రజాజీవితాన్నీ, సంస్కృతినీ అమానవీయంగా తయారుచేస్తున్న సకల సంస్కృతి బేహారులనూ మీ వ్యాపార లాభాల కోసం మీరేం చేస్తున్నారనీ అడగనక్కరలేదు." ఎవరైనా నేరానికి పాల్పడితే, నేరస్వభావాన్ని అలవరచుకుంటే అందుకు ఎందరు బాధ్యులుంటారో మనం గుర్తించామా? అన్నిటి కంటె ముఖ్యమైనది, పోలీసుల అసమర్థత, ఆ రాత్రి సకాలంలోనే పోలీసులను ఆశ్రయించి సాయం కోరిన కుటుంబానికి ఎటువంటి సమర్థత ఎదురయిందో తెలుసు కదా? వెలుతురు లేని టోల్ గేట్లు, యథేచ్ఛగా లారీలను పార్కింగ్ చేసిన డ్రైవర్లు, హైవేల మీద బార్లా తెరచిన మద్యం అంగళ్లు– ఏమేమి కలిసి ఆ కాళరాత్రిని సృష్టించాయో మరచిపోయి, ఆ నలుగురిని కాల్చేసినందుకు పూలవర్షాలు కురిపించింది సమాజం! ఇటువంటి దుర్మార్గాలు మళ్లీ జరగకుండా ఏమి చేయవచ్చునో కనీసం పక్కరాష్ట్రంలో ఆలోచనైనా చేశారు, తెలంగాణలో ఒక్కటంటే ఒక్కటి విధానపరమైన లేదా రాజకీయపరమైన నిర్ణయం తీసుకున్నారా? నిర్భయ తరువాత మీడియాలో జరిగినటువంటి చర్చ ఏదైనా తెలుగు సమాచార సాధనాల్లో జరుగుతోందా? మనుషుల్ని క్రూరులుగా అమానవులుగా తీర్చిదిద్దుతున్న పరిస్థితులేమిటో గుర్తించే ప్రయత్నం ఎక్కడైనా కనబడుతోందా?

> **అంతా పూర్తయ్యాక మిగిలేది ఏమిటి? ఒకటి ప్లస్ నాలుగు మరణాలు. న్యాయవ్యవస్థకు ఒక తిరస్కారం. పోలీసు అసమర్థత ఖననం. చట్టవిరుద్ధమయిన చర్యకు పూలవర్షం. రేపు ఈ చర్య ఎక్కడయినా జరగవచ్చు, జరిగిన ప్రతిసారీ వారు జేజేలు కోరవచ్చు. జేజేల కోసం మీడియాలో ముందస్తు సన్నాహాలు సిద్ధం కావచ్చు. మనసుల్ని సిద్ధం చేసి, మన మరణానికి మనలనే అర్రులుసాచేట్టు చేయవచ్చు. లోకంలో జరిగే పరిణామాలకు మీడియా తానే ఎందుకు ఉద్వేగపడాలి? ఆక్రందనో ఆక్రోశమో విలాపమో తానే ఎందుకు చేయాలి? తానే ఎందుకు కోపించుకోవాలి?**

స్త్రీలకు భద్రత అన్నది ఒక వాతావరణాన్ని సూచిస్తుంది. ఆ వాతావరణం సమకూరడానికి అనేక చర్యలు అవసరం. కుటుంబంలో ఆడపిల్లను తక్కువగా చూడడం, భార్యను వేధించడం, కోడళ్లను కాల్చుకు తినడం, ఉద్యోగ వృత్తిరంగాలలో పనిచేసే మహిళలతో అగౌరవంగా వ్యవహరించడం– ఇవీ, ఒక అపరిచిత రౌడీ మూక నిస్సహాయ యువతిపై హత్యాచారం చేయడం వేరు వేరు అంశాలు కావు. ఒకే అంశంలోని వేరువేరు వ్యక్తీకరణలు. ఆడవాళ్లకు మంత్రివర్గంలో స్థానమే లేకుండా ఒక పదవీకాలం అంతా నెట్టుకొచ్చిన ప్రభుత్వం, మహిళాకమిషన్ ఒకటి అవసరమన్న సంగతి కూడా గుర్తించని ప్రభుత్వం – పరోక్షంగా స్త్రీలపై హింసను పెంచడం లేదా, సాధికారతా భావనను అణగార్చడం లేదా? స్త్రీ పాత్ర లేని ఏకాంకిక వంటి ప్రభుత్వాలు, పాలనలు ఏ వాతావరణాన్ని సృష్టిస్తాయి?

అంతా పూర్తయ్యాక మిగిలేది ఏమిటి? ఒకటి ప్లస్ నాలుగు మరణాలు. న్యాయవ్యవస్థకు ఒక తిరస్కారం. పోలీసు అసమర్థత ఖననం. చట్టవిరుద్ధమయిన చర్యకు పూలవర్షం. రేపు ఈ చర్య ఎక్కడయినా జరగవచ్చు, జరిగిన ప్రతిసారీ వారు జేజేలు కోరవచ్చు. జేజేల కోసం మీడియాలో ముందస్తు సన్నాహాలు సిద్ధం కావచ్చు. మనసుల్ని సిద్ధం చేసి, మన మరణానికి మనలనే అర్రులు సాచేట్టు చేయవచ్చు.

లోకంలో జరిగే పరిణామాలకు మీడియా తానేఎందుకు ఉద్వేగపడాలి? ఆక్రందనో ఆక్రోశమో విలాపమో తానే ఎందుకు చేయాలి? తానే ఎందుకు కోపించుకోవాలి? రేస్‌కోర్సుల్లో గుర్రాలను రెచ్చగొట్టినట్టు పాఠకులను ప్రేక్షకులను ఎందుకు ప్రేరేపించాలి? సమాచారం ఇచ్చి, స్పందన ప్రేక్షకుడికి వదిలిపెట్టలేమా? శాంతి సమయంలో మాత్రమే మీడియా నిష్పాక్షికంగా ఉంటుందట, సంక్షోభకాలంలో వీరంగం వేస్తుందట, యుద్ధమే కనుక వస్తే, దానంత ఉన్మాది మరొకటి ఉండదట– ఎవరో పెద్దమనిషి అన్నాడు. ఇంతకంటె ఉదాత్త కర్తవ్యాన్ని స్వీకరించలేమా? సినిమా నిర్మాతల్లాగా, ప్రేక్షకులు కోరుతున్నారు కాబట్టి చెత్త ఇస్తున్నామని మీడియాకూడా సమర్థించుకోవాలా?

పాఠకులారా, ప్రేక్షకులారా, శ్రోతలారా, వార్తలతో పాటు ఇంత విషం కూడా ఉంటుందేమో జాగ్రత్త పడండి. విచక్షణతో వడగట్టి, నిగ్రహంతో ఆలకించండి. 'దిశ' పునరావృత్తం కాకుండా ఏమి చేయాలో అప్పుడు ఆలోచించండి. ■

---

కరపత్రం

## మానవ హక్కులవేదిక 8వ మహాసభలు

మన దేశ భవిష్యత్ దార్శనికులు భావి భారతం గురించి ఒక కల కన్నారు. ఎంతో ఆశ, విశ్వాసంతో దానికో రూపం కూడా ఇచ్చారు. అదే 1949 నవంబర్ 26న ఆమోదించబడిన భారత రాజ్యాంగం. మన రాజ్యాంగానికి నేటికి 70ఏళ్ళు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులన్నిటిలోకీ జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛ హక్కు తలమానికమైనవి. కానీ శాంతిభద్రతల పేరుతో పోలీసులు పౌరుల జీవించే హక్కుతోసహా అన్ని హక్కుల్నీ హరిస్తూనే ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో సాయుధ సైన్యాలు ప్రభుత్వ అండతో హత్యాకాండకు పాల్పడుతున్నాయి. కొత్తగా ఆధిపత్య వర్గాల మూక దాడులు, హత్యలు కూడా మొదలయ్యాయి. గొడ్డు మాంసం తిన్నారనే నెపంతో ముస్లింలనూ; కులాంతర వివాహమో, గుడిలోకి ప్రవేశించటమో కారణంగా దళితులనూ.. మతోన్మాద కులోన్మాద మూకలు వీధిల్లో బహిరంగంగా చంపుతుంటే, "ఇదేమి పాలన మోదీగారూ" అని 49మంది మేధావులు ప్రధానమంత్రికి లేఖ రాస్తే, ఆ 49మందిపై బిహార్‌లోని ముజఫర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో రాజ ద్రోహం కేసు నమోదు చేశారు. 'దోపిడి నుంచి రక్షణ పొందే హక్కు' రాజ్యాంగం కల్పించిన 3వ ప్రాథమిక హక్కు. ఎన్నో కార్మిక పోరాటాల ఫలితంగా ఆ హక్కు వచ్చింది. కానీ ఇప్పటి ప్రభుత్వాలు దేశీయ అంతర్జాతీయ కార్పొరేట్ల సేవలో అన్ని కార్మిక అనుకూల చట్టాలను తొలగించుకుంటూ పోవటం వల్ల ఈ హక్కు కూడా అనధికారికంగా తొలగింపబడిందనే అనుకోవాలి. తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగులు 50రోజులకు పైగా సమ్మె చేసినా వారి ఒక్క డిమాండ్ గురించి కూడా యాజమాన్యం ఏనాడూ నిజాయితీగా వారితో సంప్రదింపులు జరపకపోవటాన్ని చూశాం. తప్పుడు వార్తలు రాస్తున్న పాత్రికేయులపై కేసులు పెట్టాల్సిందిగా ప్రభుత్వ శాఖల అధిపతులను ఆదేశిస్తూ ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి జీవో జారీ చేశారు. నియంతలు, అవినీతిపరులు కదా కలాలంటే భయపడేది? ఓపెన్ కాస్ట్ గనుల పేరుతో సుక్షేత్రాలను బొందలగడ్డలుగా మారుస్తున్నవారు; నీటి పారుదల ప్రాజెక్టుల పేరిట భారీగా మానవ విస్థాపనకు, జీవవైవిధ్య నిర్మూలనకు పాల్పడుతున్నవారు.. వీరంతా రాజ్యాంగ స్ఫూర్తిని ధ్వంసం చేస్తున్నారు. 2017లో దేశంలో ఉత్పత్తి అయిన సంపదలో 73శాతం జనాభాలో ఒక శాతంగా ఉన్న పెద్ద పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఇలా కేంద్రీకృతమవుతున్న సంపద అంతా కూడా కేవలం ఆధిపత్య కులాల్లోని ధనికుల వద్ద మాత్రమే పోగుపడుతోంది. సమాచారహక్కు చట్టానికి కోరలు పీకి, ఊపా (UAPA) చట్టానికి కోరలు పెంచారు. రాజ్యాంగానికి లోబడి పని చేస్తూ, శాసన వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన స్వతంత్ర సంస్థలైన ఎన్నికల సంఘం, సి.బి.ఐ., ఆర్.బి.ఐ., న్యాయ వ్యవస్థలను కూడా అధికార రాజకీయాలకు అధీనం చేసుకున్నారు. ప్రభుత్వాల్ని ప్రశ్నించేందుకు, ప్రజల అవగాహనను పెంచేందుకు మానవ హక్కుల వేదిక ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంది. ఇందులో భాగంగానే మా సంఘం 8వ రాష్ట్ర (రెండు తెలుగు రాష్ట్రాల) మహా సభలు డిసెంబర్ 14, 15 తేదీలలో తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలోని క్షత్రియ కళ్యాణ మండపంలో జరుగుతున్నాయి. 14న సదస్సులో 'అయోధ్య తీర్పు–హిందూత్వ రాజకీయాలు' అంశంపై ప్రొ.అపూర్వానంద్, డిల్లీ విశ్వవిద్యాలయం; 'ఒక హక్కుగా భిన్న లైంగికత' అంశంపై ఇ.మనోహర్, స్వరాజ్‌అభియాన్, కర్ణాటక మాట్లాడతారు. మధ్యాహ్నం 'మీడియా–కశ్మీర్' అంశంపై ప్రవీణ్ దొంతి, జర్నలిస్టు (కారవాన్), డిల్లీ; 'వైకల్యం గల వ్యక్తుల హక్కులు' అంశంపై ఎం. పవన్ కుమార్, ఏలేశ్వరం మాట్లాడతారు. సాయంత్రం ఊరేగింపు, బహిరంగ సభ ఉంటాయి. డిసెంబర్ 15న సంస్థాగత కార్యక్రమం ఉంటుంది.

**– మానవ హక్కుల వేదిక**

## చట్టాలలోనే కాదు సమాజంలోనూ మార్పు రావాలి

దిశ, మానస, టేకు లక్ష్మి లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే గ్రామీణస్థాయినుండి ప్రజలలో ముఖ్యంగా యువతలో చట్టాలపట్ల, నైతిక విలువల పట్ల అవగాహన కల్పించాలి. ప్రతి గ్రామంలో చైతన్యవంతమైన కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహించాలి. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయాల వరకు బాలబాలికలకు, స్త్రీ పురుషులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. తెలంగాణలో 1,13,000లకు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయి. ఎక్కడ పడితే అక్కడ మద్యం ఏరులై పారుతుంది. మద్యం మత్తులోనే దిశ దుర్ఘటన జరిగింది. మద్యం నియంత్రణకై ప్రభుత్వాలు చొరవ చూపాలి. మద్యం అమ్మకాల మీద ప్రభుత్వాలు నడవకూడదు. నైతిక విలువల చట్రంలోనే ప్రభుత్వం నడవాలి. చలన చిత్రాలకు సర్టిఫికేట్లు ఇస్తున్న సెన్సార్ బోర్డు పనితీరును సరిదిద్దుకోవాలి. అప్పుడే సినిమాల్లో అశ్లీల దృశ్యాలు అదృశ్యమవుతాయి. సామాజిక మాధ్యమాలు, అశ్లీల వెబ్‌సైట్‌ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలి. స్త్రీలు తమ మీద తమకు విశ్వాసం కల్పించుకొనే దిశగా సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలి. అక్షరాస్యత, ఆరోగ్యం, న్యాయ పరిరక్షణ అనే విషయాలపట్ల అవగాహన కల్పించడంతోపాటు తగిన యంత్రాంగాన్ని సంకల్పతోడ్పాటును మహిళలకు అందించాలి. సాంకేతిక శాస్త్రాల ప్రాధాన్యతతోపాటు సామాజిక శాస్త్రాల ప్రాధాన్యతను రెట్టింపు స్థాయిలో పెంచాలి. ర్యాంకుల ప్రామాణీకరణ విద్యకు స్వస్తి పలికి క్యూబా, ఫిన్‌ల్యాండ్ లాంటి దేశాలలో అందిస్తున్న విలువలతో కూడిన విద్యను అందించాలి. తల్లిదండ్రులుసైతం పిల్లల పెంపకంలోను, విద్యలోను, సమాజంలోను ఆడ మగ వ్యత్యాసాలు, వివక్ష చూపకుండా ఇరువురికి సమానమైన ప్రాధాన్యతను కనబర్చాలి. ప్రభుత్వాలు కూడా ఘటనలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేయకుండా ప్రజల సహకారంతో ఆడపిల్ల రక్షణను బాధ్యతగా తీసుకొని ముందుకు సాగాలి. అధికారమనేది మానవీకరణ చెందాలి. అప్పుడే సమాజం మానవీకరణ చెందుతుందని తెలంగాణ విద్యావంతుల వేదిక బలంగా నమ్ముతుంది.

**– పందుల సైదులు,** తెలంగాణ విద్యావంతుల వేదిక

## శిక్షలు అవసరమే, కానీ..!

సత్ విలువలతో కూడినది భారతీయ సమాజం. వేదాలు, ఉపనిషత్తులు, ప్రబంధాలు, గ్రంథాలు, మహర్షుల ఆదర్శాలు, మహాపురుషుల సందేశాలు మన దేశం నిండా నిక్షిప్తం. కురుసభలో దుశ్శాసనుడు ద్రౌపది చీరలాగితే, కన్నీళ్ళుపెట్టిన దేశం మనది. సీతమ్మను రావణాసురుడు ఎత్తుకెళితే, 'రావణ అంతం సహేతుకమే' అని పలికిన పుణ్యభూమి మనది. యుగాల నాటి ఆ పురాణ గాథలకే మనం అలా స్పందిస్తే, కళ్ళ ముందు జరుగుతున్న రాక్షస చర్యలపై ఇంకా తీక్షణంగా స్పందించాలి. సంస్కారం భారతీయ జన్మస్థానం. అయితే, పరదేశ సంస్కృతి ప్రవేశించి నాగరికత వెర్రి తలలు వేస్తోంది. కట్టు, బొట్టు మారాయి. కల్చర్ మారింది. భారతీయులు కలల ప్రపంచం వైపు మక్కువ చూపటం ఎక్కువయ్యింది. బిజీ ప్రపంచంలో, రూపాయి నాణేల అంచులపై పరుగులు తీయడంలో పడి బిడ్డల యోగ క్షేమాలపై ధ్యాసపెట్టడం మరచిపోయాం. పిల్లలకు కావలసిన ప్రేమ, ఆప్యాయతలను పంచడానికి తీరికలేని పరిస్థితి. భారతీయ సంస్కారాన్ని, క్రమశిక్షణను నేర్పడం లేదు. పర్యవసానంగా పిల్లలు పెద్దల మాటలను ఖాతరు చేయటం లేదు. పాశ్చాత్య పోకడలు, అశ్లీల మాధ్యమాలు మన గుమ్మాలుదాటి బెడ్‌రూమ్స్‌లోకి ప్రవేశించాయి. 'స్మార్ట్ మాయలో పడ్డ యువతరం అర్థంలేని, అనర్థంతెచ్చే ఎన్నో పనులను అనాలోచితంగా చేసేస్తుంది. ఈ భయానక పరిస్థితులలో రాజ్యాంగం పొందుపరచిన వ్యవస్థలను పటిష్టం చేసుకుంటే, పటిష్టంగా అమలు చేయగలిగితే ఇలాంటి వికృత క్రీడలు కనిపించవు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పినట్టు 'కావాల్సింది రాజకీయ సంకల్పం. న్యాయ వ్యవస్థ, ప్రభుత్వాలు, మనందరం కలిసి ఇలాంటి రుగ్మతలకు సమాధానం ఇవ్వాలి. అంతకు మించిన ప్రత్యామ్నాయం లేదు'. విద్యార్థి దశ నుండే పాఠశాలల్లో సామాజిక అవగాహన పెంపు చేసేలా పాఠ్యాంశాలను మార్చాలి. అన్ని వ్యవస్థల్లోనూ ప్రక్షాళన జరిగి తరిగిపోతున్న మానవ విలువలను పునఃప్రతిష్ఠించేలా ప్రభుత్వాలు పూర్తి బాధ్యతను స్వీకరించాలి. సమాజంలో దేశీయ సంస్కృతి, సంస్కారాల విప్లవాన్ని సృష్టించాలి. మొక్కలు నాటినట్లు భావితరాల మెదళ్ళలో భారతీయ సంస్కృతిని నాటగలగాలి. అప్పుడే నిర్భయ, దిశ, మానస వంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించగలుగుతాం.

**– వసంత నాగేశ్వరరావు,** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మాజీ మంత్రి




## వారినీ ఎన్‌కౌంటర్ చేయగలరా?

పక్కా ప్లాన్ ప్రకారమే దిశ కేసు నిందితుల ఎన్‌కౌంటర్ జరిగింది. ఎన్‌కౌంటర్ చేయడమంటే న్యాయస్థానాలను తోసిరాజనడమే! పోలీసులు అబద్ధం చెబుతున్నారు. చేతిలో ఆయుధాలే లేని నలుగురు యువకులు 10 మంది పోలీసులపై ఎలా దాడి చేశారు?. అదీ తెల్లవారు ఝామునే చేయగలరా? ఎన్‌కౌంటర్ జరిగేంత వరకూ బాధితులు పోలీసు కస్టడీలోనే ఉన్నారు. చట్టాలు, కోర్టులపై నమ్మకంలేని ప్రజలను సంతృప్తి పరచడానికే ఇలాంటి రాజకీయ గిమ్మిక్కులు జరుగుతుంటాయి. ఇలాంటి కేసుల్లో పై కోర్టుల్లో అప్పీల్ చేసుకునే అవకాశం లేకుండా వారం రోజుల్లోనే కేసును పూర్తిచేయాలి. ప్రజలు, దోషుల కుటుంబ సభ్యుల ముందే బహిరంగంగా తీర్పును (ఉరి అయినా, కాల్చివేత అయినా) అమలు చేయాలి. ఉరి, కాల్చివేత కాకుండా కఠిన శిక్ష అయినా సరే ప్రజలు చూసేలా ప్రత్యక్ష ప్రసారం చేయాలి. ప్రేమ వంచనలు, వరకట్న వేధింపులు, గృహ హింస, అత్యాచారాలు, దాడులు, తదితర మహిళలపై జరిగే అకృత్యాల విచారణ కోసం ప్రత్యేక 'అట్రాసిటీ' కోర్టులు ఏర్పాటు చేయాలి. దిశ ఎన్‌కౌంటర్‌పై నిర్ణయం తీసుకున్న రాజకీయ నాయకులు/ అధికారులే ఈ నిర్ణయం తీసుకోవాలి. తెలంగాణ ముఖ్యమంత్రికి తెలియకుండా ఈ ఎన్‌కౌంటర్ జరగలేదు. తెలిసే జరిగింది కాబట్టి ఆయనను, డీజీపీని, సజ్జనార్‌ను 'ప్రాసిక్యూట్' చేయాలి. ప్రజలు భావోద్వేగంలో ఉన్నారు. సినీ నటులతో సహా ఎన్‌కౌంటర్‌ను సమర్థించిన 95శాతం మంది తప్పు చేసినట్టే. మహిళలపై నేరాలకు పాల్పడే ఇతరులనుకూడా ఇలాగే ఎన్‌కౌంటర్ చేస్తారా? చట్టవిరుద్ధంగా హతమార్చడం కూడా నా దృష్టిలో అత్యాచారం చేసినట్టే. ప్రత్యూష, ఆయేషాపై హత్యాచారం చేసిన వారు బడాబాబులు, రాజకీయ నేతల బిడ్డలైతే సత్యంబాబు లాంటి అమాయకులపై నేరం మోపడం మరో జిమ్మిక్కు. ప్రత్యూష కేసులో చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్.. ఎవరూ న్యాయం చేయలేకపోయారు ఎందుకు? ఈ కేసుల్లోని నిందితులను టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్‌కౌంటర్ చేయగలదా?

**– డాక్టర్ ప్రసాద్,** కాలిఫోర్నియా, అమెరికా

## వ్యవస్థీకృత అత్యాచారాలివి!

ప్రపంచీకరణతో వృత్తులు దెబ్బతిన్నాయి. ఉపాధులు, ఉద్యోగాలు ఊడాయి. గ్రామీణ నిరుపేదలు పట్టణాలకు వలసవచ్చారు. అక్కడి మురికివాడల్లో ఒక్క గది గుడిసెలే వారి ఇళ్ళు. పెద్దల దాంపత్య జీవిత కార్యక్రమాలు యుక్తవయసు పిల్లలకు నిత్య దృశ్యాలు. పనిస్థలాల్లో ఆడవాళ్ళు అత్యాచారాలకు గురవుతున్నారు. పిల్లలను బళ్ళకు పంపే స్తోమత ఈ పేదలకు లేదు. పిల్లలు హోటళ్లలో, సారా అంగళ్ళలో, బార్లలో, పబ్బుల్లో పని చేస్తారు. అక్కడి అకృత్యాలు చూస్తూ ఉంటారు. సంపన్నుల పిల్లల జీవన శైలిని చూసి ఈర్ష్యాద్వేషాలు పెంచుకుంటారు. అవకాశం దొరికితే వాళ్ళపై కక్ష తీర్చుకునే ప్రయత్నం చేస్తారు. మానసిక ఉద్విగ్నతలకు గురై మానభంగాలు, హత్యలు, ఇతర నేరాలకు పాల్పడతారు. ప్రపంచాన్నే కుదిపిన నిర్భయ, దిశా అత్యాచారులు ఈ కోవకు చెందిన వారే. ప్రపంచీకరణ ప్రభావాలకు మహిళలూ అతీతులు కాదు. అక్కడక్కడా ఆడవారి అకృత్యాలు వాటి ఫలితమే.

ఆధునిక ఆధ్యాత్మిక గురువులు అతివల అత్యాచార హత్యా చక్రవర్తులు. వీరిని పాలకులు సమర్థించారు. రాజకీయ లబ్ధి పొందారు. పాలకపక్ష నాయకులూ ఈ వికృత కార్యవీరులే. 2012లో కర్ణాటకలో జరిగిన భారత పోలీసు ఉన్నతాధికారుల నేరనిరోధక సభ 'సారా నిషేధించి 80% సిబ్బందిని తగ్గించండి. శాంతిభద్రతలు కాపాడతాం' అని ప్రతిపాదించింది. ప్రజలను మత్తుల్లో ముంచి ప్రశ్నించే వారు లేకుండా చేసిన పాలకులు అన్ని కమిటీల నివేదికలలాగే ఈ సభ తీర్మానాన్ని తుంగలో తొక్కారు. ఉద్వేగాలతో సమస్యలు పరిష్కారం కావు. ఉద్వేగ, ఉద్రేక, భావజాలాలే ఇటీవల కొంపలు ముంచాయి. అర్భకులనుకున్నవారికి మరలా పట్టంకట్టాయి. వ్యక్తుల శిక్షలు వ్యక్తుల వరకే. మరణ శిక్ష ప్రభావం శూన్యం. రోగానికి చికిత్స కంటే నిరోధం ముఖ్యం. మన ఆశయాలు, ఆచరణ ఒకటే కావాలి. చెప్పిందే చేయాలి. మహిళలకు సంపూర్ణ ఉచిత విద్య, శాసన సభల్లో, పాలనా విధాన నిర్ణయాల్లో, న్యాయస్థానాల్లో జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఉండాలి. ఇది సమాజ నిర్మాణానికి, నిర్వహణకు, సామాజిక రుగ్మతల నిరోధానికి, చికిత్సకు ఉపయోగకారి కాగలదు. సంబంధిత ప్రభుత్వ సంస్థల్లో పెళ్లి నిర్ణయం ముందుగా నమోదు చేసుకోవాలి. ఆ సంస్థలు కాబోయే దంపతులకు దాంపత్య జీవిత విధానాల్లో శిక్షణ ఇవ్వాలి. గర్భం ధరించగానే కూడా ప్రభుత్వ సంస్థల్లో నమోదు చేసుకోవాలి. ఈ సంస్థలు శాస్త్రీయపద్ధతుల్లో పిల్లలను పెంచే విధానాలు నేర్పాలి. పిల్లలందరికీ నిర్బంధంగా ఉచితంగా శాస్త్రీయ విద్య నేర్పాలి. పిల్లల తప్పులకు తల్లిదండ్రులను, గురువులను శిక్షించే శిక్షాస్మృతి ఉండాలి. రాజ్యాంగ విధులు నిర్వహించని, ప్రజాస్వామ్య పద్ధతులు పాటించుకోని, సమాజ వినాశక విధానాలు పాటించిన రాజకీయ నాయకులను శిక్షించటమే కాక రాజకీయాలకు అనర్హులుగా ప్రకటించాలి. ఈ మేరకు రాజ్యాంగ సవరణ చేయాలి.

**– సంగిరెడ్డి హనుమంత రెడ్డి**
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

**చదివింది ఇంజనీరింగ్... తండ్రి వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలనుకుంది. కానీ అనుకోకుండా ఆమె దృష్టి రైతులపై పడింది. వారి కష్టాలను అధ్యయనం చేసి... చిన్న, సన్నకారు రైతుల అవసరాలకు సరిపడే వ్యవసాయ యంత్రాల తయారీకి నడుం బిగించింది. 'కమల్ కిసాన్' పేరుతో రైతులకు ఉపయుక్తమైన యంత్రాలను రూపొందిస్తూ, వ్యవ'సాయం' చేస్తున్నారు దేవీ మూర్తి. "నా క్లాస్‌మేట్స్ ఇచ్చిన సలహాతో రైతులకు చేదోడువాదోడుగా ఉండే యంత్రాల తయారీలోకి అడుగుపెట్టా. సేవాభావంతో కూడుకున్న ఈ బిజినెస్ నాకు ఎంతో సంతృప్తినిస్తోంది" అంటున్న ఈ యువ ఔత్సాహిక వ్యాపారవేత్త చెబుతున్న సంగతులివి....**







శ్రీ శక్తి

# రైతన్నలకు దన్నుగా...

"మాది బెంగళూరు. బిజినెస్ కుటుంబం. కమర్షియల్ ఆటోమోటివ్ కాంపోనెంట్స్ తయారీ వ్యాపారం ఉంది. నేను అమెరికాలోని ఫిలడెల్ఫియాలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేశా. దాంతో పాటే ఎంబీఏ గ్రాడ్యుయేట్‌ను కూడా. ఐ.ఐ.ఎం. బెంగళూరులో ఆంత్రోప్రెన్యూర్‌షిప్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశా.

ఫిలడెల్ఫియాలో కొంతకాలం ఉద్యోగం చేశాక 2009లో మన దేశానికి తిరిగొచ్చా. ఆ తర్వాత బెంగళూరులోని మా ఆటోమోటివ్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ (కమల్ బెల్స్)ను చూసుకునే బాధ్యతలు చేపట్టా. షీట్ మెటల్ ఉత్పత్తుల తయారీ ప్రారంభించా. అందులో నాకున్న సామర్థ్యాన్ని చూసి 'వ్యవసాయ పరికరాల ఉత్పత్తులు చేపడితే బావుంటుందం'టూ నా క్లాస్‌మేట్స్ సూచించారు. నాకు వారి సూచన నచ్చింది కానీ నేను పూర్తిగా నగరాల్లో పెరిగినదాన్ని. గ్రామాల్లో వ్యవసాయం నాకు అర్థమవుతుందా! అని మొదట్లో సందేహించా. అయితే మిత్రులు ప్రోత్సహించడంతో రెండేళ్లకు పైగా దేశమంతా తిరిగి, వ్యవసాయరంగాన్ని అధ్యయనం చేశా. మార్కెట్‌లో ఉన్న వ్యవసాయ యంత్రాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించా. వ్యవసాయ అధ్యయన సంస్థలకు వెళ్లి నా సందేహాలను నివృత్తి చేసుకున్నా. కొంత అవగాహనకు వచ్చిన తర్వాత 'కమల్ కిసాన్' సంస్థను 2013లో ఏర్పాటుచేశా. తక్కువ ఖర్చుతో చిన్నతరహా రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యంత్ర పరికరాలను తయారుచేయడం ప్రారంభించా.

## రైతుల అవసరాలకు తగ్గట్టు...

పొలంలో వినియోగించుకునేందుకు మనం విదేశాల నుంచి చాలా డబ్బులు పోసి వ్యవసాయ యంత్రాలను తెప్పించుకుంటున్నాం. కానీ తీరా వాడకం దగ్గరికి వచ్చేసరికి రైతులకు వాటితో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. మన వ్యవసాయ విధానాలకు ఆ యంత్రాలు సరిపడేవి కావు. వాటిపై భారీగా డబ్బు పెట్టి రైతులు నష్టపోయేవారు. అలాంటి సమస్యలను గుర్తెరిగి యంత్రాల తయారీ చేయడంలో వ్యవసాయ నేపథ్యం ఉన్న నా ఐ.ఐ.ఎం. క్లాస్‌మేట్స్ సహకరించారు. రైతులకు ఏది అవసరమో, వారి పంటలకు ఏది ఉపయోగమో వాటిని మనం అందిస్తే రైతులు ఆదరిస్తారని అప్పుడు అర్థమైంది. వారికి కావాల్సిన వ్యవసాయ యంత్రాలను తయారుచేసి తక్కువ ధరకు ఇవ్వడం మొదలెట్టా. వాటిని కొన్న రైతులు చిన్న రైతులకు అద్దెకు ఇవ్వడం మొదలెట్టారు. ఇది నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ రెంటల్స్ పద్ధతిలో మా వ్యవసాయ యంత్రాలు ఆంధ్ర, కర్నాటకలో పదివేల మంది రైతులకుపైగా చేరాయి. దాంతో మా సంస్థకు ప్రోత్సాహకంగా ఐఐటీ చెన్నై 'రూరల్ టెక్నాలజీ అండ్ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్' నుంచి ఐదు లక్షల రూపాయల నిధుల సహాయం అందింది.

## నమ్మకం కలిగించడానికి...

చిన్నకారు రైతులకు ఉపయోగపడే వెజిటబుల్ ప్లాంటర్‌ని 2015లో తయారుచేసి రైతులకు అందించాం. ఆ పరికరానికి మంచి స్పందన వచ్చింది. వ్యవసాయంలో రైతులు నేడు ప్రధానంగా ఎదుర్కొంటున్నది కూలీల సమస్య. అందుకే చిన్న, సన్నకారు రైతులకు శక్తివంతంగా, వారి అవసరాలకు తగినట్టు ఉపయోగపడే వ్యవసాయ యంత్రాలు రూపొందించాం. ప్రారంభంలో మా వ్యవసాయ పరికరాలు బాగా పనిచేస్తాయని రైతుల్లో నమ్మకం కలిగించడానికి ఎంతో కష్టపడ్డాం. మేము రూపొందించిన వ్యవసాయ యంత్రాల ఇంటర్వెన్షన్ల ద్వారా రైతుల లేబర్ ఖర్చులను 50 శాతం తగ్గించగలిగాం.



> **రైతుల్లో యంత్రాలకు సంబంధించి రెంటల్ కాన్సెప్టును కూడా మేము తెచ్చాం. దీనివల్ల రైతులకు అదనంగా డబ్బు వస్తుంది. వ్యవసాయ పరికరాలకు సంబంధించి రెంటల్ వ్యవస్థను టాటా ట్రస్టు, సోషల్ ఆల్ఫా సహాయంతో ఏర్పాటుచేశాం. జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ వ్యవస్థ కొనసాగుతోంది.**

'కమల్ కిసాన్' ద్వారా ఇప్పటిదాకా సుమారు 20 వేల మంది రైతులు లబ్ది పొందారు. రాబోయే ఐదేళ్లలో మా వ్యాపారాన్ని మరింత విస్తరించాలనుకుంటున్నాం. వ్యవసాయ పనులకు యంత్రాలు వాడే రైతులు మనదేశంలో రెండు శాతం కన్నా తక్కువగా ఉన్నారు. మరో విషయం ఏమిటంటే ఏడాదికి లక్షకు పైగా రైతులు సమర్థమైన యంత్రాలు లేక, వ్యవసాయ కూలీల ఖర్చులు భరించలేక చివరకు వ్యవసాయాన్ని వదిలేస్తున్న పరిస్థితిని సైతం చూస్తున్నాం. అందుకే సైంటిఫిక్‌గా, రైతుల అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీని వ్యవసాయ పనులకు తగ్గట్టుగా డిజైన్ చేస్తే సాగు రంగం లాభాల బాట పడుతుంది.

## కస్టమైజ్డ్‌గా కూడా అందిస్తాం..

ఇప్పటివరకూ మేము ఎనిమిది రకాల వ్యవసాయ పరికరాలు తయారుచేశాం. వాటిల్లో వెజిటబుల్ ప్లాంటర్, ముల్చ్ లేయర్, రైజ్డ్ బెడ్ మేకర్, బ్యాక్‌ప్యాక్ వీడర్, ముల్చ్‌హోల్ మేకర్, షుగర్‌కేన్ ప్లాంటర్ లాంటివి వినూత్న ఆవిష్కరణలని చెప్పాలి. అలాగే రైతులకు వ్యవసాయపనుల్లో అవసరమైన వాటిని వారు కోరుకున్న విధంగా (కస్టమైజ్డ్‌గా) కూడా అందిస్తాం. అలాగే ఇంతకు ముందు లేని యంత్రాలను తయారుచేస్తాం.

## వ్యవసాయ క్షేత్రంలో రైతుల మధ్యనే...

కొన్ని పరికరాల ఉత్పత్తులు చిన్నకారు రైతులకు బాగా ఉపయోగపడతాయి. ఉదాహరణకు 'మల్చ్ లేయర్' వల్ల ఆరుగురు కూలీలు అవసరం ఉన్న చోట కేవలం ఇద్దరితో పని పూర్తవుతుంది. సమయం కూడా ఆదా అవుతుంది. 'వెజిటబుల్ ప్లాంటర్' చిన్నతరహా రైతులకు అవసరమవుతుంది. రైతుల్లో యంత్రాలకు సంబంధించి రెంటల్ కాన్సెప్టును కూడా మేము తెచ్చాం. దీనివల్ల రైతులకు అదనంగా డబ్బు వస్తుంది. వ్యవసాయ పరికరాలకు సంబంధించి రెంటల్ వ్యవస్థను టాటా ట్రస్టు, సోషల్ ఆల్ఫా సహాయంతో ఏర్పాటుచేశాం. జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ వ్యవస్థ కొనసాగుతోంది.

దేశంలో ఎక్కడ రైతు ప్రదర్శనలు జరిగినా హాజరవుతుంటాను. ఆఫీసులో కన్నా వ్యవసాయ క్షేత్రాలలో, రైతుల మధ్యే ఎక్కువ సమయాన్ని గడుపుతా. రైతుల సమస్యలు తెలుసుకుంటూ వారికి ఎలాంటి పరికరాలు, యంత్రాలను తయారుచేయాలని నిత్యం ఆలోచిస్తూ ఉంటా. అందుకోసం వారితో ఇంటరాక్ట్ అవుతుంటా. ఆయా యంత్రాలను తక్కువ ఖర్చుతో ఎలా తయారుచేయవచ్చో నా సిబ్బందితో కలిసి ప్రణాళికలు రచిస్తుంటా. 'వ్యాపారం అంటే కేవలం రెవెన్యూ పెంచుకోవడమే లక్ష్యం కాకూడదు. అది మన పరిసరాలు, వాతావరణం తదితరాలపై మంచి ప్రభావాన్ని తీసుకురాగలగాలి' అని నమ్ముతా. మన దేశంలోని 83 శాతం మంది చిన్న, సన్నకారు రైతులకు యాంత్రీకరణ అందుబాటులోకి రావాలి. 'కమల్ కిసాన్' రైతన్నలకు పచ్చదనపు పొలిమేరలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా చూపుతుందని గట్టిగా విశ్వసిస్తున్నా."

● నాగసుందరి

---

బ్యూటీ



# యవ్వన చర్మానికి నువ్వుల నూనె!

చర్మం, కురుల అందం, ఆరోగ్యం కోసం రకరకాల సౌందర్య ఉత్పత్తులు వాడుతాం. అయితే వంటింట్లో లభించే నువ్వులు, వాటి నూనె కూడా సౌందర్య సాధనాలుగా పనికొస్తాయి. వీటిలోని లవణాలు, విటమిన్లు ఒంటిని, జుట్టును తాజాగా కనిపించేలా చేస్తాయి. నువ్వుల నూనెతో సోయగాన్ని పెంచుకోవడం ఎలాగో చూద్దాం ...

**చర్మం కాంతిమంతంగా:** ఒంటికి నువ్వుల నూనెతో మర్ధన చేసుకుంటే ఎర్ర మచ్చలు తగ్గి చర్మం మృదువుగా, కోమలంగా మారుతుంది. ఒక టేబుల్ స్పూను ఆలివ్ ఆయిల్‌లో రెండు టేబుల్ స్పూన్ల నువ్వుల పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖాన్ని శుభ్రం చేసుకున్న తరువాత ఫేషియల్‌గా రాసుకోవాలి. వారంలో రెండుసార్లు ఇలా చేస్తే మొటిమలు, మలినాలు తొలగి ముఖం కాంతిమంతంగా కనిపిస్తుంది.

**సన్‌బర్న్ మాయం:** నువ్వుల నూనెలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎండకు కమిలిపోయిన చర్మానికి, కాలిన గాయాలకు మందుగా పనిచేస్తాయి. నువ్వులలో ఉండే సెసామిన్ చర్మాన్ని తాజాగా, ఆరోగ్యంగా ఉంచేందుకు తోడ్పడే విటమిన్ ఇ పనితీరును వేగవంతం చేస్తుంది.

**కురులు ఆరోగ్యంగా:** నువ్వుల నూనెలోని ఒమేగా 3, ఒమేగా 6 ఫ్యాటీ ఆమ్లాలు వెంట్రుకలు పోషణ ఇచ్చి, కండిషనింగ్ చేసి మాడును ఆరోగ్యంగా ఉంచుతాయి. గోరువెచ్చని నువ్వుల నూనెతో కురులకు మసాజ్ చేస్తే కుదుళ్లకు రక్తప్రసరణ పెరుగుతుంది. దాంతో కేశాలు ఆరోగ్యంగా, పొడవుగా పెరుగుతాయి.

**ఫేస్‌మాస్క్‌గా:** రాత్రి పడుకునే ముందు కొద్దిగా నువ్వుల నూనె రాసుకుంటే చర్మం మీది మలినాలు తొలగి ముఖం తాజాగా మారుతుంది. రాత్రి పూట ముఖం కడుక్కున్న తరువాత సగం కప్పు యాపిల్ సిడార్ వెనిగర్, ముప్పావు కప్పు నీళ్లలో సగం కప్పు నువ్వుల నూనె కలిపిన మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి.

తెలుసుకుందాం!

## ఇవి మానేద్దాం...

- సన్‌గ్లాసెస్ పెట్టుకోకపోవడం, దూరంగా ఉన్న బొమ్మను ఒక కన్ను మూసి మరో కన్నుతో చూడడం వల్ల ముఖం భాగంలోని కండరాల మీద ఒత్తిడి పడుతుంది. దాంతో చర్మం త్వరగా ముడతలు పడే అవకాశం ఉంది.
- ఎక్కువ మోతాదులో షుగర్ ఫుడ్ తీసుకోవడం వల్ల చర్మంలో అంతర్భాగంగా ఉండే కొల్లాజెన్ ప్రొటీన్ దెబ్బతింటుంది. దాంతో చర్మం పటుత్వం కోల్పోయి, ముడతలు ఏర్పడతాయి.

---

**పిల్లలకు పాఠాలు చెప్పడమే కాదు... వ్యాధి సోకిన చెట్లకు వైద్యం చేయడమూ ఆయనకు తెలుసు. 'జబ్బు పడిన మనిషికి వైద్యం చేసి ఎలాగైతే మామూలు మనిషిని చేయొచ్చో... గాయపడిన, వ్యాధికి గురైన చెట్లకూ మందు రాసి అలాగే నయం చేయొచ్చ'ని నమ్ముతారు ప్రకృతి ప్రేమికుడైన కె. బిను. ఆరేళ్లుగా చెట్లకు చికిత్స అందిస్తున్న ఈ 'ట్రీ డాక్టర్' విశేషాలివి...**



# ఈయన చెట్ల డాక్టర్!

పంచె కట్టు, నుదుట బొట్టుతో కేరళ సంప్రదాయ వస్త్రధారణలో ఉండే బిను ఓ ప్రకృతి ప్రేమికుడు. ఉదయాన్నే స్కూలుకు వెళ్లి పాఠాలు చెప్పే ఆయనకు ప్రకృతి వైద్యం మీద ఆసక్తి ఉంది. ఆ ఆసక్తితోనే చరకుడు, శుశ్రుతుడు రాసిన ప్రాచీన గ్రంథాలు తిరగేశారు. చెట్లకు వచ్చే వ్యాధులు, వాటి వైద్య చికిత్సల గురించి అవగాహన పెంచుకున్నారు. చుట్టుపక్కల ఎక్కడైనా వ్యాధి సోకిన చెట్టు కనిపిస్తే చాలు దాన్ని తిరిగి మామూలుగా చేసేదాకా ఆయన వదలడు. ఆవిధంగా ఇప్పటి వరకూ 23 చెట్లకు తిరిగి ప్రాణం పోశారాయన. వాటిలో వంద ఏళ్ల వయసున్న చెట్లు కూడా ఉన్నాయి. ప్రముఖ పర్యావరణవేత్త సీతామూర్తి స్ఫూర్తితో గత ఆరేళ్లుగా చెట్లకు ఉచితంగా వైద్యం చేస్తున్నారు బిను.

**పనస చెట్టుకు జీవం పోశాడు...**

కొట్టాయం జిల్లాలోని ఒక దేవాలయంలో 130 ఏళ్ల నాటి పనస చెట్టు ఉంది. దానికి పెద్ద పెద్ద పనస కాయలు కాసేవి. ఒకరోజు దాని మీద పిడుగు పడడంతో చెట్టు సగభాగం కాలిపోయింది. దాంతో ఆ చెట్టును 'కొట్టేద్దాం' అనుకున్నారు పూజారులు. ఆ విషయం ఆ నోటా ఈనోటా బినుకు తెలిసింది. వెంటనే ఆయన అక్కడకు చేరుకుని ఆ చెట్టును పరిశీలించి 'నాకు ఆరు నెలలు సమయం ఇస్తే, ఈ చెట్టుకు వైద్యం చేసి పనస కాయలు కాసేలా చేస్తా' అని చెప్పారు. దానికి వారు అంగీకరించారు.



"ముందుగా చెట్టు కాలిన భాగాన్ని శుభ్రం చేశా. ఆవు పాలు, ఆవు పేడ, ఎండు గడ్డి పొడి, పొలంలోని మట్టి, నెయ్యి, తేనె, అరటిపండు, చెదల పుట్ట బురదను ఒక పెద్ద పాత్రలో తీసుకొని అన్నింటిని కలిపి మిశ్రమం తయారుచేశా. ఆ మిశ్రమాన్ని దెబ్బతిన్న చెట్టుభాగంలో పూసి, కాటన్ వస్త్రంతో కప్పి ఉంచా. రోజూ పాలు, నీళ్లతో ఆ కాటన్ బ్యాండేజ్‌ను తడపాల్సిందిగా వారికి చెప్పా. ఆరు నెలల్లో అద్భుతం జరిగింది. ఆ చెట్టు మునుపటిలానే తరవాతి సీజన్‌లో భారీ పనస కాయలు కాయడం చూసి అంతా ఆశ్చర్యపోయారు. అప్పటి నుంచి ఎక్కడ చెట్టుకు వ్యాధి సోకినా, ప్రమాదం జరిగినా నాకు ఫోన్ చేస్తారు" అంటారు బిను.

**ప్రాచీనకాలం నుంచి ఉంది...**

'అదేంటి మొక్కలకు వైద్యం చేస్తున్నావు' అని ఎవరైనా అడిగితే 'జబ్బు చేసిని మనిషిని చంపేయడం ఎక్కడైనా చూశామా. ఇదీ అలాంటిదే ' అని నవ్వుతూ బదులిస్తారీ పర్యావరణవేత్త. ఇదేం కొత్త వైద్యం కాదు. కేరళలో అరవై సంవత్సరాలుగా ప్రాచుర్యంలో ఉన్నదే అంటారు బిను.

"శైవ సన్యాసి కనపా, చాణక్య, చరకుడు, కౌటిల్యుడు కూడా వృక్షాయుర్వేదం మీద పుస్తకాలు రాశారు. మహాభారతంలో కూడా ఈ వైద్యం గురించిన ప్రస్తావన ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా నేను పర్యావరణ సంరక్షణ కారక్రమాల్లో పాల్గొంటున్నా. వృక్షాయుర్వేదం ఆరవై సంవతర్సరాలుగా చాలా చోట్ల ప్రాచుర్యంలో ఉంది. అయితే వ్యాధి రకాన్ని బట్టి ఈ మిశ్రమం మారుతుంది. కొన్ని రకాల వ్యాధులకు ఆవు పాలు, మరికొన్నిటికి గేదె పాలు పనిచేస్తాయి. మరికొన్నిటికి మాంసంతో నయం చేయొచ్చు. మేక లేదా గొర్రె మాంసం, చేపలు తీసుకొని నీటిలో వేసి, నాలుగు రోజులు అలానే ఉంచాలి. అప్పటికి మాంసం కుళ్లిపోతుంది. ఆ కుళ్లిన మాంసాన్ని చెట్టు వేర్ల భాగంలో గుంత తవ్వి ఉంచాలి. ఆ మిశ్రమం చెట్టు భాగాలకు విస్తరించి చాలా మట్టుకు వ్యాధులు నయమవుతాయి. మొక్కల పత్రాలు, కాండం, వేరు భాగంలో తెగులు, మచ్చలు, ముడతలు ఏర్పడడానికి క్రిమి కీటకాలు, బ్యాక్టీరియా, శిలీంధ్రం వంటివి ప్రధాన కారణం. నేను చెట్టుకు వైద్యం మాత్రమే చేస్తా. అయితే మందు తయారీ ఖర్చును చెట్టు యజమానులే భరించాలి. కానీ చాలామంది అలా చేయడం లేదు. ఈ కాలంలో మనుషులు ఒకరిని ఒకరు పట్టించుకోవడం లేదు... అలాంటిది చెట్లను ఎక్కడ పట్టించుకుంటారు. రోడ్డుకు ఇరువైపులా ఉండే చెట్లు కాలుష్యం బారిన పడి మూగగా రోదిస్తున్నాయి. ఈ పరిస్థితిని నిలువరించాల్సిన అవసరం ఎంతో ఉంది" అని ప్రతి ఒక్కరికి వృక్ష సంరక్షణ బాధ్యతను గుర్తుచేస్తారు బిను.

---

ఫ్యామిలీ కౌన్సెలింగ్

# నా కుటుంబం సంతోషం కోసం...

నా వయసు 30 సంవత్సరాలు. ఇంకా పెళ్లి కాలేదు. మాది మధ్య తరగతి కుటుంబం. నాకు ఇద్దరు అక్కలు, ఒక అన్నయ్య ఉన్నారు. నాన్న రిటైరయ్యారు. అమ్మకు వినికిడి లోపం. పెద్దక్క విడాకులు తీసుకుంది. తనకి ఒక బాబు. చిన్నక్క వికలాంగురాలు. అన్నయ్య ఏ బాధ్యతా తీసుకోకుండా తాగుతూ ఉంటాడు. పైగా తన జల్సాలకు డబ్బుల కోసం అమ్మనాన్నల్ని ఇబ్బంది పెడుతూ ఉంటాడు. నేను ప్రైవేటుగా ఎంకామ్ చేస్తూ బ్యాంకు పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. నాకు పెళ్లి చేసుకోవాలనే ఆశ లేదు. కానీ నా కుటుంబం గొడవలు లేకుండా సంతోషంగా ఉండాలని ఉంది. ఏం చేయాలి?

-కృతి



మధ్యతరగతి కుటుంబాల్లో ఎగుడు దిగుళ్లు సహజం. అయితే ఈ రోజుల్లో చిన్న చిన్న పనులు చేసేవారు కూడా ముందు జాగ్రత్తతో జీవన ప్రమాణాలు పెంచుకుంటున్నారు. కొన్నిసార్లు కుటుంబ పెద్ద ఉద్యోగరీత్యా కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తే ఇటువంటి సమస్యలు వస్తుంటాయి. మీ అక్కలిద్దరూ చదువుకుని స్వావలంబన సాధించవచ్చు కదా. ఇక మీ అన్నయ్య... అతను ఏం చదివాడో మరి. బాధ్యత లేకుండా తయారవడానికి మీ నాన్నగారి అమాయకత్వం, అమ్మగారి అసహాయత కూడా కారణం అయి ఉండొచ్చు. లేదా మీరంతా ఒక్కటై తనని సరిగా చూడటం లేదని అనుకుంటున్నాడో. ఇన్ని కష్టాల మధ్య కూడా వారంతా సంతోషంగా ఉండాలని మీరు ఆలోచిస్తున్నారు కదా... అదీ అసలైన మధ్య తరగతి ఆడపిల్ల మనసు. అక్కచెల్లెళ్లు ముగ్గురు కలిసి మీ అన్నయ్యతో మాట్లాడండి. అతని అవసరం కుటుంబానికి ఎంత ఉందో వివరించండి. ఎంతయినా మీ అన్నయ్యే కదా! చెల్లెళ్ల మాట తప్పక వింటారు. ఇంట్లో ఖాళీగా ఉండకుండా అందరూ తలొక వ్యాపకం కల్పించుకుంటే గొడవలకు సమయమే ఉండదు. ఆ దిశగా ఆలోచించండి.

● కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

# గుడ్డుతో నడిచే పడవ

**కిడ్ సైంటిస్ట్**

**కావలసినవి**

● మందంగా ఉన్న కాగితం ● ఎంసిల్ ● కోడిగుడ్డు ● దూది ● స్పిరిట్ ● చిన్న డబ్బామూత ● నీళ్ల తొట్టి ● బిరడా ● కొద్దిగా తీగ ● కొవ్వొత్తి



**తయారీ**

కోడిగుడ్డుతో నడిచే కాగితం పడవను మీరు చూసి ఉండరు. మరి అదెలా చేయాలో తెలుసుకుందామా! ఒక కాగితం ముక్కను చుక్కానిలా పనిచేయడానికి తీసుకోండి. దానికి చిన్న రంధ్రం చేయండి. కాగితంతో పడవను తయారుచేసి వెనకాల రెండు చిన్న రంధ్రాలు చేసి దారం దూర్చి చుక్కాని సరైన ప్రదేశంలో పెట్టాలి. ఇక్కడ ఇంజను గుడ్డు కదా! అందుకే గుడ్డు పెట్టడానికి తీగతో స్టాండ్ చేయండి. ఇప్పుడు కోడిగుడ్డు రెండు వైపులా చిన్న రంధ్రాలు చేయండి. ఒకవైపు రంధ్రం నుంచి ఊదితే మరో రంధ్రం గుండా తెల్లసొన, పచ్చసొన బయటకు వచ్చేస్తాయి. ఇప్పుడు ఖాళీ గుడ్డులో సగం వరకు నీళ్లు నింపి ఒకవైపు రంధ్రాన్ని ఎంసిల్‌తో మూసేయండి. తరువాత గుడ్డును స్టాండ్‌పై అమర్చి కింద కొవ్వొత్తిని వెలిగించండి. దూదిని స్పిరిట్‌లో ముంచి కూడా వెలిగించవచ్చు. కొవ్వొత్తి వేడికి గుడ్డులోని నీళ్లు మరగడం మొదలవుతుంది. నీళ్లు మరగుతున్నప్పుడు తెరచి ఉన్న రంధ్రం గుండా ఆవిరి బయటకు వస్తుంది. ఫలితంగా పడవ ముందుకు నెట్టబడుతుంది. ప్రతిపనికి సమానమైన, వ్యతిరేకమైన ప్రతిచర్య ఉంటుందని చెప్పే జెట్ సూత్రం ఇక్కడ పనిచేస్తుంది. గుడ్డులో నీరంతా అయిపోయే వరకు పడవ కదులుతూనే ఉంటుంది.

## పదాలు సరిచేయండి?



earb ______

tibrab ______

erde ______

notuca ______

rabez ______

## జత ఉన్న బొమ్మ ఏది?



## దారి కనుక్కోండి?



## బొమ్మ గీయండి



## డైలీ సుడోకు - 221

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | | | 3 | 1 | | | 8 | 5 |
| 5 | | | | | 2 | | | |
| | 8 | | | | | | 2 | 4 |
| 1 | | 5 | | 3 | | | 4 | |
| | | | 7 | | 8 | | | |
| | 9 | | | 4 | | 2 | | 6 |
| 9 | 3 | | | | | | 5 | |
| | | | 4 | | | | | 9 |
| 8 | 4 | | | 5 | 9 | | | 2 |

**సుడోకు- 220 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 3 | 5 | 4 | 9 | 1 | 7 | 2 | 8 |
| 2 | 9 | 1 | 3 | 8 | 7 | 4 | 6 | 5 |
| 7 | 8 | 4 | 6 | 5 | 2 | 9 | 3 | 1 |
| 5 | 4 | 9 | 1 | 3 | 8 | 6 | 7 | 2 |
| 3 | 2 | 7 | 5 | 4 | 6 | 8 | 1 | 9 |
| 8 | 1 | 6 | 7 | 2 | 9 | 3 | 5 | 4 |
| 1 | 5 | 3 | 8 | 7 | 4 | 2 | 9 | 6 |
| 4 | 6 | 2 | 9 | 1 | 3 | 5 | 8 | 7 |
| 9 | 7 | 8 | 2 | 6 | 5 | 1 | 4 | 3 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

మరిన్ని సీట్లతో

# నీట్

నీట్ పరీక్షను దేశవ్యాప్తంగా 2020 మే 3వ తేదీన నిర్వహిస్తారు. ఇందుకోసం 155 నగరాల్లో 2546 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. నీట్ - 2019 పరీక్షకు 15,19,375 మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటే 14,10,754 మంది విద్యార్థులు హాజరయ్యారు.

**బైపీసీ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)-యూజీ 2020 నోటిఫికేషన్ వెలువడింది. దేశ వ్యాప్తంగా మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన ఈ పరీక్షను ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహిస్తోంది. అయితే గతంతో పోల్చితే కొన్ని మార్పులతో నీట్ ప్రకటన వెలువడింది. ఈ వివరాలను తెలుసుకుందాం..**



### నీట్‌తోనే

గతంలో నీట్ పరీక్ష నుంచి ఎయిమ్స్, జిప్మర్ వంటి వైద్య విద్యా సంస్థలకు మినహాయింపు ఉండేది. దీంతో ఇవి సొంతంగా రాత పరీక్షను నిర్వహించి అడ్మిషన్లు కల్పించేవి. కానీ ఎన్‌ఎంసీ యాక్ట్-19లో చేసిన సవరణల మేరకు అన్ని రకాల వైద్య విద్యల్లోనూ, అన్ని వైద్య విద్యాసంస్థల్లోనూ ప్రవేశాలకు ఇక నుంచి దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష మాత్రమే ప్రామాణికంగా నిలవనుంది. అంటే మెడికల్, డెంటల్, ఆయుష్ కోర్సుల్లోని సీట్లను కూడా కేవలం నీట్‌లో సాధించిన మార్కులాధారంగానే భర్తీ చేస్తారు. మరే ఇతర పరీక్షలు ఉండవు.

### తెలుగు విద్యార్థులకు లాభమే

ఒకే ఒక పరీక్షా విధానంతో తెలుగు విద్యార్థులు అత్యంత ప్రయోజనం పొందుతారని చెప్పొచ్చు. ఎందుకంటే నీట్‌తోపాటు ఎయిమ్స్, జిప్మర్ పరీక్షలకు తెలుగు విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పోటీ పడుతుంటారు. అయితే నీట్, ఎయిమ్స్ - జిప్మర్ పరీక్షలలో సిలబస్, పరీక్షా విధానంలో స్వల్ప తేడాలు ఉంటాయి. నీట్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటే ఎయిమ్స్ - జిప్మర్ ప్రవేశ పరీక్షల్లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీతోపాటు జీకే, లాజికల్ రీజనింగ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడిగేవారు. ఈ కారణంగా విద్యార్థులు ఈ మూడు పరీక్షలకు వేర్వేరుగా సిద్ధం కావాల్సి వచ్చేది. అంతేకాకుండా ఈ మూడు పరీక్షల నిర్వహణ తేదీల మధ్య విరామం తక్కువగా ఉండేది. దీంతో ప్రిపరేషన్ పరంగా విద్యార్థులు ఎక్కువ ఒత్తిడికి గురయ్యే పరిస్థితి ఉత్పన్నమయ్యేది. ఇది ఆయా విద్యార్థుల ఫలితాలపై కూడా ప్రభావం చూపేది. ఈ నేపథ్యంలో ఒకే పరీక్ష తెలుగు విద్యార్థులకు కచ్చితంగా ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. నీట్ ప్రిపరేషన్‌తోనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఎయిమ్స్, జిప్మర్ క్యాంపస్‌ల కోసం పోటీ పడొచ్చు. మరింత ప్రభావవంతంగా సిద్ధమై డాక్టర్ సీటు ఖరారు చేసుకునే అవకాశాలు మెరుగు పరుచుకోవచ్చు. కాబట్టి ఏ రకంగా చూసినా ఈ మార్పు తెలుగు విద్యార్థులకు ఎంతో లాభం చేకూరుస్తుందని చెప్పొచ్చు.

**నీట్ పరిధిలోకి వచ్చే కాలేజీలు - సీట్లు**




### పరీక్ష విధానం

పరీక్షను ఆబ్జెక్టివ్ పద్ధతిలో పేపర్-పెన్ను విధానంలో నిర్వహిస్తారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిర్దేశించిన సిలబస్ ఆధారంగా ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తారు. నీట్ పరీక్షలో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి 180 ప్రశ్నలు ఇస్తారు. సరైన సమాధానానికి 4 మార్కుల చొప్పున 720 మార్కులకు పరీక్ష ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పునకు ఒక మార్కు కోత విధిస్తారు. సమాధానాలను గుర్తించడానికి మూడు గంటల (180 నిమిషాలు) సమయం ఇస్తారు

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| బయాలజీ | 90 | 360 |
| ఫిజిక్స్ | 45 | 180 |
| కెమిస్ట్రీ | 45 | 180 |

### మాధ్యమం

నీట్ ప్రశ్నపత్రాన్ని హిందీ, ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, కన్నడ, తదితర భాషల్లో కూడా రూపొందిస్తారు. ఏ భాషలో పరీక్ష రాస్తారనే విషయాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాలి. భాషను ఎంపిక చేసుకున్న తరవాత మార్చుకోవడం సాధ్యం కాదు. ఇంగ్లీష్‌ను ఎంపిక చేసుకుంటే కేవలం ఆ భాషలోనే ప్రశ్నపత్రం ఇస్తారు. నీట్-2019లో 12,04,968 మంది ఇంగ్లీష్‌లో పరీక్ష రాశారు. తెలుగు భాషను ఎంచుకుంటే తెలుగు / ఇంగ్లీష్‌లో ప్రశ్నపత్రం ఇస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని కేంద్రాల్లో మాత్రమే ఈ సౌలభ్యం ఉంటుంది. అనువాద దోషాలుంటే ఆంగ్ల ప్రశ్నపత్రాన్నే ప్రామాణికంగా తీసుకోవాలి. నీట్ - 2019లో 1,796 మంది మాత్రమే తెలుగు భాష కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

### ముఖ్య సమాచారం

- అర్హత: 12వ తరగతి / తత్సమానం (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ / బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్టులతో). చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: 17 ఏళ్లు (డిసెంబరు 31, 2020) నాటికి. నిబంధనల మేరకు రిజర్వ్‌డ్ విద్యార్థులకు వయోసడలింపు ఉంటుంది.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తు ఫీజు: జనరల్ - రూ.1500, ఈడబ్ల్యూఎస్ / ఓబీసీ (ఎన్‌సీఎల్) - రూ.1400, మిగతా వారికి రూ. 800
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 31, 2019.
- అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్ ప్రారంభం: మార్చి 27, 2020
- ఫలితాల వెల్లడి: జూన్ 4, 2020
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లా, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, నెల్లూరు.
- వెబ్‌సైట్: www.nta.ac.in www.ntaneet.nic.in

## మార్కులకు ప్రణాళిక

**నీట్** రాసే విద్యార్థులు ఒకింత కంగారు పడటం సహజమే. అయితే పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే విజయం సులువే. ముందుగా ఎన్ని మార్కులు సాధిస్తే సీటు వస్తుందో తెలుసుకోవాలి. ఆ మార్కులను ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో తమ శక్తి సామర్థ్యాలకనుగుణంగా విభజించుకోవాలి. ఉదాహరణకు సీటు రావాలంటే అవసరమైన మార్కులు 530 అనుకుంటే బయాలజీలో 320, కెమిస్ట్రీలో 120, ఫిజిక్స్‌లో 100 మార్కులు పొందేలా ప్రణాళిక రచించుకోవాలి.

### బయాలజీ



నీట్ బయాలజీలో 90 శాతం ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోంచే ఇస్తారు. బయాలజీ చాలా కీలకమైంది. ఎందుకంటే మొత్తం మార్కుల్లో సగం (360) ఈ సబ్జెక్ట్ నుంచే ఉంటాయి. ఇందులో అధిక మార్కులు సాధించటంలో జ్ఞాపక శక్తి కీలక పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే బయాలజీలో అప్లికేషన్ ఆధారిత ప్రశ్నలకు అవకాశం తక్కువ. ఎన్‌సీఈఆర్‌టీ 11, 12వ తరగతి పుస్తకాలను వీలైనన్ని సార్లు అభ్యసనం చేస్తే కాన్సెప్ట్ ప్రశ్నలకు సులువుగా సమాధానం ఇవ్వొచ్చు. ఈ సబ్జెక్ట్ పూర్తిగా డయాగ్రామ్స్‌తో ఉంటుంది. కాబట్టి ప్రతి పాఠ్యాంశాన్ని డయాగ్రామ్‌తో నేర్చుకోవడం మంచిది. ఇందులో 320కిపైగా మార్కులు సాధించాలంటే.. ప్లాంట్ కింగ్‌డమ్, యానిమల్ కింగ్‌డమ్, డైజెస్టివ్ గ్లాండ్స్, ఎండోక్రైనల్ గ్లాండ్స్ వంటి పాఠ్యాంశాలను ఒక టేబుల్ ఫార్మాట్‌లో రాసుకొని అభ్యసించాలి. తద్వారా పునశ్చరణ కూడా సులువవుతుంది. ఎన్‌సీఈఆర్‌టీ 11, 12వ తరగతుల్లోని పుస్తకాల్లో చివర్లో ఇచ్చే సప్లిమెంటరీ మెటీరియల్, ప్రయోగ పరీక్షల సిలబస్‌ను చదవాలి. ఉదాహరణలు, శాస్త్రీయ నామాలను గుర్తుంచుకోవాలి. 8 నుంచి 10వ తరగతి వరకు ఉన్న బయాలజీ పాఠ్యాంశాలను కూడా అధ్యయనం చేయాలి. గత ప్రశ్నపత్రాల ప్రాక్టీస్ తప్పనిసరి. గ్లైకాలసిస్, క్రెబ్స్ వలయం వంటి అంశాలను ఫ్లో చార్ట్ సహాయంతో చదవాలి. డైకాట్, మోనోకాట్, లీఫ్, స్టెమ్ మధ్య తారతమ్యాలను పట్టిక రూపంలో రాసుకొని చదవడం ప్రయోజనకరం.

### కెమిస్ట్రీ



ఈ సబ్జెక్ట్‌లో ఆవర్తన పట్టిక, రసాయన బంధం, సమన్వయ సంయోజనీయ బంధం, ఎస్, పీ, డీ, ఎఫ్ బ్లాక్ మూలకాలు.. అధ్యాయాలను సమగ్రంగా చదవాలి. వాటిలోని ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. స్టాకియోమెట్రీలో మోల్, తుల్యాంక భారం, భారం - ఘనపరిమాణం అంశాలను క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి. తద్వారా రసాయన శాస్త్రంలోని ప్రాబ్లమ్స్‌ను సులభంగా చేసే అవకాశం ఉంటుంది. కర్బన రసాయనశాస్త్రంలో నామకరణ విధానం, అణుసాదృశ్యం బాగా చదవాలి. ఇందులోని సమీకరణాలపై పట్టు సాధించాలి. అంతేకాకుండా భౌతిక ధర్మాలు, బేధ పరిచే విషయాలను క్షుణ్నంగా చదివి ప్రాక్టీస్ చేయడం ఉత్తమం. కర్బన రసాయనశాస్త్రంపై అధికంగా దృష్టి సారించాలి. భౌతిక రసాయన శాస్త్రంలో థియరీ భాగానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

### ఫిజిక్స్



ఇందులో ప్రతి అధ్యాయంలోని కాన్సెప్ట్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. ఈ సబ్జెక్ట్‌లో 25 నుంచి 30 ప్రశ్నలను సాధించాలనుకునే విద్యార్థులు ఎలక్ట్రోడైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, హీట్, థర్మోడైనమిక్స్, ఎస్‌హెచ్‌ఎం, వేవ్స్, సిస్టమ్ ఆఫ్ పార్టికల్స్, గ్రావిటేషన్, లాస్ ఆఫ్ మోషన్ పాఠ్యాంశాలపై దృష్టిసారించాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీలో కొన్ని అంశాలు పునరావృతం అవుతూ ఉంటాయి. ఉదాహరణకు అటామిక్ స్ట్రక్చర్, థర్మోడైనమిక్స్‌ను తీసుకుంటే 11వ తరగతి కెమిస్ట్రీలోని అటామిక్ స్ట్రక్చర్, 12వ తరగతి న్యూక్లియర్ ఫిజిక్స్‌లో కనిపిస్తుంది. అదేవిధంగా థర్మోడైనమిక్స్ కొంత వైవిధ్యంతో ఫిజిక్స్, కెమిస్ట్రీలలో ఉంటుంది. ఇటువంటి అంశాలపై దృష్టి సారించాలి.



ఎ. శ్రీనివాసరావు
సినియర్ ఫ్యాకల్టీ, విశాఖపట్నం

# జాబ్ కార్నర్

## పబ్లిక్ హెల్త్ నర్సు

బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), ఈస్ట్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఈడీఎంసీ)లో ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **98**
- పోస్టుల వారీగా ఖాళీలు: పబ్లిక్ హెల్త్ నర్సు, క్యాటరింగ్ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎం), డ్రెస్సర్, డైటీషియన్, కుక్.
- అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, బీఎస్సీ (నర్సింగ్), మాస్టర్స్ డిగ్రీ (హోమ్ సైన్స్), అనుభవం.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 25, 2019
- వెబ్‌సైట్: www.becil.com

## నాన్ టీచింగ్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) - న్యూఢిల్లీ, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **19**
- భర్తీ చేసే పోస్టులు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, పర్సనల్ అసిస్టెంట్.
- అర్హత: పోస్టుని అనుసరించి ఇంటర్మీడియెట్, బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈ / బీటెక్, మాస్టర్స్ డిగ్రీ, ఎంబీబీఎస్, అనుభవం.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 20, 2019
- వెబ్‌సైట్: nitdelhi.ac.in/

## షిప్ డ్రాఫ్ట్స్‌మెన్ ట్రైనీ

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, షిప్ డ్రాఫ్ట్స్‌మెన్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **29**
- విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిప్లొమా, అనుభవం.
- ఎంపిక విధానం: రాత పరీక్ష, ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 20, 2019
- వెబ్‌సైట్: cochinshipyard.com/

## గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ అండ్ ఎంట్రపెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ గ్రామీణ యువతకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ క్యాంపస్‌లో పలు ఉపాధి శిక్షణ కార్యక్రమాలను ఉచితంగా నిర్వహిస్తోంది. ఈ శిక్షణ తరగతులు 2020 జనవరి 3 నుంచి ఫిబ్రవరి 12 వరకు జరుగుతాయి. మొబైల్ సర్వీసింగ్ (పదో తరగతి ఉత్తీర్ణత), ఎలక్ట్రీషియన్, పంప్‌సెట్ రిపేర్ (టెన్త్ ఫెయిల్, ఆపైన), అకౌంటింగ్ ప్యాకేజీ, జీఎస్‌టీ (బీకాం ఉత్తీర్ణత) అంశాలలో శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో వసతి, భోజనం ఉచితం. 19 నుంచి 30 ఏళ్ల లోపువారు ఆన్‌లైన్ ద్వారా డిసెంబరు 20లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్ సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లకుతోడు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్, ఐదు కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకెళ్లాలి. పూర్తి వివరాలకు...

**వెబ్‌సైట్:** www. bired.org.
**ఫోన్:** 040 - 29709295, 29709296.


TIGER COMPANY PRODUCTION
నేడే విడుదల
రామ్‌గోపాల్ వర్మ
అమ్మరాజ్యంలో కడప బిడ్డలు
సిద్ధార్థ తాతోలు


SPECTACULAR.
GIGANTIC.
RELEASING TODAY
KAVYA FILM COMPANY PRESENTS
మామాంగం
HISTORY OF THE BRAVE
DIRECTED BY M PADMAKUMAR
PRODUCED BY VENU KUNNAPPILLY


DWAYNE JOHNSON
JACK BLACK
KEVIN HART
KAREN GILLAN
జుమాంజీ
మరో ప్రపంచం
IN CINEMAS TOMORROW
/sonypicturesofindia
/sonypicsindia
/sonypicturesindia
KFC ENTERTAINMENT RELEASE


VNV CREATIONS
BASED ON TRUE EVENTS
WORLD WIDE RELEASE
MUSIC ON
ADITYA MUSIC
నేడే విడుదల
HEZA
హేజా
A MUSICAL HORROR


రేపే విడుదల
SURESH PRODUCTIONS PVT. LTD.
people MEDIA FACTORY
VENKY మామ
K.S. RAVINDRA (BOBBY)
D.SURESH BABU T.G.VISHWA PRASAD
THAMAN S VIVEK KUCHIBHOTLA PRASAD MURELLA
వెంకి మామ
U/A
ADITYA MUSIC

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 40,412.57 | 11,910.15 | 37,792 | 43,260 | 70.85 | 63.97 |
| 172.69 | 53.35 | 26 | 15 | 7 పైసలు | |
| | | ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) | | | |

# రూ.2,400 కోట్లకు హామీ ఇవ్వండి

## ప్రభుత్వాన్ని కోరిన ఎయిర్ ఇండియా



న్యూఢిల్లీ: తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న ఎయిర్ ఇండియా నిధుల సమీకరణకు నానా ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కొత్తగా నిధులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం నుంచి రూ.2,400 కోట్ల హామీని కోరుతోంది. కంపెనీ సమీకరించే సొమ్మును నిర్వహణ అవసరాల కోసం వినియోగించుకోనుంది. ఎయిర్ ఇండియాలో వాటాలను విక్రయించేందుకు సంబంధించిన తుది ప్రక్రియను ప్రభుత్వం ఖరారు చేసే పనిలో ఉన్న విషయం తెలిసిందే. ఇదే తరుణంలో ఎయిర్ ఇండియా నిధుల కోసం ప్రభుత్వ హామీని కోరడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.7,200 కోట్ల హామీని ఎయిర్‌లైన్‌కు ఇవ్వాల్సి ఉందని, ఇందులో భాగంగానే రూ.2,400 కోట్లకు హామీని కోరినట్టు సంస్థకు చెందిన ఒక అధికారి తెలిపారు. కాగా ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ ద్వారా ఒక్క ఉద్యోగం కూడా పోదని, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడతామని ఇప్పటికే రాజ్యసభలో పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి ప్రకటించారు. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించకపోతే మూసివేయాల్సి వస్తుందని ఆయన అన్నారు. 2018-19 సంవత్సరంలో ఎయిర్ ఇండియా నష్టం రూ.8,556.35 కోట్లుగా ఉంది. కాగా 2011-12 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఎయిర్ ఇండియాకు రూ.30,520.21 కోట్ల ఈక్విటీ మూలధనాన్ని ప్రభుత్వం అందించింది.

# పీఎస్‌బీల పాక్షిక రుణ హామీ స్కీమ్‌కు ఆమోదం

న్యూఢిల్లీ : ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్న నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల అధిక రేటింగ్‌తో కూడిన ఆస్తులను కొనుగోలు చేసేందుకు వీలుగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు (పీఎస్‌బీ) పాక్షికంగా రుణ హామీ కల్పించే స్కీమ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం ఎన్‌బీఎఫ్‌సీలతో పాటు హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలకు తొలిసారిగా నష్టం వచ్చిన నాటికి గల ఆస్తుల న్యాయబద్ధమైన విలువలో 10 శాతానికి లేదా రూ.10 వేల కోట్లు ఏది తక్కువైతే అంత మొత్తానికి ప్రభుత్వం హామీదారుగా నిలుస్తుంది. ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలు, హెచ్‌ఎఫ్‌సీల లిక్విడిటీ సమస్య తీర్చడానికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ స్కీమ్‌ను 2018-20 బడ్జెట్‌లో ప్రకటించారు.

### దివాలా చట్టంలో సవరణలకు ఆమోదం

మూడు సంవత్సరాలుగా అమలులో ఉన్న దివాలా చట్టంలో లోటుపాట్లను సవరించడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని వల్ల గత ప్రమోటర్లు చేసిన నేరాల నుంచి కొత్త ప్రమోటర్లకు రక్షణ కల్పించే వీలు కలుగుతుంది. 2016లో అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ చట్టాన్ని మూడు సార్లు సవరించారు. ఐబీసీ సవరణ బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రతిపాదించే అవకాశం ఉంది.

### ఐఐఎఫ్‌సీఎల్‌కు అదనపు నిధులు

భారత మౌలిక వసతుల ఆర్థిక సహాయ సంస్థకు (ఐఐఎఫ్‌సీఎల్) వర్తమాన ఆర్థిక సంవత్సరంలో బాండ్ల రీక్యాపిటలైజేషన్ ద్వారా రూ.5300 కోట్ల అదనపు పెట్టుబడి అందించేందుకు కేబినెట్ ఆమోదించింది. ఇది కాకుండా 2020-21లో మరో రూ.10 వేల కోట్లు అందించడానికి కూడా ఆమోదించింది. ఈ నిధులు అందించేందుకు షరతులు, నిబంధనలను, సమయాన్ని ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయిస్తుంది. దీనికి తోడు ఐఐఎఫ్‌సీఎల్ అధీకృత మూలధనాన్ని రూ.6 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్లకు పెంచడానికి కూడా కేబినెట్ ఆమోదించింది.

# కర్నూల్‌లో 'బెస్ట్ ప్రైస్' స్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో వాల్‌మార్ట్ ఇండియా 'బెస్ట్‌ప్రైస్' స్టోర్‌ను ప్రారంభించింది. ఏపీలో ఇది ఐదో స్టోర్ అవుతుంది. ఇప్పటికే రాజమహేంద్రవరం, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నంలలో బెస్ట్‌ప్రైస్ స్టోర్లు ఉన్నాయని, కర్నూల్‌లో ఏర్పాటు చేసిన స్టోర్‌తో దేశవ్యాప్తంగా స్టోర్ల సంఖ్య 28కి చేరిందని వాల్‌మార్ట్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ క్రిష్ అయ్యర్ తెలిపారు. కర్నూల్‌లో ఏర్పాటు చేసిన స్టోర్ ద్వారా 2,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తుందని చెప్పారు.

## వృద్ధి రేటు 5.1 శాతమే : ఏడీబీ

న్యూఢిల్లీ: భారత్ వృద్ధి రేటు 2019-20 ఆర్థిక సంవత్సరంలో 5.1 శాతానికి పరిమితం అవుతుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) ప్రకటించింది. ఇది దక్షిణాసియా దేశాల్లోనే అతి తక్కువ వృద్ధి రేటు అవుతుందని అంచనా వేసింది. ఉద్యోగ కల్పనలో మందగమనం, తగ్గిన పంటల దిగుబడి, రుణ లభ్యతలో క్షీణత కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న నిరాశావహ స్థితి ఇందుకు కారణమని తాజా నివేదికలో తెలిపింది. అయితే ప్రభుత్వ విధానాల మద్దతుతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5 శాతానికి చేరుతుందని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో ప్రైవేటు వినియోగం 4.1 శాతానికి, పెట్టుబడులు 2.5 శాతానికి క్షీణించడంతో భారత వృద్ధి 4.8 శాతానికి దిగజారిన విషయం ఏడీబీ గుర్తు చేసింది.

## నిస్సాన్ కార్ల ధరల పెంపు

న్యూఢిల్లీ: నిస్సాన్ మోటార్ ఇండియా.. అన్ని మోడళ్ల కార్ల ధరలను 5 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇన్‌పుట్ వ్యయాలు గరిష్ఠ స్థాయికి చేరుకోవటంతో ధరలను పెంచాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. పెంచిన ధరలు 2020 జనవరి నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. ప్రస్తుతం మార్కెట్లో సవాళ్లతో కూడిన పరిస్థితులున్నాయని, తప్పని పరిస్థితుల్లో నిస్సాన్, డాట్సన్ మోడళ్ల ధరలను పెంచాల్సి వస్తోందని నిస్సాన్ తెలిపింది.

**అదే బాటలో మెర్సిడెస్:** ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోవటంతో జనవరి నుంచి కార్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు మెర్సిడెస్ బెంజ్ ఇండియా వెల్లడించింది. మోడల్‌ను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని తెలిపింది. ముడి సరుకులు, ఇన్‌పుట్ వ్యయాలు అన్నింటిని పరిశీలించిన అనంతరం ధరలను పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

## మాల్యాను దివాలాకోరుగా ప్రకటించండి

లండన్: లిక్కర్ కింగ్ విజయ్ మాల్యాను దివాలాకోరుగా ప్రకటించాలని యూకే హైకోర్టును భారత్‌కు చెందిన ప్రభుత్వరంగ బ్యాంకులు కోరాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సారథ్యంలోని ఈ బ్యాంకులు లండన్‌లో బుధవారంనాడు జరిగిన హైకోర్టు విచారణలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మాల్యా ఎంత మేరకు బకాయి పడి ఉన్నారో (114.5 కోట్ల పౌండ్లు) కోర్టుకు విన్నవించాయి. ఈ బకాయిలను వసూలు చేసుకునే ప్రయత్నంలో భాగంగానే మాల్యాకు వ్యతిరేకంగా దివాలా పిటిషన్‌ను 2018లో బ్యాంకులు ఫైల్ చేశాయి.

# లిస్టింగ్‌లో సౌదీ అరామ్కో జోరు




రియాద్: ఇటీవలే పబ్లిక్ ఇష్యూకు వచ్చిన సౌదీ అరేబియాకు చెందిన ఆయిల్ దిగ్గజం అరామ్కో.. ట్రేడింగ్ బుధవారంనాడు ప్రారంభమైంది. తొలి రోజే షేరు ధర దూసుకుపోయింది. ఆరంభంలోనే 10 శాతం మేర షేరు ధర పెరగడంతో కంపెనీ విలువ 1.88 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. ఈ స్థాయిలో ప్రపంచంలో లిస్టయిన ఏ కంపెనీ మార్కెట్ విలువ లేదు. రియాద్‌లోని సౌదీ తడావుల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో ఉదయం 10.30 గంటలకు అరామ్కో షేర్ల ట్రేడింగ్ ఆరంభమైంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా 1.5 శాతం వాటాను విక్రయించారు. ఒక్కో షేరు ధరను 32 సౌదీ రియాల్స్ (8.53 డాలర్లు)గా నిర్ణయించారు. షేరు ధర 10 శాతం మేర పెరగడంతో 35.2 రియాల్స్‌కు చేరుకుంది. దీంతో మార్కెట్ విలువ 1.8 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ప్రస్తుతం అరామ్కో మార్కెట్ విలువ మైక్రోసాఫ్ట్ లేదా యాపిల్‌కన్నా ఎక్కువగా ఉంది.

# కార్వీ రుణాలపై ఆర్‌బీఐ దర్యాప్తు!

ముంబై: కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు రుణాలిచ్చిన బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలపై దర్యాప్తు చేయాలని రిజర్వ్ బ్యాంక్‌ను సెబీ కోరే అవకాశం ఉంది. కార్వీ నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు ఖాతాదారుల షేర్లను దుర్వినియోగపర్చిన సంగతి తెలిసిందే. 95,000 మంది కస్టమర్లకు చెందిన రూ.2,300 కోట్ల విలువైన షేర్లను వారి అనుమతి లేకుండా తాకట్టు పెట్టి సొంత అవసరాల కోసం రూ.600 కోట్ల రుణం తీసుకుంది. అయితే అవి కంపెనీ ఖాతాదారుల షేర్లని తెలిసే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణాలిచ్చాయా? ఈ తతంగంలో వాటి పాత్రేమైనా ఉందా? అన్న దిశగా విచారణ జరపాలని ఆర్‌బీఐని సెబీ కోరనున్నట్లు సమాచారం.

### శాట్‌ను ఆశ్రయించిన యాక్సిస్ బ్యాంక్

కార్వీ తాకట్టు పెట్టిన షేర్లను తిరిగి ఖాతాదారులకు బదిలీ చేయడాన్ని సవాలు చేస్తూ యాక్సిస్ బ్యాంక్ సైతం సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్)ను ఆశ్రయించింది. బ్యాంక్ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది.

## పదేళ్లలో రూ.5 వేల కోట్ల టర్నోవర్

**ఆర్క్ గ్రూప్ సీఎండీ రాంరెడ్డి**

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంతో పాటు మౌలిక వసతుల కల్పనలో 30 ఏళ్లుగా సేవలందిస్తున్న ఆర్క్ గ్రూప్‌ను వచ్చే పదేళ్లలో రూ.5,000 కోట్ల టర్నోవర్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీ రాంరెడ్డి వెల్లడించారు. బుధవారంనాడిక్కడ ఆయన గ్రూప్ సీఈవో మేఘనతో కలిసి మాట్లాడుతూ.. వాణిజ్య, గృహ ప్రాజెక్టులను చేపట్టేందుకు విజన్ 2030 పేరుతో ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు చెప్పారు. ప్రస్తుతం గ్రూప్ టర్నోవర్ రూ.100 కోట్లుగా ఉందని, ఏటా టర్నోవర్‌ను పెంచుకుంటూ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునే విధంగా ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు తమిళనాడు, గోవా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఆర్క్ గ్రూప్ కార్యకలాపాలు సాగిస్తోందన్నారు.

## తక్కువ ధరలకు అలర్జీ పరీక్షలు

**అంజన్ పాత్ లాబ్స్ వెల్లడి**

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని అంజన్ పాత్ లాబ్స్ అండ్ అలర్జీ టెస్టింగ్ కేంద్రాల్లో గురువారం 50 శాతంకన్నా ఎక్కువ డిస్కౌంట్‌కు అన్ని రకాల అలర్జీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు అంజన్ పాత్ లాబ్స్ తెలిపింది. సికింద్రాబాద్, కూకట్‌పల్లి, గుంటూరు, కర్నూలు, నంద్యాల తదితర పట్టణాల్లో అంజన్ పాత్ లాబ్స్‌కు టెస్టింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆహారం, చర్మ, శ్వాస సంబంధ అలర్జీలకు పరీక్షలు నిర్వహిస్తారు. సింగిల్ బ్లడ్ శాంపిల్‌తో పరీక్షలు చేయించుకోవచ్చని, ఫాడియా 250, యూరోబోల్ట్ వన్ వంటి ఆధునిక మెషిన్లపై శాంపిల్స్‌ను పరీక్షిస్తారు.

# ధరలకు జీఎస్‌టీ పోటు!



- పెరగనున్న పన్ను రేట్లు
- 5 నుంచి 8 శాతానికి
- 12 నుంచి 15 శాతానికి
- సుంకం సైతం పెంపు

## 18న జీఎస్‌టీ మండలి భేటీలో తుది నిర్ణయం

న్యూఢిల్లీ: చలికాలంలోనూ ధరలు మండిపోతున్నాయి. ఉల్లి కన్నీళ్లు పెట్టిస్తోంది. ఈ సమయంలో సామాన్యులపై ధరా భారాన్ని మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. పన్ను ఆదాయ లోటును పూడ్చుకునేందుకు జీఎస్‌టీ రేట్లు పెంచనున్నట్లు తెలుస్తోంది. 5 శాతం శ్లాబ్ రేటును 8 శాతానికి, 12 శాతం పన్ను రేటును 15 శాతానికి పెంచే అవకాశం ఉంది. జీఎస్‌టీకి అదనంగా విధించే సుంకాన్ని సైతం పెంచే యోచనలో ఉంది. ఈనెల 18న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరగనున్న జీఎస్‌టీ మండలి సమావేశంలో జీఎస్‌టీ శ్లాబ్ రేట్ల పెంపుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

### మరో మార్గం లేకేనా..?

2017 జూలైలో అమలులోకి వచ్చిన జీఎస్‌టీ చట్ట హయాంలో పన్ను రేట్లను నాలుగు శ్లాబులుగా (5, 12, 18, 28 శాతం) విభజించారు. విలాస వస్తువులు, సిగరెట్లు, గుట్కా వంటి అనారోగ్యకరమైన ఉత్పత్తుల పైన ప్రభుత్వం 28 శాతం పన్నుకు అదనంగా 1 నుంచి 25 శాతం వరకు సుంకం కూడా వసూలు చేస్తోంది. ఆర్థిక మందగమనంతోపాటు మార్కెట్లో గిరాకీ తగ్గిన కారణంగా జీఎస్‌టీ వసూళ్లు పడిపోయాయి. పలు రాష్ట్రాలకు పన్ను పరిహారం చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అదనపు వనరుల కోసం పన్ను రేట్లు పెంచడం తప్ప మరోమార్గం లేదని మోదీ సర్కారు భావిస్తోంది.

### శ్లాబులూ కుదిస్తారా..?

జీఎస్‌టీ రేట్ల సవరణపై తగిన సిఫారసులు చేసేందుకు కేంద్రం, రాష్ట్రాల అధికారుల బృందం మంగళవారం సమావేశమైంది. ప్రస్తుత 5 శాతం పన్ను రేటును 8 శాతానికి, 12 శాతాన్ని 15 శాతానికి పెంచడంతోపాటు పలు ప్రతిపాదనలను ఈ భేటీలో పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. 5 శాతం పన్ను పెంచడంతోపాటు 12 శాతాన్ని 18 శాతం శ్లాబులో విలీనం చేసే ప్రతిపాదననూ పరిగణించే అవకాశం ఉంది. అప్పుడు శ్లాబులను మూడుకు కుదించినట్లవుతుంది. 12 శాతాన్ని విలీనం చేయని పక్షంలో, 18 శాతం పన్ను రేటును సైతం 22-25 శాతం వరకు పెంచవచ్చని వినవస్తోంది. రేట్ల పెంపుపై జీఎస్‌టీ మండలి సమావేశంలో ఆర్థిక మంత్రుల బృందానికి అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. పన్ను ఆదాయ లోటు భర్తీకి రాష్ట్రాలు అధిక పరిహారం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కొన్ని ఉత్పత్తులపై 28 శాతం పన్ను అదనంగా విధించే సుంకాన్ని సైతం పెంచడంపై సమావేశంలో చర్చించవచ్చు. ప్రస్తుతం పన్ను మినహాయింపు లభిస్తున్న వస్తువుల జాబితానూ పునఃసమీక్షించవచ్చని, కొన్నింటిని పన్ను పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం లేకపోలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అలాగే, కొన్ని సేవలపై సుంకం విధించాలన్న ప్రతిపాదననూ పరిశీలించవచ్చు.

### జీఎస్‌టీ ఆదాయం పెరగట్లేదు

నెలకు జీఎస్‌టీ వసూళ్లను కనీసం రూ.1.20 లక్షల కోట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో వసూళ్లు రూ.లక్ష కోట్ల దిగువకే పరిమితం అయ్యాయి. సెప్టెంబరులోనైతే 19 నెలల కనిష్ఠ (2018 ఫిబ్రవరి నాటి) స్థాయికి జారుకున్నాయి. పండగ విక్రయాల దన్నుతో నవంబరులో మాత్రం రూ.లక్ష కోట్ల మైలురాయిని దాటగలిగాయి.

### 40% తగ్గిన సీజీఎస్‌టీ వసూళ్లు

సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) వసూళ్లు బడ్జెట్ అంచనాల కంటే 40 శాతం తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో గడిచిన 8 నెలల కాలానికి (ఏప్రిల్-నవంబరు) సీజీఎస్‌టీ వసూళ్లను రూ.5.26 లక్షల కోట్లుగా అంచనా వేశారు. వాస్తవానికి వసూలైంది రూ.3.28 లక్షల కోట్లే. గత ఆర్థిక సంవత్సరం (2018-19)లో ఇదే కాలానికి వసూళ్లు రూ.4.57 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

### రాష్ట్రాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి

జీఎస్‌టీ అమలు వల్ల ఆయా రాష్ట్రాలకు ఏర్పడ్డ ఆదాయ లోటును పూడ్చేందుకు వీలుగా కేంద్రం గరిష్ఠ పన్ను శ్లాబుకు అదనంగా పరిహార సుంకం వసూలు చేస్తోంది. పరిహారం పెంచాలని ఇప్పటికే పలు రాష్ట్రాలు కేంద్రాన్ని ఒత్తిడి చేస్తున్నాయి. కానీ, వాస్తవిక పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. గత నెలలో సుంకం వసూళ్లు రూ.7,720 కోట్లకు తగ్గాయి. అదనపు వడ్డింపుల ద్వారా నెలవారీ సుంకం ఆదాయాన్ని రూ.10,000 కోట్ల వరకు పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించవచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2020 ఏప్రిల్ నుంచి నెలకు కేంద్రం పంచాల్సిన పరిహార మొత్తం రూ.21 వేల కోట్ల పెరగనుంది.

### 18 శాతంపైనే గురి?

జీఎస్‌టీ మొత్తం ఆదాయంలో సగం కంటే ఎక్కువగా 18 శాతం శ్లాబ్ రేటు ద్వారానే సమకూరుతోంది. ఒకవేళ ఈ శ్లాబ్ రేటును 22-25 శాతానికి పెంచినట్లయితే ప్రభుత్వానికి నెలకు రూ.13 వేల కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ శ్లాబ్ రేటును పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టిపెట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

| పన్ను రేటు | 5% | 12% | 18% |
|---|---|---|---|
| జీఎస్‌టీ మొత్తం ఆదాయంలో వాటా | 5% | 13% | 60% |

### 5% పన్ను రేటు పెంపుతో ప్రయోజనం కొంతే..

కనిష్ఠ పన్ను శ్లాబు (5 శాతం) రేటును ఒక శాతం పెంచితే ప్రభుత్వానికి జీఎస్‌టీ ఆదాయం నెలకు రూ.1,000 కోట్ల మేర పెరగవచ్చని అంచనా. ఒకవేళ 8 శాతానికి పెంచినట్లయితే, అదనంగా రూ.3,000 కోట్ల ఆదాయం సమకూరుతుంది. అయితే, ఈ శ్లాబ్ రేటును పెంచితే నిత్యావసరాల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఆహారోత్పత్తులు, పాదరక్షలు, సామాన్యులు ఉపయోగించే వస్త్రాలన్నీ ఈ శ్లాబ్ పరిధిలోకే వస్తాయి.

**ఈ శ్లాబు పరిధిలోకి వచ్చే వస్తువులు**

టీ, కాఫీ, కిరోసిన్, బొగ్గు, శీతలీకరించిన కూరగాయలు, మసాలా దినుసులు, రస్క్, ఔషధాలు, సోయాబీన్, ఇడ్లీ, దోశ పిండి, వంటనూనెలు, అగ్గిపెట్టెలు, స్కిమ్మ్‌డ్ మిల్క్ పౌడర్, బ్రాండెడ్ పనీర్, పల్లీలు, స్టీల్ ఉటెన్సిల్స్, వస్త్రాలు, ఖాదీ నూలు, రూ.1000లోపు పాదరక్షలు, ఇన్సులిన్, ఎరువులు, అన్ బ్రాండెడ్ ఆయుర్వేదిక్, యునానీ, సిద్ధ, హోమియోపతి ఔషధాలు, ఈ-బుక్స్, సోలార్ విద్యుత్ యంత్రం, ఎలక్ట్రిక్ వాహనాలు, దివ్యాంగులు ఉపయోగించే తోపుడు యంత్రాలు.

### ఐజీఎస్‌టీ సెటిల్‌మెంట్ జీఓఎంకు సుశీల్ మోదీ సారథ్యం

ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి (జీఓఎం) ఇకపై బిహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోదీ అధ్యక్షత వహించనున్నారు. ఇప్పటివరకు సీతారామన్ ఈ జీఓఎంకు అధ్యక్షత వహించారు.

### 12 శాతం శ్లాబ్ రేటులో 243 వస్తువులు

ప్రస్తుతం 12 శాతం జీఎస్‌టీ శ్లాబ్ రేటు పరిధిలో 243 వస్తువులున్నాయి. ఈ శ్లాబ్‌ను 18 శాతంలో విలీనం చేస్తే గనుక ఈ వస్తువులన్నింటిపై పన్ను రేటు నికరంగా 6 శాతం పెరగనుంది. 12 శాతం పన్ను రేటును 15 శాతానికి పెంచినట్లయితే, మరో 3 శాతం అదనపు భారం పడనుంది.

## ప్రధాన మద్దతు స్థాయిలో రికవరీ

**టెక్ వ్యూ**

నిఫ్టీ ప్రారంభంలో 11900 వద్ద రియాక్షన్‌కు గురైనా ప్రధాన మద్దతు స్థాయి 11800 వద్ద రికవరీ సాధించింది. చివరి సెషన్‌లో బలమైన రికవరీ సాధించిన నిఫ్టీ 53 పాయింట్ల లాభంతో 11900 కన్నా పైన డే గరిష్ఠ స్థాయిలో క్లోజయింది. కనిష్ఠ స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభించడమే ఈ రికవరీకి కారణం. 11800 వద్ద మద్దతు తీసుకుని సాధించిన ఈ రికవరీతో తక్షణ ప్రమాదం నుంచి బయటపడింది. అయితే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం మరింత బలాన్ని ప్రదర్శించాల్సి ఉంది.

**గురువారం స్థాయిలివే...**

**నిరోధం : 12000 మద్దతు : 11800**

- మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 12000కన్నా పైన క్లోజ్ కావాలి. ఇదే గత మూడు సెషన్లలో ఏర్పడిన గరిష్ఠ స్థాయి. మరో ప్రధాన నిరోధం 12100.
- మరోసారి బలహీనపడి ప్రధాన మద్దతు స్థాయి 11800కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌కు ఆస్కారం ఉంటుంది.

■ వి.సుందర్ రాజా

## ద్వితీయార్ధం నిస్తేజం

**ఆస్ట్రో వ్యూ**

**తిథి:** మార్గశిర బహుళ పాడ్యమి; నక్షత్రం : మృగశిర

**అప్రమత్తం:** పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, మిథున, తుల రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 12.21**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ మెరుగ్గా ప్రారంభమై 10 గంటల వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 11.45 వరకు నిలకడగాను, తదుపరి చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం:** నిఫ్టీ ఫ్యూచర్స్ 9.15 సమయానికి ఎటిపి కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 11950, 11985**

**మద్దతు స్థాయిలు : 11870, 11835**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక:** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)



| | |
|---|---|
| 11వ తేదీకి.. | |
| హైదరాబాద్ | 436 |
| 12వ తేదీకి.. | |
| చిత్తూరు | 458 |
| గోదావరి | 454 |
| విజయవాడ | 454 |
| విశాఖపట్నం | 470 |
| వరంగల్ | 439 |
| డజను గుడ్లు రూ. 66 | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | |
|---|---|
| హైదరాబాద్ | 82 |
| వరంగల్ | 83 |
| మహబూబ్‌నగర్ | 82 |
| కరీంనగర్ | 82 |
| కర్నూలు | 82 |
| విశాఖపట్నం | 92 |
| గోదావరి | 90 |
| విజయవాడ | 92 |
| గుంటూరు | 92 |
| ఒంగోలు | 94 |
| చిత్తూరు | 83 |
| నెల్లూరు | 83 |
| అనంతపురం | 79 |

## ఎంఎస్‌ఎంఈలకు అమెజాన్ శిక్షణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెజాన్‌కు ఉన్న 12 అంతర్జాతీయ మార్కెట్ ప్లేస్‌ల ద్వారా విదేశీ వినియోగదారులకు వస్తువులను విక్రయించడంపై సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి సంస్థల (ఎంఎస్‌ఎంఈ) ప్రతినిధులకు అమెజాన్ శిక్షణ ఇవ్వనుంది. అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ కార్యక్రమం ద్వారా దేశీయ సంస్థలు విదేశీ వినియోగదారులకు వస్తువులను విక్రయించే సదుపాయాన్ని అమెజాన్ కల్పిస్తోంది. అమెజాన్‌లో ఈ కార్యక్రమం కింద హైదరాబాద్‌లో 600 మంది, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో 900 మంది విక్రేతలు ఉన్నారని అమెజాన్ వెల్లడించింది. ఈ-కామర్స్ ద్వారా ఎగుమతులు పెంచే లక్ష్యంతో ఈ నెల 12 నుంచి 21 తేదీల్లో శిక్షణ, వర్క్‌షాపులను నిర్వహిస్తున్నట్లు అమెజాన్ ఇండియా డైరెక్టర్ (గ్లోబల్ సెల్లింగ్) అబిజిత్ కమ్రా తెలిపారు.

## ఇటలీ కంపెనీతో మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మరింత మంది ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్ల (ఓఈఎం)కు పూర్తి స్థాయి రోబోటిక్ ఆటోమేషన్ సేవలను అందించడానికి ఇటలీకి చెందిన మాంగనో రోబో ఎస్ఆర్ఎల్‌తో మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ చేతులు కలిపింది. ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రెండు కంపెనీలు కలిసి తమ వ్యాపారాభివృద్ధి కార్యకలాపాలను ఏకం చేస్తాయి. ఇటలీ కంపెనీతో చేతులు కలపడం వల్ల ఆటో రంగంలో మరింత మంది టైర్-1 సరఫరాదారులు, ఓఈఎంలకు సేవలను విస్తరించడానికి వీలవుతుందని వెల్లడించింది. ఇటలీ కంపెనీ సహకారంతో అమెరికా, చైనా మార్కెట్లలోకి ప్రవేశించడానికి అవకాశం లభిస్తుంది.

## ఫిన్‌టెక్ స్టార్టప్‌లకు వీసా అండ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో డిజిటల్ చెల్లింపుల సమస్యలను అధిగమించడానికి ఫిన్‌టెక్ స్టార్టప్‌లతో చేతులు కలపాలని పేమెంట్స్ టెక్నాలజీ కంపెనీ వీసా భావిస్తోంది. సొల్యూషన్లను అభివృద్ధి చేస్తున్న స్టార్టప్‌లకు అండగా నిలిచేందుకు వీసా ఎవ్రీవేర్ ఇనీషియేటివ్ (వీఈఐ) పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించింది. తద్వారా వీసా నెట్‌వర్క్ భాగస్వాములకు అత్యాధునిక టెక్నాలజీలను అందించనుంది. వీఈఐ కార్యక్రమం కింద ఆయా ఫిన్‌టెక్‌ల సొల్యూషన్లను పరిశీలించడానికి స్టార్టప్‌లు దరఖాస్తు చేసుకోవచ్చని. 25 వరకూ దరఖాస్తులను స్వీకరిస్తామని వీసా భారత్, దక్షిణాసియా గ్రూప్ కంట్రీ మేనేజర్ టీఆర్ రామచంద్రన్ తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 30 ఫిన్‌టెక్‌లు తమ సొల్యూషన్లను ప్రదర్శించాయి.

సికింద్రాబాద్ జోన్‌లో ప్రధాన రహదారి నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్‌కు రూ.240.60 కోట్ల విలువైన ఆర్డర్ లభించింది. జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ నుంచి ఈ పనులు లభించినట్లు కంపెనీ వెల్లడించింది.

## బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 37,780 | 38,610 | 39,210 | 38,860 | 37,770 |
| క్రితం ముగింపు | 37,810 | 38,550 | 38,970 | 38,500 | 37,770 |
| 22 క్యారెట్లు | 36,010 | 35,750 | 36,070 | 35,780 | 35,970 |
| క్రితం ముగింపు | 35,960 | 35,700 | 35,850 | 35,680 | 35,970 |
| వెండి (కిలో) | 43,500 | 44,500 | 44,500 | 44,400 | 46,600 |
| క్రితం ముగింపు | 43,500 | 44,500 | 44,600 | 44,500 | 46,600 |



చెరువులో వయాగ్రా..

## వేల గొర్రెలు తహతహ!

న్యూఢిల్లీ, డిసెంబరు 11: వయాగ్రా.. మనుషులు లైంగిక సామర్థ్యం పెరగడానికి వాడతారు. అయితే ఐర్లాండ్‌లో ఓ కంపెనీ శుద్ధి చేయని 755 టన్నుల వయాగ్రాలను చెరువులో వేసింది. ఆ నీళ్లు తాగిన గొర్రెలు పిచ్చి పిచ్చిగా ప్రవర్తించాయి. వయాగ్రా వేసుకున్న మనుషుల వలే తోడు కోసం పరితపించాయి. వాటిని అదుపు చేయడం యజమానులకు కష్టంగా మారింది.



## 'నావిక్'కు అమెరికా మిత్ర హోదా

వాషింగ్టన్, డిసెంబరు 11: జీపీఎస్‌కు బదులుగా భారత్ సొంతంగా తయారుచేసుకున్న మార్గదర్శక వ్యవస్థ నావిక్(నేవిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టిలేషన్)కు యూఎస్ కాంగ్రెస్ మిత్ర వ్యవస్థ హోదా ఇచ్చింది. ఈయూ రూపొందించుకున్న గెలీలియోకు, జపాన్ రూపొందించుకున్న క్యూజీఎస్ఎస్‌తో సమానంగా భారత్ నావిక్‌కు ఈ హోదా దక్కింది. రష్యా సొంత నేవిగేషన్ వ్యవస్థ గ్లోనాస్‌కు, చైనా తయారుచేసుకున్న బైడుకు అమెరికా ఇలా మిత్ర హోదా ఇవ్వలేదు.




## టైమ్ పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గా గ్రెటా

న్యూయార్క్, డిసెంబరు 11: అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో ప్రపంచ దేశాధినేతలను కడిగిపారేసిన టీనేజర్ గ్రెటా థున్‌బర్గ్ ఈ ఏడాదికి టైమ్ మేగజీన్ పర్సన్ ఆఫ్ ద ఇయర్-2019గా ఎంపికయ్యారు. ఈఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కురాలిగా నిలిచారు. గ్రెటా థున్‌బర్గ్-ద పవర్ ఆఫ్ యూత్ అనే క్యాప్షన్‌తో సముద్రపు ఒడ్డున ఉన్న 16ఏళ్ల గ్రెటా ఫొటోను మేగజీన్ కవర్‌పేజీపై ముద్రించారు. ఆమె స్వీడన్ పార్లమెంటులోనూ ప్రసంగించారు.



## నీనా గుప్తాకు భట్నాగర్ అవార్డు

న్యూఢిల్లీ, డిసెంబరు 11: శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు అందుకున్న అతి పిన్న వయస్కురాలిగా డాక్టర్ నీనా గుప్తా (35) రికార్డు సృష్టించారు. కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ)లో ఆమె మేథమెటిక్స్ ప్రొఫెసర్. ఈ అవార్డు అందుకున్న మూడో మహిళ నీనా. 70 ఏళ్ల గణిత చిక్కుప్రశ్నకు సమాధానం కనుగొన్నందుకు ఈ అవార్డు వరించింది. 2006లో కోల్‌కతాలోని బెథూన్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీనా ఆల్‌జీబ్రాయిక్ జామెట్రీలో పీహెచ్‌డీ చేశారు.

## చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌పై రిటైర్డ్ జడ్జితో దర్యాప్తు!

- సుప్రీంకోర్టు కీలక ప్రతిపాదన
- వేరే రాష్ట్ర అధికారులతో విచారించాలి
- ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో మరో పిల్

న్యూఢిల్లీ/హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్ ఘటనపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో దర్యాప్తు జరిపించాలని భావిస్తున్నామని స్పష్టం చేసింది. ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు చేయించాలని న్యాయవాదులు జీఎస్ మణి, ప్రదీప్ కుమార్ యాదవ్‌తో పాటు మరో న్యాయవాది ఎంకే శర్మ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. బుధవారం సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. 'హైదరాబాద్ ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు జరపడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమించాలని భావిస్తున్నాం' అని జస్టిస్ బాబ్డే వ్యాఖ్యానించారు. ఢిల్లీలోనే ఉంటూ దర్యాప్తు చేస్తారని, హైదరాబాద్‌లో ఉండబోరని తెలిపారు. దర్యాప్తు కోసం మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీవీ రెడ్డిని సంప్రదించామని, కానీ ఆయన నిరాకరించారని వెల్లడించారు. మరెవరినైనా చూస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై సలహాలు, సూచనలతో రావాలని తెలంగాణ ప్రభుత్వానికి ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. కాగా, 'దిశ' కేసులో నిందితులను చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో మరో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఈ ఘటనపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేసి, విశ్వనీయమైన ట్రాక్ రికార్డు ఉన్న రాష్ట్రేతర పోలీసు అధికారులతో సిట్ వేసి విచారణ జరిపించాలని అందులో కోరారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసు అధికారులపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఐపీసీ 302 కింద కేసు నమోదు చేయాలన్నారు.



పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా అసోంలోని శివసాగర్ పట్టణంలో ప్రజల ఆందోళన; దిస్పూర్‌లో బస్సుకు నిప్పుపెట్టిన నిరసనకారులు



# పౌరసత్వ బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 12: పౌరసత్వ సవరణ బిల్లును రాజ్యసభ బుధవారం ఆమోదించింది. ఎనిమిది గంటల పాటు హోరాహోరీ చర్చ అనంతరం.. బిల్లుకు అనుకూలంగా 125 మంది మద్దతివ్వగా, 99 మంది వ్యతిరేకంగా ఓటేశారు. లోక్‌సభలో మద్దతిచ్చి సహకరించిన శివసేన ఓటింగ్‌కు ముందే వాకౌట్ చేసింది. ఈ బిల్లు ఉభయసభల ఆమోదం పొందడంతో ఇక చట్టరూపు దాల్చనుంది. ఇది దేశ చరిత్రలో ఓ మైలురాయని ప్రధాని మోదీ అభివర్ణించారు. చరిత్రాత్మక క్షణమని అమిత్ షా పేర్కొన్నారు. దేశ రాజ్యాంగ చరిత్రలో ఇదో చీకటి రోజని దుయ్యబట్టిన కాంగ్రెస్- దీనిని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని ప్రకటించింది.

లోక్‌సభ ఇప్పటికే ఆమోదించిన ఈ బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. "బిల్లుపై చాలా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఇది అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొంటున్న కోట్లాది మంది హిందూ, క్రైస్తవ, పార్శీ, సిక్కు, బౌద్ధ, జైన మతస్థులకు ఇది ఓ ఆశాకిరణం. 2014 డిసెంబరు 31కి ముందు గనక వారు శరణార్థులుగా భారత్ వచ్చి ఉండుంటే వారికి పౌరసత్వం ఇచ్చి, విద్యా, ఉద్యోగ, జీవనోపాధి హక్కులు కల్పించడమే దీని ఉద్దేశం. అంతే తప్ప ఈ బిల్లు ఈ దేశ ముస్లింల అస్తిత్వాన్ని ప్రశ్నించజాలదు. వారికి అన్యాయం చేయదు. సమానత్వపు హక్కును చెప్పే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు ఎంతమాత్రమూ వ్యతిరేకం కాదు" అని షా వివరణ ఇచ్చారు. ఆ దేశాల నుంచి వచ్చిన ముస్లింలకు మాత్రం పౌరసత్వం ఇచ్చే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. " పొరుగుదేశాల నుంచి వచ్చే అన్ని మతస్థులకూ పౌరసత్వం ఇవ్వాలంటున్నారు. ఏం మాట్లాడుతున్నారు మీరు? ఆ మూడూ ఇస్లామిక్ దేశాలు. అక్కడ ముస్లింలను ఎవరూ వేధించడం లేదు. ప్రపంచంలోని ముస్లింలందరికీ భారత్‌లో పౌరసత్వం ఇవ్వాలా? ఇది సరైన మాటేనా" అని విపక్షంపై ఎదురుదాడి చేశారు. 'ఈ బిల్లుతో ముస్లింలను నిర్బంధ కేంద్రాలకు పంపేస్తారని, హిట్లర్ హయాంలో నాజీల నిర్బంధ కేంద్రాలకు పంపినట్లు ఇక్కడా జరుగుతుందని తృణమూల్ నేత డెరెక్ ఒబ్రెయిన్ అన్న వ్యాఖ్యలను షా తిరస్కరించారు."కాంగ్రెస్ నేతల మాటలు పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ వ్యాఖ్యలతో ఏకీభవించినట్లున్నాయి. క్రైస్తవులను పాక్‌లో సరిగా చూడడం లేదు. వారు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణ తలాక్, క్యాబ్, ఆర్టికల్ 370 ఇవేవీ.. ముస్లిం-వ్యతిరేకం కాదు" అని వ్యాఖ్యానించారు. తృణమూల్ ప్రవేశపెట్టిన 14 సవరణలూ వీగిపోయాయి.

### షా కు విపక్షం హేళన.. లైవ్ టెలికాస్ట్ ఆఫ్

బిల్లును హోంమంత్రి ప్రవేశపెడుతున్నపుడు రాజ్యసభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. బిల్లు అసోం ప్రయోజనాలకు వ్యతిరేకం కాదని హోంమంత్రి వివరణ ఇస్తుండగా విపక్ష సభ్యులు గట్టిగా అరుస్తూ ఆయనను హేళన చేశారు. దీంతో సభాపతి వెంకయ్యనాయుడు వారికి హెచ్చరిక చేశారు. వెంటనే ఈ నినాదాల హోరు ఆపకపోతే తాను ఈ గొడవ చేస్తున్న సభ్యుల పేర్లు బయటపెడతానని వార్నింగ్ ఇచ్చారు. వారి పేర్లు ప్రకటిస్తే ఇక ఆ సభ్యులు ఆ రోజుకు సభా కార్యక్రమాలకు దూరంగా ఉండాల్సి వస్తుంది. ఈ హెచ్చరికతో పాటు రాజ్యసభ ప్రసారాల్ని కూడా వెంకయ్యనాయుడు నిలిపివేయించారు. ఆయన తన పక్కనున్న రెడ్ బటన్ నొక్కగానే లైవ్ ఆగిపోయింది. గొడవ పూర్తిగా సద్దుమణిగాక మళ్లీ ప్రసారాలు మొదలయ్యాయి.

### జురాసిక్ రిపబ్లిక్‌గా మార్చొద్దు: సిబల్

" ఈ దేశంలో ముస్లింలెవరూ మిమ్మల్ని చూసి భయపడిపోరు. మీ లక్ష్యమేంటో, మీరేం కోరుకుంటున్నారో మాకు తెలుసు. ఘర్ వాపసీ, ఆ తరువాత తక్షణ తలాక్, ఆర్టికల్ 370, ఎన్ఆర్సీ, మరోసారి ఎన్ఆర్సీ... ఇవన్నీ వేటికి సంకేతమో తెలుసు. ఈ బిల్లు తెస్తే 20 కోట్ల మంది ప్రజలు మిమ్మల్ని నమ్మరు. భారతావని గురించి అవగాహనలేని వారికి మేం చెప్పినా అర్థం కాదు. ఈ బిల్లు ద్వారా కేవలం రెండే డైనోసార్లుండే జురాసిక్ రిపబ్లిక్‌గా భారత్‌ను మార్చవద్దు" అని వ్యంగ్యంగా కపిల్ సిబాల్ అన్నారు. "కచ్చితంగా ఇది కోర్టుకు వెళుతుంది. న్యాయసమీక్షకు నిలవదు. సుప్రీంకోర్టు కొట్టేస్తుంది" అని కాంగ్రెస్ ఎంపీ పి చిదంబరం పేర్కొన్నారు.

### టీడీపీ, వైసీపీ సై... టీఆర్ఎస్ నో

పౌరసత్వ సవరణ బిల్లుకు టీడీపీ, వైసీపీ మద్దతు ప్రకటించాయి. తెలంగాణలో పాలక పక్షమైన టీఆర్ఎస్ మాత్రం వ్యతిరేకించింది. బిల్లుకు తమ పార్టీ సంపూర్ణంగా మద్దతిస్తోందని టీడీపీపక్ష నేత కనకమేడల రవీంద్రకుమార్ వెల్లడించారు. వైసీపీపీ నేత విజయసాయిరెడ్డి కూడా పూర్తి మద్దతు ప్రకటించారు.

## లోక్‌సభలో అనుకూలం.. రాజ్యసభలో వాకౌట్!

- పౌరసత్వ బిల్లుపై శివసేన వింత ధోరణి

న్యూఢిల్లీ, డిసెంబరు 11: పౌరసత్వ సవరణ బిల్లుపై శివసేన ద్వంద్వ వైఖరి అవలంబించింది. లోక్‌సభలో బిల్లుకు మద్దతివ్వగానే మహారాష్ట్రలో సంకీర్ణ భాగస్వామి అయిన కాంగ్రెస్ దానిపై ఒత్తిడి తెచ్చింది. సేన చీఫ్, సీఎం ఉద్ధవ్ ఠాక్రేకు మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత ఒకరు ఫోన్ చేసి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ ముంబై వచ్చి ఉద్ధవ్‌తో చర్చించారు. అనంతరం రాజ్యసభలో పౌరసత్వ బిల్లుకు తమ పార్టీ మద్దతివ్వబోదని ఉద్ధవ్ ప్రకటించారు. తాము లేవనెత్తిన ప్రశ్నలన్నింటిపైనా కేంద్రం స్పష్టంగా సమాధానమిస్తేనే బిల్లుకు మద్దతిస్తామని తెలిపారు. మరోవైపు సేన ఎంపీ సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు హిందూత్వం గురించి చదువుకున్న పాఠశాలకు తామే హెడ్‌మాస్టర్లమని పేర్కొన్నారు. ఇంత హడావుడి చేసిన శివసేన చివరికి రాజ్యసభలో పౌరసత్వ బిల్లు ఆమోదానికి జరిగిన ఓటింగ్‌లో పాల్గొనలేదు. సేన సభ్యులు వాకౌట్ చేశారు.

## రగులుతున్న ఈశాన్యం

గువాహటి, అగర్తలా, డిసెంబరు 11: దుకాణాలు మూతపడ్డాయి. ఎక్కడి బస్సులు అక్కడే ఆగిపోయాయి! రోడ్ల మీద.. రైల్వే ట్రాకుల మీద.. ఎక్కడ చూసినా జనం.. ఎటు చూసినా జనప్రభంజనం! ఎవరి నోట వెంట విన్నా ఒకటే నినాదం.. 'సే నో టు కాబ్ (పౌరసత్వ సవరణ బిల్లును వద్దనండి)'.. అని! ఎవరి చేతిలో చూసినా అవే ప్లకార్డులు!! ఈశాన్య భారతం రగులుతోంది. పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా గళమెత్తుతోంది. ఆందోళనకారుల ఆగ్రహం మరింత పెచ్చరిల్లుతోంది. ముఖ్యంగా.. అసోం రాష్ట్రం యుద్ధభూమిలా మారింది. ఈ బిల్లుకు నిరసనగా బుధవారం వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చారు. రోడ్లపైన, రైల్వే ట్రాకులపైన టైర్లను వేసి నిప్పంటించారు. ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహించారు. జోర్హాత్, గోలాఘాట్, దిబ్రూగఢ్, టిన్సుకియా, శివాస్‌నగర్, బొంగాయ్‌గావ్, నాగావ్, సోనిట్‌పూర్ తదితర జిల్లాల్లో భారీ స్థాయిలో ఆందోళనలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రకటనలున్న బ్యానర్లను, హోర్డింగులను కిందికి లాగి ధ్వంసం చేశారు. దిబ్రూగఢ్‌లో రైల్వే ట్రాకులు, రహదారులపై ఉన్న ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. మోరాన్ జిల్లాలో రబ్బరు బుల్లెట్లను ఉపయోగించారు. కొన్ని చోట్ల బాష్పవాయు గోళాలను కూడా ప్రయోగించారు. గువాహటిలో సచివాలయాన్ని ముట్టడించేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు యత్నించారు. పోలీసులు లాఠీచార్జ్ చేసి టియర్ గ్యాస్ ప్రయోగించారు. నిరవధిక కర్ఫ్యూ విధించారు. కాగా ఆందోళనల నేపథ్యంలో ఈశాన్య సరిహద్దు రైల్వేకు సంబంధించిన పలు సర్వీసులను నిలిపివేశారు. ఎటువంటి వదంతులూ వ్యాపించకుండా ఉండేందుకు త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్‌లో ఇంటర్నెట్, ఎస్సెమ్మెస్ సర్వీసులను నిలిపివేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితిని చక్కదిద్దేందుకు 5000 మంది పారామిలటరీ సిబ్బందిని పంపించామని కేంద్రం వెల్లడించింది.

### ఎయిర్‌పోర్ట్‌లో చిక్కుపడ్డ అసోం సీఎం

ఆగ్రహ జ్వాలలు అసోం సీఎం సోనోవాల్‌కు తాకాయి. గువాహటి ఎయిర్‌పోర్ట్‌లో ఆయన చిక్కుకున్నారు. నగరంలో ఆందోళనలు తీవ్రస్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో బయటకు వెళ్లడం మంచిది కాదని చెప్పడంతో ఆయన విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది.

## విపక్ష విమర్శ- షా సమాధానం



**1) మత ప్రాతిపదికన దేశాన్ని విభజించారన్న అంశంపై..**

1950 ఏప్రిల్ 8న నెహ్రూ- లియాకత్ అలీ ఖాన్ ఒప్పందం (ఢిల్లీ డిక్లరేషన్) కుదిరింది. రెండు దేశాల్లోని మతపరమైన మైనారిటీలకు సమాన హక్కులు ఇవ్వాలన్నది నాటి ఒప్పందం. వారిద్దరూ అందుకు అంగీకరించారు. కానీ వాస్తవాన జరిగిందేమిటి? ఆ మూడు దేశాల్లో హిందువులు, ఇతరులు ద్వితీయ శ్రేణి పౌరులు. బాధలను అనుభవిస్తున్నారు. అసలు పాక్ ఆవిర్భావానికి కారణం మహమ్మద్ అలీ జిన్నా. ఆయన ప్రవచించిన ద్విజాతి సిద్ధాంతాన్ని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకోలేదు?

**2) ఆ మూడు దేశాలే ఎందుకు?**

మన దేశంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, చీఫ్ జస్టిస్, ఈసీ చీఫ్... మొదలైన ఏ రాజ్యాంగ పదవినైనా తీసుకోండి.. ముస్లింలు వాటిని అలంకరించిన సందర్భాలు అనేకం. పాక్‌లో ఉన్నాయా? బంగ్లాదేశ్‌లో ఉన్నాయా?

**3) రోహింగ్యా ముస్లింలను ఎందుకు చేర్చలేదు?**

రోహింగ్యాలు నేరుగా మయన్మార్ నుంచి భారత్‌కు రాలేదు. బంగ్లాదేశ్ వెళ్లి అక్కడ నుంచి అక్రమంగా భారత్‌లోకి చొరబడ్డారు. వారికి పౌరసత్వం ఇవ్వం.

**4) శ్రీలంక హిందువులను ఎందుకు చేర్చలేదు?**

ఇప్పటికే 9 లక్షల మంది శ్రీలంక తమిళ శరణార్థులకు పౌరసత్వం కల్పించాం.

**6) ముస్లిం శరణార్థులను ఎందుకు చేర్చలేదు?**

ఆరు మతాల వారిని చేరిస్తే మమ్మల్ని పొగడరు.. ముస్లింలను చేర్చకపోతే మాత్రం విమర్శిస్తారు. ఆ మూడూ ఇస్లామిక్ దేశాలు. అక్కడ ముస్లింలు మతపరంగా మైనారిటీలు కాదు. అన్ని సౌకర్యాలూ అనుభవిస్తున్నవారు. అయినప్పటికీ వేధింపులు ఎదుర్కొంటున్నామని చెప్పి దరఖాస్తు చేసుకున్న దాదాపు 566 మంది ముస్లింలకు పౌరసత్వం ఇచ్చాం

**7) ఇది ఆర్టికల్ 14కు (సమానత్వపు హక్కు) వ్యతిరేకం!**

కానే కాదు.. సహేతుకమైన వర్గీకరణ ఉన్నపుడు చట్టాలు చేయకుండా ఆర్టికల్ 14 ఆపలేదు. ఇందులో సహేతుకమైన వర్గీకరణ ఉంది. మేం కేవలం ఒక్క మతం వారినే తీసుకోలేదు. మైనారిటీలందర్నీ తీసుకున్నాం. ఇదీ ఒక క్లాస్ (వర్గీకరణే). కాబట్టి చెల్లుతుంది, తప్పులేదు.

## చరిత్రలో చీకటి దినం: సోనియా

న్యూఢిల్లీ, డిసెంబరు 11: పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదం పొందడాన్ని దేశ రాజ్యాంగ చరిత్రలో చీకటి రోజుగా, సంకుచిత ఆలోచనలున్న వ్యక్తుల విజయంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అభివర్ణించారు. ఈ బిల్లు భారత దేశ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. బీజేపీ విభజన రాజకీయాలపై అలుపెరగని పోరాటం చేస్తామని ఆమె ప్రకటించారు. ఈశాన్య భారతంలో జాతులు, వాటి సంస్కృతిని నిర్మూలించేందుకు మోదీ-షా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈశాన్య రాష్ట్ర ప్రజల ఆందోళనకు సంఘీభావం తెలుపుతున్నానని, వారి సేవకు సిద్ధమని పేర్కొంటూ ట్వీట్ చేశారు. బిల్లుపై హోం మంత్రి అమిత్ షా దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ విమర్శించారు. హిందూత్వ ఎజెండాలో భాగంగానే మోదీ ప్రభుత్వం బిల్లును తీసుకువచ్చిందని కాంగ్రెస్ నేత చిదంబరం వ్యాఖ్యానించారు.

### బిల్లుకు నిరసనగా ఐపీఎస్ రాజీనామా

ముంబై, డిసెంబరు 11: మహారాష్ట్ర ఐపీఎస్ అధికారి అబ్దుర్ రహమాన్ భారత పౌరసత్వ సవరణ చట్టాన్ని నిరసిస్తూ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన బిల్లు మతతత్వ పూరితమైనది, రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రహమాన్ ముంబయిలో స్పెషల్ ఐజీగా పని చేస్తున్నారు. శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా గురువారం నుంచి విధులకు హాజరు కావడం లేదని రహమాన్ తెలిపారు. కాగా, పౌరసత్వ సవరణ బిల్లును సుప్రీంకోర్టులో సవాలు చేస్తున్నట్లు జమాతే ఇస్లామీ హింద్ ప్రకటించింది.

## విపక్షాలది 'పాక్' మాట!

పౌరసత్వ బిల్లు చరిత్రాత్మకం

ఎంపీల భేటీలో మోదీ ప్రకటన



న్యూఢిల్లీ, డిసెంబరు 11: 'పౌరసత్వ సవరణ బిల్లు' సువర్ణాక్షరాలతో లిఖించినట్లుగా చరిత్రలో నిలిచిపోతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దులాగే... పౌరసత్వ సవరణ కూడా చరిత్రాత్మకమని తెలిపారు. ఇంతటి ఘనమైన బిల్లుపై విపక్షాలు 'పాకిస్థాన్ భాష'లో మాట్లాడుతున్నాయని ధ్వజమెత్తారు. బుధవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ ఈ అంశంపై తనదైన శైలిలో, ఉద్వేగభరితంగా ప్రసంగించారు. "మత వివక్ష, వేధింపులను భరించలేక భారత్‌లోకి వచ్చిన అనేక మంది ఇక్కడ అనిశ్చితి మధ్య బతుకుతున్నారు. పౌరసత్వంతో వారికి శాశ్వత ఉపశమనం లభిస్తుంది. ఈ బిల్లు ఆమోదం పొందగానే సరిపోదు! ఎంపీలంతా జనంలోకి వెళ్లాలి. దీనిపై ఉన్న అనుమానాలు, అపోహలను పటాపంచలు చేయాలి. పౌరసత్వ సవరణ ఉద్దేశం గురించి ప్రజలకు వివరించాలి" అని బీజేపీ ఎంపీలను ఆదేశించారు. అలాగే... రాబోయే బడ్జెట్ ఎలా ఉండాలనే అంశంపైనా ప్రజాభిప్రాయం సేకరించాలని సూచించారు.

### 'కర్ణాటక'కోసం మరొక్కసారి...

పౌరసత్వ సవరణ బిల్లులో ముందడుగుపై అభినందిస్తూ... బీజేపీ ఎంపీలంతా ప్రధాని రాగానే లేచి నిలుచుని, చప్పట్లు కొడుతూ స్వాగతం పలికారు. "కర్ణాటక ఉప ఎన్నికల్లో ప్రజలు మనకు ఘన విజయం కట్టబెట్టారు. వారికి ధన్యవాదాలు చెబుతూ కోసం మరొక్కసారి..." అంటూ ప్రధాని మోదీ మరోసారి ఎంపీలతో చప్పట్లు కొట్టించారు.

# తట్ట మట్టి తీయకుండా డంబాలా?

- రాష్ట్రానికి వైఎస్ తీరని ద్రోహం
- మిగులు జలాలు అక్కర్లేదని రాసిచ్చారు
- ఈ 7 నెలల్లో రూపాయి ఖర్చుచేయలేదు
- అసెంబ్లీలో తిట్టినా పడుతూ ఉండాలా?
- జవాబిచ్చే హక్కు లేదా?: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఈ ఏడు నెలల్లో జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై రూపాయి ఖర్చు చేయలేదు. ఎక్కడా తట్ట మట్టి తీయలేదు. మొత్తం ప్రాజెక్టులన్నీ తామే కట్టినట్లుగా అసెంబ్లీలో గొప్పగా డంబాలు చెప్పుకొంటున్నారు' అని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలు అచ్చెన్నాయుడు, రామానాయుడు, బుచ్చయ్య చౌదరి, గౌనివారి శ్రీనివాసులు, గుమ్మడి సంధ్యారాణితో కలిసి బుధవారం ఆయన మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కృష్ణా జలాల్లో మిగులు జలాలు మన రాష్ట్రానికి అవసరం లేదని బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు రాసివ్వడం ద్వారా నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. దానిని కప్పిపుచ్చి ఆయన రాయలసీమకు ఏదో చేశారని భ్రమ కల్పించాలని జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సీమకు సాగునీరు అందించాలన్న దృఢ సంకల్పానికి కేంద్ర బిందువు ఎన్టీఆరేనని, తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల రూపకర్త ఆయనేనని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా అంశాలపై ఏమన్నారంటే..

### అగ్రిగోల్డ్ బాధితులకు ద్రోహం



'జగన్ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు నమ్మక ద్రోహం చేసింది. వారికి రూ.1150 కోట్లు ఇస్తామని ప్రకటనలు చేశారు. కేవలం రూ.270 కోట్లే ఇచ్చారు. వైసీపీ కార్యకర్తలకు వలంటీర్ ఉద్యోగాలిచ్చి మొత్తం నిరుద్యోగులను ఉద్ధరించినట్లు ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకొంటున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగాల్లో తొంభై శాతం తమ పార్టీ వారికే వచ్చాయని విజయసాయిరెడ్డి ఘనంగా చెప్పుకొన్నారు. ఈ పేరుతో 22 లక్షల మంది నిరుద్యోగులను వంచించారు.'

### ఆర్టీసీ చార్జీలపై చెప్పక్కర్లేదా..?

'ఆర్టీసీ చార్జీలు పెంచే ముందు అసెంబ్లీలో ఒక ప్రకటన చేసి చర్చించి నిర్ణయం తీసుకోవడం సంప్రదాయం. అది కూడా అవసరం లేనంతగా అహం పెరిగిపోయింది. ప్రజలకు ఏదీ చెప్పాల్సిన అవసరం లేదన్నట్లుగా కొవ్వెక్కి వ్యవహరిస్తున్నారు. కొన్ని రూట్లలో చార్జీలు 50 శాతం పెరిగాయి. 70 లక్షల మంది ప్రయాణికులపై భారం మోపారు. అడుగుదామంటే సభలో మైకివ్వరు. వీళ్లు ప్రతిపక్షంలో ఉన్నపుడు గంటల తరబడి మాట్లాడారు. మైకివ్వకపోతే దబాయించి తీసుకునేవారు.'

### పది మందితో తిట్టిస్తున్నారు..

'స్పీకర్ దారుణంగా వ్యవహరిస్తున్నారు. పది మందితో నన్ను తిట్టిస్తున్నారు. నేను సమాధానమివ్వకుండా సభ వాయిదా వేసుకుని వెళ్లిపోతున్నారు. సభలో నాకు హక్కులు లేవా? నాకు ఆత్మగౌరవం లేదా? వాళ్లు ఏం తిట్టినా పడుతూ సభలో కూర్చోవాలా? మీతో మాటలు పడడానికి సభకు రావాలా? ముఖ్యమంత్రి సైగ చేస్తేనే మాకు మైకిస్తారా? సభకు ఒక పద్ధతి ఉంటుందని మర్చిపోతున్నారు. నన్ను తిడుతూ ఉంటే ముఖ్యమంత్రి, స్పీకర్ ముఖాలు వెలిగిపోతున్నాయి. దీనిని ప్రశ్నిస్తే నేనేదో స్పీకర్‌ను అన్నానని ఎదురుదాడి చేస్తున్నారు. నేనేమీ బూతులు మాట్లాడడం లేదు. అసభ్యంగా మాట్లాడడం లేదు. సభను హుందాగా నడపాలని కోరడం నా హక్కు. ఎన్ని అవమానాలు చేసినా నా గొంతు నొక్కలేరు. మా పోరాటం ఆగదు. సభలో మాట్లాడే అవకాశం రాక.. బయటకు వచ్చి మాట్లాడాల్సి వస్తోంది. ఇది ఎవరికి గౌరవమో ఆలోచించుకోవాలి.'

### మీడియా ఆంక్షలపై నేడు పోరాటం

'మీడియాపై విధిస్తున్న ఆంక్షలపై గురువారం పోరాటం చేస్తాం. మూడు చానళ్లను అసెంబ్లీ లోపలకు రానివ్వకపోవడం, మీడియాపై కేసులు పెడతామంటూ జీవోలు జారీ చేయడాన్ని గట్టిగా నిరసిస్తాం. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే గవర్నర్‌ను కలుస్తాం.'

## గుజరాత్ అల్లర్లలో మోదీకి క్లీన్ చిట్

'గోధ్రా' ఘటనే హింసకు మూలం.. జస్టిస్ నానావతి కమిటీ నివేదిక

గాంధీనగర్, డిసెంబరు 11: గోధ్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలు బోగీల్లో 59మంది కరసేవకులు సజీవ దహనమైన ఘటన అనంతరం గుజరాత్ వ్యాప్తంగా చెలరేగిన అల్లర్లలో నాటి సీఎం నరేంద్ర మోదీకి జస్టిస్ నానావతి కమిషన్ క్లీన్‌చిట్ ఇచ్చింది. హింసాకాండలో రాష్ట్రప్రభుత్వ ప్రమేయం లేదని.. ముందస్తు కుట్ర లేనే లేదని స్పష్టం చేసింది. స్థానికంగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు కొన్నిచోట్ల అల్లర్లకు పాల్పడ్డారని నివేదిక ఇచ్చింది. ఐదేళ్ల క్రితం కమిషన్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర హోంశాఖ సహాయమంత్రి ప్రదీప్‌సిన్హ్ జడేజా బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 2014 నవంబరు 18న నాటి సీఎం ఆనందిబెన్ పటేల్‌కు 2000 పేజీల ఈ నివేదికను సమర్పించినా.. సభకు తీసుకురాలేదు. దీనిపై మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌బీ శ్రీకుమార్ హైకోర్టును ఆశ్రయించగా.. త్వరలో దానిని అసెంబ్లీలో ప్రవేశపెడతామని ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు సభకు సమర్పించింది.

## వృద్ధులను దూషిస్తే ఆర్నెల్ల జైలు

న్యూఢిల్లీ, డిసెంబరు 11: తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లను దుర్భాషలాడినా, పట్టించుకోకపోయినా ఆరు నెలల జైలుశిక్ష లేదా రూ.10,000 జరిమానా లేదా రెండూ విధించేలా బుధవారం కేంద్రం ఒక బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్రమంత్రి తావర్‌చంద్ గెహ్లోత్ ప్రవేశపెట్టిన 'తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంరక్షణ, సంక్షేమ సవరణ బిల్లు' ప్రకారం తమ పోషణ ఖర్చును అడిగే హక్కు వృద్ధులకు ఉంటుంది. తమ సంరక్షణలో ఉన్న తల్లిదండ్రులను, సీనియర్ సిటిజన్లను మానసికంగా బాధపెట్టినా శిక్ష తప్పదు. కొడుకు, కూతురుతో పాటు దత్తత, సవతి సంతానం, అల్లుడు, కోడలు, మనవడు, మనవరాలు పిల్లల కిందే లెక్కలోకి వస్తారు.

## ఐఐటీల్లో ఫీజు పెంపుపై తగ్గిన ప్రభుత్వం

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) విద్యార్థుల ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీల్లో ఎంటెక్ ఫీజు పెంపు నిర్ణయాన్ని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి(హెచ్ఆర్‌డీ) మంత్రిత్వశాఖ నిలిపివేసింది. ఐఐటీ కౌన్సిల్ తదుపరి సమావేశం వరకూ ఫీజు పెంపు నిర్ణయాన్ని వాయిదా వేసింది.

# ఇదేమి టెండ'రింగ్'!

▸ మలిదేవి డ్రెయిన్ పనుల్లో వివాదం

నెల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టెండర్ల ప్రక్రియలో అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులు తమ 'పవర్' చూపించారు. కనిగిరి రిజర్వాయర్ నుంచి నెల్లూరులో తీరం వరకు 42 కిలోమీటర్ల పొడవునా ఉన్న మలిదేవి డ్రెయిన్‌లో పూడికతీత, ఆధునీకరణ పనులు దక్కించుకునేందుకు భారీ టెండ'రింగ్'కు పాల్పడ్డారు. ఈ పని విలువ రూ.72 కోట్లు. ఈ నెల 10వ తేదీతో టెండర్ల గడువు ముగిసింది. శుక్రవారం రివర్స్ టెండరింగ్ జరగాల్సి ఉంది. మొత్తం ఆరుగురు కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసినట్లు తెలిసింది. తమకు దక్కాల్సిన పనులకు మరొకరు పోటీకి రావడంపై అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఆగ్రహించినట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో టెండర్లు వేసిన వారు బుధవారం ఉదయం 11 గంటల్లోపు బ్యాంకు గ్యారెంటీ(బీజీ)లు ఇరిగేషన్ ఎస్ఈకి అందించాల్సి ఉంటుంది. ఇక్కడే... సదరు నాయకుడు చక్రం తిప్పారు. పోటీకి వచ్చిన వారు బీజీలు ఇవ్వకుండా అడ్డుకున్నారు. అటు... బీజీలు తీసుకోవాల్సిన ఎస్ఈ కూడా మంగళవారం నుంచే అందుబాటులో లేకుండా పోయారు. దీంతో టెండర్లు వేసిన వారిలో కొందరు బుధవారం నేరుగా ఎస్ఈ ఆఫీసుకు వచ్చారు. వీరి నుంచి బీజీలు తీసుకోవాల్సిన ఎస్ఈ... ఆఖరి నిమిషంలో ఆఫీసుకు వచ్చి నేరుగా కంప్యూటర్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. ఉదయం 11 గంటల తర్వాత బయటికి వచ్చి... గడువు ముగిసిపోయిందని, బీజీలు తీసుకునేది లేదని చెప్పారు. దీంతో సదరు కాంట్రాక్టర్లు రివర్స్ టెండరింగ్‌కు అనర్హులుగా మారారు. మొత్తమ్మీద ఆరుగురు కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో టెండర్లు వేయగా... ఇద్దరు మాత్రమే బీజీలు ఇచ్చినట్లు తెలిసింది. వీరిలో కూడా ఎవరికి టెండర్ ఇవ్వాలన్నది ఇప్పటికే సదరు ప్రజాప్రతినిధి నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. నిజానికి.. మలిదేవి డ్రెయిన్‌కు అంచనాల తయారీనే ఎక్కువగా జరిగిందని, నిబంధనల ప్రకారం టెండర్లు జరిగితే కనీసం 25 శాతం వరకు లెస్‌కు వేసే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాదరావును సంప్రదించేందుకు కార్యాలయానికి వెళ్లగా అందుబాటులో లేరు. ఫోన్‌లో సంప్రదించినా స్విచ్‌ఆఫ్ వస్తోంది. కాంట్రాక్టర్ల నుంచి బీజీలు తీసుకోకుండా ఎస్ఈపైనా తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

## వంశీకి ప్రత్యేక గుర్తింపుపై టీడీపీ నిరసన

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నుంచి వెళ్లిపోయిన వల్లభనేని వంశీమోహన్‌ను అసెంబ్లీలో ప్రత్యేక సభ్యునిగా గుర్తించి, విడిగా సీటు కేటాయించడంపై తెలుగుదేశం శాసన సభాపక్షం నిరసన వ్యక్తం చేసింది. బుధవారం ఇక్కడ అసెంబ్లీ లాబీల్లో స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి ఈమేరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. తమ పార్టీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం సరికాదని, ఆయనకు స్పీకర్ మైక్ ఇచ్చి తమను తిట్టిస్తున్నారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వంశీ.. తాను ఎవరినీ తిట్టలేదన్నారు. తాము వంశీతో వాగ్వాదానికి రాలేదని అచ్చెన్న అనగా.. స్పీకర్ జోక్యం చేసుకొని వంశీని అక్కడి నుంచి పంపించివేశారు.

## ఏబీఎన్‌ను అనుమతించాలి: శ్రీనివాసులు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్, టీవీ 5, ఈటీవీలను అసెంబ్లీ సమావేశాలు కవర్ చేయడానికి అనుమతించాలని టీడీపీ ఎమ్మెల్సీ జి.శ్రీనివాసులు డిమాండ్‌చేశారు. శాసనమండలికి ప్రత్యేక మీడియా పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు.

## లోకేశ్ అంటే నాకూ వణుకే: రోజా

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): "టీడీపీ నేత లోకేశ్‌ను చూస్తే మంత్రులకు కాళ్లు వణుకుతున్నాయట! ఎందుకు మేడం" అని మీడియా ప్రతినిధులు వేసిన ప్రశ్నకు వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా స్పందించారు. తనకూ లోకేశ్ పేరు చెబితే కాళ్లు వణుకుతాయని ఆమె వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ప్రాంగణంలో బుధవారం రోజా మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. మంగళగిరి అని పలకడానికి లోకేశ్ ట్యూషన్ పెట్టించుకున్నారన్నారు. ఏపీఐఐసీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉన్న అంబటి రాంబాబును తనకు సలహాలు ఇవ్వాలని ఎప్పుడో కోరానని.. ప్రస్తుతం ఆ పదవిని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రోజా అన్నారు.

## కొనుగోలుపై వారంలో ప్రకటన: కన్నబాబు

రాష్ట్రంలో కనీస మద్దతు ధరకు వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుపై వచ్చే బుధవారం నాటికి స్పష్టమైన ప్రకటన చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. ఏ పంటను ఎంత రేటుకు కొనుగోలు చేస్తామనేది కూడా అందులో స్పష్టం చేస్తామని చెప్పారు. కనీస మద్దతు ధర పొందలేని రైతులు టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే అధికారులు తక్షణమే స్పందిస్తారని చెప్పారు.

## మహిళల్ని కించపరిస్తే మట్టిపాలే: బుద్దా

విజయవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'మహిళల్ని అవమానపర్చే విధంగా మాట్లాడటం మంచిది కాదు విజయసాయిరెడ్డి గారూ! మహిళల్ని కించపరిస్తే మట్టికొట్టుకుపోతారు. చంద్రబాబు అప్పుచేసి మరీ మహిళలకు రూ. 13,500 కోట్లు పప్పు బెల్లాల్లా పంచేశారని మీరు, మీ జగన్ గారు మాట్లాడటం దారుణం. మీ వ్యాఖ్యలతో వైసీపీది మహిళా వ్యతిరేక ప్రభుత్వమని తేలిపోయింది.' అని బుద్దా వెంకన్న ట్వీట్ చేశారు.

## నా పాత్రను నిరూపిస్తే ఉరేసుకుంటా: ఆది

జమ్మలమడుగు రూరల్, కడప క్రైం, డిసెంబరు 11: 'మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నా పాత్ర ఉందని రుజువు చేస్తే మీరు చెప్పినచోట ఉరి వేసుకుంటా, ఒకవేళ మీదే తప్పని తేలితే ఏమిచేస్తారో చెప్పాలి.' అని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి సవాల్ విసిరారు. సిట్ విచారణకు రావాలంటూ బుధవారం ఇద్దరు ఎస్ఐలు వచ్చి నోటీసులు ఇచ్చారని, 12వ తేదీన సిట్ విచారణకు హాజరవుతానన్నారు. కాగా, పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురానికి చెందిన టీడీపీ నాయకుడు కసనూరు గంగాధర్‌రెడ్డిని సిట్ విచారించింది.



## మాతృభాష కోసం సత్యాగ్రహ దీక్ష

విజయవాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అమలుకు వ్యతిరేకంగా మాతృభాష మాధ్యమ వేదిక సత్యాగ్రహ దీక్ష చేపట్టింది. బుధవారం విజయవాడలో ప్రారంభమైన ఈ దీక్షలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, సుమారు 30 ప్రజాసంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు, బాలసుబ్రహ్మణ్యం, కత్తి నరసింహారెడ్డి, రఘువర్మ మాట్లాడుతూ మాధ్యమాన్ని ఎంచుకునే అవకాశం విద్యార్థులకే ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమ నిర్ణయంపై పునరాలోచన చేయాలని సూచించారు.

## 'రెడ్డి రాజ్యంలో కక్ష పాలన': జేసీ

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్మ తన సినిమాకి 'రెడ్డి రాజ్యంలో కక్ష పాలన' అని పెడితే బాగుండేదన్నారు. "చంద్రబాబుకు గుండెలేదు. ఆయన రాజ్యంలో కమ్మవారంతా కృష్ణా, గోదావరిలో కలిశారు. జగన్ నామినేటెడ్ పదవుల్లో రెడ్లకు ఎక్కువ ఇచ్చినందుకు అభినందనలు. మావాడి గట్స్‌కు అభినందిస్తున్నాను. మా చంద్రబాబుకు అది చేతగాలేదు. నాపై కేసులపై కోర్టును ఆశ్రయించా. బస్సులవ్యాపారాన్ని మానేద్దామనుకుంటున్నాను" అని జేసీ పేర్కొన్నారు.

## రిజర్వేషన్ల ముసుగులో రెడ్లకే పట్టం: టీడీపీ

50 శాతం రిజర్వేషన్లంటూ మాయమాటలు చెబుతున్న జగన్మోహనరెడ్డి ప్రభుత్వం, ఆ ముసుగులో ప్రాధాన్యంలేని పదవుల్ని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చి, లక్షల కొద్దీ జీతాలు ప్రాధాన్యతా స్థానాల్ని మాత్రం రెడ్డి సామాజిక వర్గానికి కట్టబెట్టిందని టీడీపీ ఎమ్మెల్యేలు మద్దాలిగిరి, డోలా బాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబానికి దగ్గరి బంధువైన లోకేశ్వర రెడ్డిని ఆర్టీజీఎస్ సీఈవోగా, సాక్షి క్రైమ్ రిపోర్టర్‌గా పని చేసిన తిరుమలరెడ్డిని డీజీపీ పీఆర్వోగా బాధ్యతలు అప్పగించారన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవి అప్పగించారన్నారు. వైసీపీ సోషల్ మీడియాలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన చల్లా మధుసూదన్‌రెడ్డిని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రెడ్డి రాజ్యాన్ని నడుపుతోందని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# క్రూరులకు ఉరే సరి!

(మొదటి పేజీ తరువాయి)

కఠిన శిక్ష విధించేలా 'క్రిమినల్ లా'ను సవరించాలని నిర్ణయించింది. బుధవారం కేబినెట్ సమావేశంలో దీనిపై చర్చ జరిగింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... కేబినెట్ భేటీలో 21 అజెండా అంశాలతోపాటు, రెండు టేబుల్ ఐటమ్స్ ప్రవేశపెట్టారు. 'మహిళలు, చిన్నారులపై పాశవికంగా, సామూహిక అత్యాచారం చేసి.. కిరాతకంగా చంపేసే వారిని కఠినంగా శిక్షించాల్సిందే. దిశ ఘటన అత్యంత కిరాతకం. ఇలాంటి ఘోరం మన రాష్ట్రంలోనే జరిగి ఉంటే మంత్రులుగా మీరెలా స్పందించేవారు? ముఖ్యంగా మహిళా మంత్రులు ఎలా స్పందించేవారు? ఈ రోజుల్లో ప్రజలు తక్షణ న్యాయం కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో ప్రభుత్వాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన రాష్ట్రంలో జరిగి ఉంటే.. ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెరిగేది. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుందాం. భవిష్యత్‌లో ఆడపిల్లలపై చేయి వేయాలని, మానభంగం చేయాలన్న ఆలోచన వచ్చేందుకూ భయపడేంత కఠినమైన చట్టం తీసుకొద్దాం. ఈ చట్టం పేరు వింటేనే భయపడిపోవాల'ని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. మహిళలపై క్రూరమైన నేరాలకు పాల్పడితే ఉరిశిక్షను అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

### ఏం పేరు పెడదాం?

మహిళలపై నేరాలు, అత్యాచారాల కేసుల్లో కఠిన శిక్షను ప్రతిపాదిస్తూ చేస్తున్న చట్టానికి ఏం పేరు పెట్టాలనే అంశంపైనా చర్చ జరిగింది. పేరు చెప్పాలని మంత్రులను జగన్ కోరారు. గతంలో నిర్భయ ఘటన తర్వాత కేంద్రం అదే పేరిట చట్టం తీసుకొచ్చిందని మంత్రి వనిత గుర్తు చేశారు. ఇప్పుడు.. దిశ ఘటన తర్వాత రాష్ట్రంలో చేస్తున్న చట్టానికి 'ఆంధ్రప్రదేశ్ దిశ చట్టం-2019'గా పేరు పెడతామని సూచించారు. మంత్రులు సురేశ్, అంజద్ బాషా, పినిపె విశ్వరూప్ దీన్ని సమర్థించారు.

### అదేం కుదరదు..

చట్టంలో నేరుగా 'ఉరి శిక్ష' అని కాకుండా... జైలు శిక్ష లేదా మరణ శిక్ష అని పెడితే బాగుంటుందేమో అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ, లా కార్యదర్శి అభిప్రాయపడ్డారు. నేర తీవ్రతను బట్టి శిక్షను న్యాయమూర్తి నిర్ణయిస్తారని తెలిపారు. అయితే... అందుకు ముఖ్యమంత్రి జగన్ నిరాకరించారు. "ప్రస్తుతం ఉన్న చట్టంలో విచారణ పూర్తి చేసేందుకు 4 నెలల సమయం ఇచ్చారు. అత్యాచార హంతకులకు శిక్ష పడుతుందో లేదో తెలియని పరిస్థితి ఉంది. నిర్ధారించదగ్గ ఆధారాలతో దొరికిన వారికి జైలు శిక్షతోనే సరిపెడితే ఎలా? వారిని ఉరి తీయాల్సిందే" అని జగన్ స్పష్టం చేశారు. ఈ బిల్లును ముందుగా అసెంబ్లీ ఆమోదించి చట్టం చేశాక.. గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఆమోదానికి పంపాలని కేబినెట్ తీర్మానించింది.

### కేసు నుంచి శిక్ష దాకా...

**7 రోజులు:** అత్యాచార కేసుల్లో పోలీసులు వారంలో దర్యాప్తు చేయాలి.

**14 రోజులు:** కోర్టులో చార్జిషీటు దాఖలు చేసిన తర్వాత 14 రోజులపాటు రోజువారీ విచారణ జరుగుతుంది.

**21 రోజులు:** సంఘటన జరిగిన రోజు నుంచి 21 పనిదినాల్లో శిక్ష ఖరారవుతుంది.

### సవరణ చట్టం...

ఆంధ్రప్రదేశ్ క్రిమినల్ లా సవరణ, మహిళలు, చిన్నారులపై కొన్ని నిర్దిష్ట నేరాలపై ప్రత్యేక కోర్టు చట్టం-2019.

**ఎలాంటి నేరాలు**

మహిళలపై అత్యాచారం, సామూహిక అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు, చిన్నారులపై దాడుల కేసుల్లో సత్వర విచారణ. ఈ కేసుల విచారణకు జిల్లాకు ఒకటి చొప్పున 13 ప్రత్యేక కోర్టులు ఏర్పాటవుతాయి. ఇవి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లా పని చేస్తాయి.

**'సోషల్' పోస్టింగ్‌లూ...**

ఈ-మెయిల్స్, సోషల్ మీడియా, డిజిటల్ మీడియాలో మహిళల గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు. నిందితులపై ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 354(ఇ) కింద చర్యలు తీసుకుంటారు. దీని ప్రకారం... మొదటిసారి తప్పు చేస్తే రెండేళ్ల జైలు, రెండోసారి తప్పు చేస్తే నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తారు.

**పిల్లలపై నేరాలకు...**

పోస్కో చట్టం కింద 3 నుంచి ఐదేళ్ల వరకూ ఉన్న శిక్షలను కేబినెట్ సవరించింది. ఇకపై... పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడితే 10 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వరకూ శిక్ష వేస్తారు. నేర తీవ్రతను బట్టి గరిష్ఠంగా జీవిత ఖైదు కూడా విధించవచ్చు.

# విలీనానికి ఓకే

(మొదటి పేజీ తరువాయి)

51,000 పైచిలుకు పోస్టులను సృష్టించి, ఆర్టీసి సిబ్బందిని అందులో అకామిడేట్ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇలా 'ఆర్టీసీ ఉద్యోగులు ఇక ప్రభుత్వోద్యోగులే'నని సీఎం జగన్ నేతృత్వంలో సచివాలయంలో జరిగిన మంత్రివర్గ భేటీ తీర్మానించింది. ఈ సందర్భంగా ఆర్టీసీ విలీనం సాధ్యాసాధ్యాలపై కేబినెట్‌లో చర్చసాగింది. 1997లో అప్పటి సర్కారు జీవో నం.14ను తీసుకొచ్చిందని.. దీని ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు వీల్లేదని అధికారులు వివరించారు. చంద్రబాబు అన్నింటినీ అడ్డుకుంటారని ఈ సందర్భంగా జగన్ అన్నారు. ముందుగా 14/97 జీవోను రద్దు చేయాలని ఆయన ఆదేశించగా, అలా చేస్తే, మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థలు కూడా తమను ప్రభుత్వంలో విలీనం చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాయని అధికారులు చెప్పారు. అలాగైతే, ఈ జీవోను రద్దు చేస్తూనే, ఆర్టీసీని మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లుగా ఉత్తర్వులు ఇవ్వాలని సీఎం జగన్ ఆదేశించారు. కాపు ఉద్యమం సందర్భంగా చంద్రబాబు హయాంలో తుని వద్ద జరిగిన విధ్వంసంపై నమోదయిన కేసులను రద్దు చేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. కేబినెట్‌లో ఇంకా మరికొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొన్నారు. అవి..

- గ్రామ వలంటీర్లు, సచివాలయాలకు సంబంధించి ప్రభుత్వంలో కొత్తశాఖ ఏర్పాటు. ఆ శాఖ ముఖ్యకార్యదర్శిగా కన్నబాబు నియామకం.
- కాపు ఉద్యమం సమయంలో చోటుచేసుకొన్న తుని ఘటనతో సహా ఇతర ఉద్యమ సంఘటనలపై పెట్టిన కేసులు ఎత్తివేత. అయితే, అవి రైల్వే విభాగం కిందకు వస్తున్నందున కేసులు ఎత్తివేయాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయం. భోగాపురం విమానాశ్రయం కోసం భూ సేకరణ సమయంలో ఉద్యమకారులపై పెట్టిన కేసులూ ఎత్తివేయాలి.
- వైఎస్సార్ పెన్షన్ కానుక మార్గదర్శకాలకు చేసిన సవరణల ఆమోదం. గతంలో కంటే ఆదాయ పరిమితి పెంచారు.
- 101 కోట్ల షేర్ కాపిటల్‌తో జనరల్ ఇన్సూరెన్సు కార్పొరేషన్
- ఏపీ మిల్లెట్ బోర్డు చట్టం-2019 ముసాయిదాకు కేబినెట్ ఆమోదం. వాటి సాగు పెంపునకు బోర్డు ఏర్పాటు.
- ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రుణ పరపతి మరో రూ.3000 కోట్లు పెంచేందుకు అనుమతి.
- ఏపీ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్‌కు సవరణ
- అక్రమంగా మద్యాన్ని తయారు చేసినా, రవాణా చేసినా , నిల్వ ఉంచినా కఠిన శిక్షే.
- ఏపీ టాక్స్ ఆన్ ప్రొఫెషన్స్, ట్రేడ్స్ , కాలింగ్స్ అండ్ ఎంప్లాయిమెంట్ సవరణ బిల్లు -2019కు ఆమోదం
- వీఏవో, సంఘమిత్ర, యానిమేటర్ల జీతం 10వేలకు పెంపు.
- చిత్తూరు జిల్లా పంగూరు గ్రామంలో 15.28 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు.
- వచ్చే ఏడాది 1-6 తరగతి వరకూ ఇంగ్లీషులో బోధన.
- రాజధాని ప్రాంతంలో కొనుగోలు చేసి ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చిన అసైన్డ్ భూములకు రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు కేటాయింపునకు కేబినెట్ ఆమోదం. ఈ అసైన్డ్ భూములను గత లబ్ధిదారులకే తిరిగి ఇవ్వాలి.. వారు మరణిస్తే వారసులకు...
- కడప జిల్లాలో వైఎస్ఆర్ ఆర్కిటెక్ట్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ ఏర్పాటు. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ లేదా ఆయన నియమించిన వ్యక్తిని అన్ని వర్సిటీల్లో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నియమిస్తూ చట్టసవరణ.
- సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీని, కేవీఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజీ, గవర్నర్‌మెంట్ డిగ్రీకాలేజీలతో విలీనం చేస్తూ కర్నూలులో క్లస్టర్ వర్సిటీ ఏర్పాటు.
- సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్‌గా వంగపండు ఉష.

# ఆంగ్లం వద్దనలేదు!

▸ తెలుగు కూడా కావాలంటున్నాం

▸ మునిసిపల్ స్కూల్స్‌లో ఇంగ్లీషు పెడితే ఎందుకు వ్యతిరేకించారు?

▸ అసెంబ్లీలో చంద్రబాబు ప్రశ్న

▸ 'సాక్షి' ఒక కథనం రాస్తే రాద్ధాంతమా?

▸ అన్ని స్కూళ్లలో ఎందుకు పెట్టలేదు

▸ ముఖ్యమంత్రి జగన్ నిలదీత

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల భాషకు, విద్యార్థులు ఆంగ్లం నేర్చుకోవడానికి తాము వ్యతిరేకం కాదని విపక్ష నేత చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే, అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆంగ్ల మాధ్యమంపై తెలుగుదేశం అడిగిన ప్రశ్నపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలి భాషాప్రయుక్తరాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో మాతృభాషలో మాధ్యమం లేకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో మునిసిపల్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టినప్పుడు... దాన్ని వ్యతిరేకిస్తూ జగన్ పత్రికలో వచ్చిన కథనాలను గుర్తు చేశారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్ మండిపడ్డారు. "ప్రభుత్వం ఏం చేసినా చంద్రబాబుకు రాజకీయమే కనిపిస్తోంది. మునిసిపల్ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమానికి వ్యతిరేకంగా సాక్షిలో వచ్చిన ఓ కథనాన్ని పట్టుకొని రాద్ధాంతం చేస్తున్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం పెట్టాలన్న నిర్ణయం తీసుకుని ఉంటే ఎవరు ఆపగలిగేవారు? మీరెందుకు ఆ నిర్ణయం తీసుకోలేదు" అని ప్రశ్నించారు.

### బాబు పీహెచ్‌డీ ఎప్పుడో: చెవిరెడ్డి

ఇంగ్లీషు మీడియంతో విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, పోటీ ప్రపంచంలో నెగ్గుకురాగలమన్న ధీమా వారిలో ఏర్పడుతుందని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ అన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... తాను ప్రీ పీహెచ్‌డీ పరీక్షను తెలుగులో రాస్తే దానిపై తెలుగు యువత విభాగం రాద్ధాంతం చేసిందని, తనను అనర్హుడిగా ప్రకటించాలని గొడవకు దిగిందని తెలిపారు. దీంతో తాను ఇంగ్లీషు కోచింగ్ తీసుకుని మళ్లీ ప్రీపీహెచ్‌డీ పరీక్ష రాసి పీహెచ్‌డీ పూర్తి చేయల్సి వచ్చిందని చెవిరెడ్డి చెప్పారు. "చంద్రబాబు పీహెచ్‌డీ చేశాను అని గతంలో కూడా చెప్పారు. అప్పుడు ఎస్వీ యూనివర్సిటీలో పీహెచ్‌డీయే లేదు. 50 ఏళ్ల నుంచి ఆయన పీహెచ్‌డీ చేస్తూనే ఉన్నారు. అది ఎప్పటికి పూర్తవుతుందో!" అని ఎద్దేవా చేశారు.

# సీమకు జలకళ!



'కాల్వలను వెడల్పు చేయాలని ఐదేళ్లుగా మేం ఎంత మొత్తుకున్నా చంద్రబాబు పెడచెవినిపెట్టారు. మా ప్రభుత్వం అన్ని కాల్వలను విస్తరిస్తుంది. వైఎస్ కలలు కన్న రాయలసీమను సాకారం చేస్తాం.' - సీఎం జగన్

▸ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతాం

▸ 44 వేల నుంచి 80 వేల క్యూసెక్కులకు

▸ తెలుగుగంగ కెనాల్ 18 వేలకు

▸ ప్రతిపాదనలన్నీ సిద్ధమవుతున్నాయ్

▸ వచ్చేనెలలోనే టెండర్లకు వెళ్తాం

▸ వైఎస్ కలను సాకారం చేస్తాం

▸ అసెంబ్లీలో సీఎం జగన్ ప్రకటన

▸ మిగులు జలాలు వద్దని వైఎస్సే ట్రైబ్యునల్‌కు లేఖరాశారు: టీడీపీ

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'రాయలసీమ ప్రాజెక్టుల కెపాసిటీ పెంచుతాం.. కాల్వలను విస్తరిస్తాం.. కరువు ప్రాంతాన్ని నీటితో కళకళలాడిస్తాం..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అన్నారు. బుధవారం అసెంబ్లీలో రాయలసీమ నీటి ప్రాజెక్టులపై టీడీపీ ప్రశ్నించింది. తమ హయాంలో కరువు ఉన్నా వందల చెరువులు నింపామని, ఈ ఏడాది వరదలొచ్చినా ప్రాజెక్టులు నింపలేని అసమర్థ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తోందని టీడీఎల్పీ ఉపనేతలు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు. కృష్ణా నది నుంచి 798 టీఎంసీల నీరు సముద్రంలో వృధాగా కలిసిపోయిందని, కనీసం 30 టీఎంసీలతో సీమ ప్రాజెక్టులను నింపలేకపోయారని ఆక్షేపించారు. టీడీపీ సభ్యుల ఆరోపణలపై చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యారోపణలు చేస్తుండగా తమకు మంత్రి అనిల్‌కుమార్ సమాధానం చెప్పాలని టీడీపీ సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో సీఎం స్పందించారు. 'కాల్వలను వెడల్పు చేయాలని ఐదేళ్లుగా మేం ఎంత మొత్తుకున్నా చంద్రబాబు పెడచెవినిపెట్టారు. మా ప్రభుత్వం అన్ని కాల్వలను విస్తరిస్తుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 80 వేల క్యూసెక్కులకు పెంచుతాం. తెలుగుగంగ కెనాల్ 11,500 క్యూసెక్కుల నుంచి 18 వేల క్యూసెక్కుల వరకూ, ఎస్సార్‌బీసీ కెనాల్ సామర్థ్యం 21 వేల నుంచి 31 వేల క్యూసెక్కులకు, కేసీ కెనాల్ సామర్థ్యం 10 వేల క్యూసెక్కుల నుంచి 30 వేలకు పెంచబోతున్నాం. హంద్రీ-నీవా ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతాం. గండికోట నుంచి గాలేరు-నగరి ప్రధాన కాలువ సామర్థ్యం 4000 నుంచి 6000 క్యూసెక్కులకు పెంచుతాం. ఈ ప్రతిపాదనలన్నీ సిద్ధమవుతున్నాయి. వచ్చే నెలలో టెండర్లకు వెళ్తాయి. ఇవన్నీ చేస్తే వైఎస్ కలలు కన్న రాయలసీమగా ప్రాజెక్టులు నీళ్లతో కళకళలాడతాయి' అని తెలిపారు.

### బాబుకు మైకివ్వని స్పీకర్..

తన తండ్రి కలగన్న రాయలసీమను సాకారం చేస్తామని జగన్ అనడంతో టీడీపీ సభ్యులు ఎద్దేవాచేశారు. కృష్ణా నదిలో మిగులు జలాలు అక్కర్లేదంటూ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు వైఎస్ ముఖ్యమంత్రి హోదాలో రాసిన లేఖను ప్రస్తావించారు. ఆ లేఖ ఇస్తే తానే చదివి వినిపిస్తానని ఆర్థిక మంత్రి బుగ్గన అడగ్గా.. తామే చదువుతామని చంద్రబాబు మైకు అడిగారు. అందుకు స్పీకర్ తమ్మినేని సీతారాం అనుమతించలేదు. దాంతో వైఎస్ రాసిన లేఖను అధికార పక్షానికి ఇచ్చేందుకు టీడీపీ సమ్మతించలేదు.

### నింపలేక చేతులెత్తేశారు..

కృష్ణా నదికి వరదొస్తే సీఎం విదేశాలకు వెళ్లారని, ప్రాజెక్టులను నింపాల్సిన మంత్రి.. చంద్రబాబు ఇంటిని ముంచేందుకు ఎక్కువ శ్రద్ధ చూపారని అచ్చెన్న, రామానాయుడు విమర్శించారు. అనుభవరాహిత్యం, అవగాహన లోపంతో శ్రీశైలం నుంచి నీటిని సీమ చెరువులకు మళ్లించలేక పోయిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కుప్పం కన్నా పులివెందులకు ముందు నీరిచ్చారని, ప్రస్తుత ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని ప్రాజెక్టులను నింపలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. సీమలో అన్ని ప్రాజెక్టుల నిర్మాణం చంద్రబాబు హయాంలోనే పూర్తయిందని.. జగన్ ప్రభుత్వం ముంపు పరిహారం చెల్లిస్తే ఏ సమస్యా ఉండదన్నారు.



'కృష్ణా నదిలో మిగులు జలాలు అక్కర్లేదంటూ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు వైఎస్సే ముఖ్యమంత్రి హోదాలో రాశారు. సీమ ప్రాజెక్టుల నిర్మాణం చంద్రబాబు హయాంలోనే పూర్తయింది. జగన్ ప్రభుత్వం ముంపు పరిహారం చెల్లిస్తే సమస్యలే ఉండవు.' - టీడీపీ

## ఆంగ్ల మాధ్యమం భేష్: రాపాక

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ డిమాండ్ చేస్తుండగా.. ఆ పార్టీకి చెందిన ఆ పార్టీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాత్రం ఆయనతో విభేదించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న ఆంగ్ల మాధ్యమాన్ని స్వాగతించారు. చంద్రబాబు ప్రభుత్వం మధ్యలో వదిలేసిన ఆంగ్ల మాధ్యమాన్ని జగన్ ప్రభుత్వం కొనసాగించే ప్రయత్నం చేస్తోందని సభలో రాపాక చెప్పారు. పేద విద్యార్థుల కోసం జగన్ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని చెప్పారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారం మీడియా సృష్టేనని రాపాక అన్నారు. తాను పార్టీ మారేదాకా టీవీ చానళ్లు వదిలేలా లేవని చమత్కరించారు. పవన్ కల్యాణ్‌తో తనకెలాంటి భేదాభిప్రాయాలు లేవని స్పష్టం చేశారు.

## విభజన సమస్యలపై 24 సమీక్షలు: నిత్యానంద్

న్యూఢిల్లీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ పునర్విభజన చట్టానికి సంబంధించి ఏపీ, తెలంగాణ మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఇప్పటివరకూ 24సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు రాజ్యసభలో కేవీపీ అడిగిన ప్రశ్నకు హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ జవాబిచ్చారు. కాగా, తిరుపతి విమానాశ్రయంలో పాత పాసింజర్ టెర్మినల్‌ను ఆధునీకరించడానికి అనుమతించినట్లు కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరి వెల్లడించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో దేశీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు పేర్కొన్నారు. కాగా, ఎస్‌బీఎం-యూ గృహనిర్మాణ పథకం కింద ఏపీకి రూ.517.43కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరి వెల్లడించారు.

## 'పోలవరం' బకాయిలు చెల్లించండి: వైసీపీ



నిర్మలా సీతారామన్‌కు విజ్ఞాపన పత్రం ఇస్తున్న వైసీపీ ఎంపీలు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం ఖర్చుచేసిన నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు వైసీపీ పార్లమెంటు సభ్యులు విజ్ఞప్తి చేశారు. వైసీపీపీ నేత వి.విజయసాయిరెడ్డి నాయకత్వంలో ఆ పార్టీ ఎంపీలంతా మంత్రిని కలిసి విజ్ఞాపన పత్రం సమర్పించారు. రూ.55,548కోట్లతో పోలవరం ప్రాజెక్టుకు సవరించిన అంచనాలను ఆమోదించాలన్నారు. కాగా, 2014-15 ఏడాదికి సంబంధించిన రెవెన్యూ లోటు గ్రాంటు కింద ఏపీకి రావాల్సిన రూ.16,969 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు చెందిన ఏడు వెనుకబడిన జిల్లాలకు బకాయిపడిన రూ.1,050కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఏపీ ప్రభుత్వానికి జీఎస్టీ కింద చెల్లించాల్సిన రూ.1,605కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

## అమరావతిని ధ్వంసం చేస్తున్న జగన్: కేశినేని

న్యూఢిల్లీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కట్టడాలు, మౌలిక సదుపాయాలను సీఎం జగన్ ధ్వంసం చేస్తున్నారని టీడీపీ ఎంపీ కేశినేని నాని అన్నారు. ఆర్థిక కేంద్రంగా ఎదిగే సామర్థ్యం ఉన్న అమరావతిని రాజకీయ కక్షతో నాశనం చేస్తున్నారన్నారు. అన్ని అభివృద్ధి ప్రాజెక్టుల పనులు నిలిపివేశారని, నిర్మాణాలను కూల్చివేయాలని సీఎం ఆదేశించారని వివరించారు. లోక్‌సభలో ఇంటర్నేషనల్ ఫైనాన్స్ సర్వీసెస్ సెంటర్ బిల్లుపై చర్చలో ఆయన మాట్లాడారు. రాజధాని అమరావతిలో ఐఎఫ్ఎస్‌సీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. శాసనమండళ్లను రద్దుచేసే ప్రస్తావన రాజ్యాంగంలోని 169వ అధికరణంలో ఉంటుందని, అసెంబ్లీలో మూడింట రెండొంతులకు తగ్గకుండా సభ్యులు హాజరై మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదిస్తే పార్లమెంటులో చట్టం ద్వారా మండలి రద్దవుతుందని వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెప్పారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో సమర్థులే లేరా?

▸ సలహాదారులుగా మీ వాళ్లేనా?

▸ టీడీపీ ఎమ్మెల్యే అనగాని ఆగ్రహం

▸ 'నామినేటెడ్'పై అసెంబ్లీలో రగడ

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారుల నియామకాలపై అసెంబ్లీలో రగడ చోటుచేసుకుంది. ఆయా రంగాల్లో సమర్థులు, నిపుణులకే సలహాదారు పోస్టులిచ్చామని సీఎం జగన్, మంత్రి కన్నబాబు చెప్పిన సమాధానంపై టీడీపీ సభ్యులు కస్సుమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో సమర్థులు, నిపుణులేలేరా అని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ నిలదీశారు. బంధుప్రీతి, సామాజికవర్గ ప్రీతితో ఈ పోస్టులు నింపేశారని విమర్శించారు. 'ఆర్థిక సంక్షోభం ఉందంటూ రూపాయి జీతం అంటున్న సీఎం.. ఇంతమంది సలహాదారులను ఎందుకు నియమించుకున్నారు? వారిలో బీసీలు ఎంత మంది ఉన్నారు? 75 మందికి నామినేటెడ్ పదవులిస్తే.. అందులో ఒకే సామాజికవర్గానికి పెద్దపీట ఎలా వేస్తారు?' అని డిమాండ్ చేశారు. నైపుణ్యం, సామర్థ్యం ఉన్న వారిని సలహాదార్లుగా ఎంపిక చేసుకున్నామని.. ఇవి శాశ్వత పోస్టులు కావని మంత్రి కన్నబాబు చెప్పారు. టీడీపీ తన హయాంలో 264 మంది కన్సల్టెంట్లను నియమించిందని.. బంధుప్రీతితో తమకు కావలసిన వారిని, అనుయాయులనే పెట్టుకుందని ఆరోపించారు.

### తుదిజాబితా అసెంబ్లీలోకి: జగన్

ఇప్పటి వరకు భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లో చైర్మన్లుగా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు ఉన్నారని, అయినా ఇది టీడీపీ వాళ్లకు కనిపించడం లేదని సీఎం అన్నారు. ఇంకా 150కి పైగా చైర్మన్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత భర్తీ చేస్తామని తెలిపారు. ఆ తర్వాత తుదిజాబితాను అసెంబ్లీలో విడుదల చేస్తామని, ఈ జాబితాలో కచ్చితంగా 50% పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయిస్తామన్నారు.






## లోకేశ్‌కు తప్పిన ప్రమాదం

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయం వద్ద డ్రోన్ కెమెరా బుధవారం కలకలం సృష్టించింది. టీడీపీ ఎమ్మెల్సీ లోకేశ్, పలువురు ఎమ్మెల్సీలకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వారు మంగళగిరి నుంచి ఆర్టీసీ బస్సులో సచివాలయం వద్దకు చేరుకున్నారు. ఫైర్ స్టేషన్ వైపు కాలినడకన వెళ్తుండగా లోకేశ్ షూలేస్ ఊడింది. లేస్ కట్టుకుని పైకిలేచి చూడగా.. పోలీసులు ఆపరేటింగ్ చేస్తున్న డ్రోన్ కెమెరా గాల్లో వారి పక్కనే ఎగురుతూ లోకేశ్‌కు కనిపించింది. ఆయన దానికి టాటా చెబుతూ.. 'పోలీస్ డ్రోన్ కదండీ.. నమస్కారం పెడుతున్నా... మనకన్నా చాలా ఫాస్ట్‌గా వచ్చేసిందే' అని సరదాగా వ్యాఖ్యానిస్తూ ముందుకు సాగారు. తర్వాత కొన్ని క్షణాల్లోనే



ఆపరేటింగ్ లోపంతో డ్రోన్ విద్యుత్ తీగలకు తగిలి వారికి అత్యంత సమీపంలో కిందపడింది. అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అప్రమత్తమైన అధికారులు ఆ డ్రోన్‌ను తొలగించారు.

# ఈ ప్రభుత్వానికి కొవ్వెక్కింది

## ఇష్టానుసారం చేస్తున్నారు

**స్వర్గం కాదు.. నరకం చూపుతున్నారు**

**ఆర్టీసీ చార్జీలు పెంచి భారం మోపుతారా?**

**టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఫైర్**

**సచివాలయం వద్ద టీడీపీ ఆందోళన**

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చార్జీల పెంపుపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి కొవ్వెక్కిందని.. మెజారిటీ ఉంది కనుక ఎవరేం చేయలేరనే ధీమా వచ్చిందని.. అందుకే ఇష్టానుసారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆర్టీసీ చార్జీల పెంపును నిరసిస్తూ ఆయన ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారమిక్కడ సచివాలయం ఫైర్ స్టేషన్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. అనంతరం అసెంబ్లీ ప్రధాన ద్వారం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అంతకుముందు చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. 'జగన్ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ప్రజలకు బాధలే బాధలు. అసెంబ్లీ జరుగుతున్న సమయంలో అసెంబ్లీని గానీ, కౌన్సిల్‌ను గానీ విశ్వాసంలోకి తీసుకోకుండా ఆర్టీసీ చార్జీలను ఇష్టానుసారం పెంచడం దుర్మార్గం. సాధారణ బస్సులకు కిలోమీటరుకు రూ.10, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులకు రూ.20 పెంచారు. ఎన్నికల ముందు మేం ఏదీ పెంచం.. స్వర్గం చూపిస్తామన్నారు. ఇప్పుడు ప్రజలకు నరకం చూపిస్తున్నారు. చార్జీల పెంపు నిర్ణయాన్ని బేషరతుగా వెనక్కి తీసుకోవాలి. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాం. అసెంబ్లీలో నిలదీస్తాం' అని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మాట్లాడారు. చార్జీల పెంపు వల్ల సామాన్యుడిపై రూ.800 కోట్లు పెనుభారం పడుతుందని ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు చెప్పారు. టీడీపీ హయాంలో ఐదేళ్లు ఆర్టీసీ చార్జీలు పెంచలేదన్నారు. అసెంబ్లీలో, బయట నాలుగురైదుగురు మంత్రులకు ట్రైనింగ్ ఇచ్చి వదిలారని.. వారు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణరాజు ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీలు చిక్కాల రామచంద్రరావు, శ్రీనివాసులు, టీడీఎల్పీ ఉపనేత రామానాయుడు, ఎమ్మెల్యేలు చినరాజప్ప, బాల వీరాంజేయస్వామి కూడా మాట్లాడారు.

### చర్చకు సిద్ధమే కానీ..

ఆర్టీసీ సమస్యలపై చర్చకు తాము సిద్ధమేనని, కానీ ముందుగా చార్జీలు తగ్గిస్తేనే చర్చకు అంగీకరిస్తామని శాసన మండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు చెప్పారు. 'ముందే నిర్ణయం తీసుకుని తర్వాత చర్చించాలని చెప్పడం ఏమిటి? ఉపసంహరించాలన్న డిమాండ్‌తోనే మండలిని స్తంభింపజేస్తున్నాం' అని తన చాంబర్లో విలేకరులకు తెలిపారు. చార్జీల పెంపుతో భారం రూ.700 కోట్లేనని ప్రభుత్వం చెబుతోందని, తమకు తెలిసిన సమాచారం ప్రకారం ఈ భారం రూ.1,300 కోట్ల వరకూ ఉందని చెప్పారు.

### చార్జీలు తగ్గించేవరకు ఆందోళనలు

వైసీపీ ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ చార్జీలు తగ్గించే వరకు ఆందోళన సాగిస్తామని టీడీపీ ఎమ్మెల్సీలు స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుద్దా వెంకన్న, డొక్కా మాణిక్యవరప్రసాద్, అశోక్‌బాబు, అంగర రామ్మోహన్, రామకృష్ణ, శ్రీనివాసులు, దీపక్‌రెడ్డి, దొరబాబు, నాగజగదీశ్వరరావు, జగదీశ్ తదితరులు మాట్లాడారు. మాట తప్పం.. మడమ తిప్పం అన్న జగన్ ఆరు నెలలకే ఆర్టీసీ చార్జీలు పెంచి, పేదల వ్యతిరేకిగా నిరూపించుకున్నారని మండిపడ్డారు.



### ప్రభుత్వమే భరించాలి: మాధవ్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన కొద్ది రోజుల్లోనే బస్సు చార్జీలు పెంచడం విడ్డూరంగా ఉందని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ మీడియా పాయింట్లో అన్నారు. నష్టాలను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పి, ఇప్పుడు ప్రయాణికులపై భారం మోపడం సరికాదని.. నష్టాలను ప్రభుత్వం భరించాలని సూచించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ప్రభుత్వం అధ్యయనం చేయాలని, శాసన సభ, మండలిలో చర్చించాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు కోరారు.



# ఖవ్వాలీ X మర్యాద

## సభలో స్పీకర్, బాబు మధ్య వాగ్వాదం

**పీహెచ్‌డీపై చెవిరెడ్డి వ్యాఖ్యలు.. స్పందించేందుకు మైక్ అడిగిన బాబు**

**ఇదేం ఖవ్వాలీ డ్యాన్స్ కాదన్న స్పీకర్.. ఇలా మాట్లాడితే మర్యాదగా ఉండదన్న బాబు**

**తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన తమ్మినేని.. చర్యలకు అధికారపక్షం డిమాండ్**

**మన్నిస్తున్నానంటూ ముగించిన స్పీకర్**

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అధికార పక్షం విమర్శలు... దానికి సమాధానం చెప్పేందుకు అవకాశమివ్వాలంటూ విపక్ష నేత చంద్రబాబు పట్టు! చివరికి ఈ విషయం స్పీకర్ వర్సెస్ చంద్రబాబుగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్న సందర్భంగా ఈ గందరగోళం తలెత్తింది. వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ... "చంద్రబాబు 50 ఏళ్ల నుంచి పీహెచ్‌డీ చేస్తూనే ఉన్నారు. అది ఎప్పటికి పూర్తవుతుందో" అని ఎద్దేవా చేశారు. దీనిపై మాట్లాడేందుకు అవకాశమివ్వాలని చంద్రబాబు పట్టుబట్టారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాం... "ఇదేమైనా ఖవ్వాలీ డ్యాన్సా? ఒకరి తర్వాత మరొకరికి అవకాశం ఇవ్వడానికి!" అని అన్నారు. దీనిపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. స్పీకర్ స్థానంలో ఉండి ఇలా మాట్లాడితే మర్యాదగా ఉండదన్నారు. దీనిపై స్పీకర్ ఆగ్రహంతో ఊగిపోయారు. స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వడం లేదని మండిపడ్డారు. తనపట్ల అనుచితంగా మాట్లాడారని, చైర్‌ను అవమానించారని ఆగ్రహించారు. ఇష్టానుసారం స్పీకర్‌పై ఆరోపణలు చేస్తే మంచిది కాదన్నారు. "చాలామందిని చూశాం! కూర్చోండి సార్ కూర్చోండి! ఎందుకయ్యా నీకు ఎక్స్‌పీరియన్స్? మీరు అసలు ప్రతిపక్షనేతేనా?" అంటూ చంద్రబాబుపై ధ్వజమెత్తారు. తనపై చేసిన వ్యాఖ్యలను చంద్రబాబు తక్షణమే వెనక్కి తీసుకోవాలని స్పీకర్ డిమాండ్ చేశారు. అదే సమయంలో వైసీపీ సభ్యులు లేచారు. చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయాలని కోరారు. బడుగు బలహీన వర్గాలంటే ఆయనకు చులకని అని ఆరోపించారు. తమ్మినేని స్పీకర్ అయ్యాక, ఆయనను అధ్యక్షస్థానంలో కూర్చోబెట్టడానికి కూడా రాలేదని తెలిపారు. తమ జిల్లాకు చెందిన తమ్మినేని సీతారాంను అవమానిస్తే ఊరుకునేది లేదని పలాస ఎమ్మెల్యే సీదిరి అప్పలరాజు హెచ్చరించారు. తాను డాక్టర్‌నని చంద్రబాబు ఒకరకమైన మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని, మెడికల్ ఎమర్జెన్సీ ఉందని చెప్పారు. నోరుతెరిస్తే 40 ఏళ్ల అనుభవం అనే చంద్రబాబును చూసి తాము నేర్చుకోవాల్సినవి ఏమీ లేవని మంత్రి అనిల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను చంద్రబాబు ఉపసంహరించుకుంటే గౌరవంగా ఉంటుందని మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అయితే... 'పెద్ద మనసుతో మన్నిస్తున్నాను' అంటూ స్పీకర్ ఈ అంశానికి ముగింపు పలికారు. ఈ అంశంపై మాట్లాడేందుకు టీడీపీ సభ్యులకు అవకాశం లభించలేదు.

# అద్భుతం.. అపూర్వం!

## సచివాలయ వ్యవస్థ మహత్తర ఘట్టం

**ఒక్కసారిగా 1.28 లక్షల మంది నియామకం**

**పారదర్శకంగా పరీక్షల నిర్వహణ**

**అర్హులకు లబ్ధి చేయడమే లక్ష్యం**

**సోషల్ ఆడిట్‌తో అనర్హుల తొలగింపు**

**సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రకటన**

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోపే నాలుగు లక్షల ఉద్యోగాలు ఇవ్వడం కల్పించడం దేశ చరిత్రలో ఎక్కడా లేదని ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. అలాంటి మహత్తర ఘట్టం ఆంధ్రప్రదేశ్‌లోనే జరిగిందన్నారు. బుధవారం అసెంబ్లీలో గ్రామ సచివాలయ వ్యవస్థపై ఆయన మాట్లాడారు. "11 వేలకు పైగా గ్రామ సచివాలయాలు, మూడు వేలకు పైగా వార్డు సచివాలయాలు... మొత్తం 15 వేల గ్రామ, వార్డు సెక్రటేరియట్లలో 1,28,858 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరారు. దాదాపు 20 లక్షల మంది 8 రోజులపాటు గ్రామ సచివాలయ పరీక్షలకు హాజరయ్యారు. ఎంతో పారదర్శకంగా, అభ్యర్థులకు ఏ మాత్రం అసౌకర్యం కలగకుండా, ఎలాంటి అవాంతరాలు లేకుండా అధికారులు ఈ పరీక్షను నిర్వహించారు" అని తెలిపారు. సచివాలయ ఉద్యోగాలు పొందిన వారిలో 82.5 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉన్నారన్నారు. ఇందులో ఒక్క బీసీలే 51.9 శాతం మంది ఉన్నారన్నారు. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా 2.65 లక్షల పైచిలుకు గ్రామ వలంటీర్లను నియమించామని... ప్రతి 50 ఇళ్లకు గ్రామ వలంటీర్ నియామకాన్ని చేపట్టామని తెలిపారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయం ఉంటుందని... గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయం రెండూ కలిపి వారికి సంబంధించిన అన్ని అంశాలను చూడటమే కాకుండా ప్రతి ప్రభుత్వ సేవను డోర్ డెలివరీ చేస్తారని చెప్పారు. "500 రకాల సేవలందిస్తాం. గ్రామ సచివాలయాల్లో ఈ వివరాలు ప్రదర్శిస్తాం. ప్రతి రోజు గ్రామ సచివాలయంలో స్పందన జరుగుతుంది. ప్రతి అర్హుడికి లబ్ధి జరిగేలా చూస్తాం. లబ్ధిదారుల జాబితాను గ్రామ సచివాలయం బయట అతికించే విధానం తీసుకొస్తున్నాం" అని చెప్పారు. అనర్హులకు లబ్ధి జరిగితే తెలిసిపోతుందని... వారిని గ్రామ సభలు, సోషల్ ఆడిట్ ద్వారా తొలగిస్తామని తెలిపారు. కీలకమైన ఈ చర్చలో విపక్షనేత చంద్రబాబు పాల్గొని ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. "జన్మభూమి కమిటీలు ఎలా విఫలమయ్యాయో... గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ఎలా పని చేస్తున్నాయో తెలుసుకుని... నాలెడ్జి పెంచుకునేవారు. బహుశా టీవీలో చూస్తూ కూడా ఆయన నాలెడ్జి పెంచుకుంటారేమో" అని జగన్ వ్యాఖ్యానించారు.

### సభలో ఆంధ్రజ్యోతి ప్రస్తావన...

అంతకు ముందు పంచాయతీరాజ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చర్చ ప్రారంభించారు. గ్రామ సచివాలయ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వార్తా కథనాలు ప్రచురించిన ఆంధ్రజ్యోతి... ఫలితాల తర్వాత భిన్నమైన కథనాలు రాసిందన్నారు. ఏపీపీఎస్సీ చైర్మన్ వద్ద పనిచేస్తున్న అనితమ్మను ఇంటర్వ్యూ చేశారని, ఆ మరుసటి రోజు పేపర్ లీక్ అయినట్లు పేపర్లో వచ్చిందని తెలిపారు. లీక్ అయి ఉంటే పరీక్షల సమయంలో అయి ఉండాలి గానీ, ఫలితాల సమయంలో అవుతుందా అని ప్రశ్నించారు. ఆ మరుసటి రోజు తిరుపతిలో ఉన్న ఏపీపీఎస్సీ చైర్మన్‌ను సంప్రదించగా... ఆయన స్పందన కూడా అనుమానాస్పదంగా ఉందని తెలిపారు. చంద్రబాబు హయాంలో నియమితులైన చైర్మన్ ఆయన చెప్పినట్లు నడుచుకుంటున్నారని ఆరోపించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం కలగజేసుకుని పరీక్షలు రాసి... ఉద్యోగాలు రాని అభ్యర్థులు సైతం పరీక్షల నిర్వహణను ప్రశంసించారని, మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కాయని నిజాయితీగా అంగీకరించారని అన్నారు. కాగా.. స్పీకర్‌ను అగౌరవంగా మాట్లాడిన చంద్రబాబు.. సీఎంను కూడా లేవయ్యా అంటూ చిన్నచూపుగా మాట్లాడడం సరికాదని వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయనకు అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు.



## 10కి 15 వసూలా?

**▸▸ మంగళగిరి నుంచి వెలగపూడి వరకూ.. పల్లెవెలుగు బస్సులో లోకేశ్ ప్రయాణం**

**▸▸ ప్రజలపై అనూహ్య భారం పడిందని ఆందోళన**

మంగళగిరి, డిసెంబరు 11: ఆర్టీసీ చార్జీల పెంపును నిరసిస్తూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ బుధవారం తన తోటి ఎమ్మెల్సీలతో కలిసి వెలగపూడిలోని శాసనమండలికి పల్లెవెలుగు బస్సులో ప్రయాణించారు. మంగళగిరి బస్టాండు వద్ద తమ పార్టీ ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, దీపక్‌రెడ్డి ప్రభృతులతో కలిసి కొద్దిసేపు ఆందోళన చేసిన అనంతరం ఆయన పల్లెవెలుగు బస్సులో సచివాలయానికి బయలుదేరారు. బస్సులో మహిళా కండక్టర్ నుంచి లోకేశ్ స్వయంగా నగదు చెల్లించి టికెట్ తీసుకున్నారు. తర్వాత ఆర్టీసీ చార్జీల పెంపుపై తోటి ప్రయాణికులను విచారించగా.. మంగళగిరి నుంచి సచివాలయానికి పల్లెవెలుగు బస్సు చార్జీ నిన్నటివరకు రూ.10 ఉండగా బుధవారం నుంచి రూ.15 వసూలు చేస్తున్నారని తెలిపారు. 'దీనిపై ఆర్టీసి అధికారులను వివరణ కోరగా పల్లెవెలుగు బస్సులకు సంబంధించి తొలి రెండు స్టేజీలకు చార్జీల పెంపు లేనేలేదని.. మూడో స్టేజీ నుంచి రూ.10 టికెట్‌ను రూ.15గా నిర్ణయించామని చెప్పారు. అంటే ఇక్కడ ప్రభుత్వ ప్రకటన ప్రకారం చార్జీల పెంపు కిలోమీటర్ల ప్రాతిపదికన కాకుండా స్టేజీల ప్రాతిపదికన గందరగోళంగా పెంచేశారు. ఇష్టానుసారంగా పెంచిన చార్జీలను తగ్గించేవరకు టీడీపీ పోరాటం కొనసాగుతుంది. ఈ పెంపు వల్ల ప్రజలపై రోజుకు రూ.2-3 కోట్ల వరకు భారం పడుతుందని తొలుత అంచనా వేశాం. కానీ ప్రత్యక్షంగా చూస్తే ఇంకా ఎక్కువగానే ప్రజలపై భారం పడింది' అని లోకేశ్ తెలిపారు.

### జగన్ చెత్తపాలనకు సిరా చుక్కే నిదర్శనం!

'కిలో ఉల్లి ఇవ్వడానికి సిరా చుక్క వేస్తున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో మిగిలిపోతారు. ఈ సిరా చుక్కే జగన్ అసమర్థ, చెత్త పాలనకు నిదర్శనం' అని లోకేశ్ ట్వీట్ చేశారు.

## చార్జీలపై చర్చకు టీడీపీ పట్టు

**వాయిదా తీర్మానాలను తిరస్కరించిన స్పీకర్**

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చార్జీల పెంపుపై సభలో చర్చించాలని టీడీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తమ్మినేని సీతారాం తిరస్కరించడంతో బుధవారం అసెంబ్లీలో టీడీపీ సభ్యులు నిరసన చేపట్టారు. అగ్రిగోల్డ్‌పై చర్చను ప్రారంభించాలని హోం మంత్రి మేకతోటి సుచరితను స్పీకర్ ఆదేశించడంతో టీడీపీ సభ్యులు పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. అత్యంత ముఖ్యమైన ఆర్టీసీ చార్జీల పెంపుదలపై చర్చకు అవకాశమివ్వాలని పలుసార్లు అభ్యర్థించినా ఆయన అంగీకరించలేదు. ఆర్టీసీకి సంబంధించి ఈ సభలోనే ప్రభుత్వం చట్టం తెస్తున్నందున చార్జీలపైనా చర్చించేందుకు సానుకూలంగా ఉందని స్పీకర్ తెలిపారు. టీడీపీ సభ్యులు పోడియంకు వెళ్లి నినాదాల హోరు కొనసాగించారు. గందరగోళం నడుమే హోం మంత్రి మాట్లాడారు.

# జగన్ గన్నేరు పప్పు

**▸▸ మీ తెగులు కాస్త చూసుకోండి**

**▸▸ తెలుగే కాదు,ఇంగ్లీషు, లెక్కలూ వీకేనా?**

**▸▸ సభలో సభ్యుణ్ణికాని నా మీద విమర్శలా?**

**▸▸ స్పీకర్ ఆపకపోవడం సరైనదేనా: లోకేశ్**

మంగళగిరి, డిసెంబరు 11: "ఉన్నత చదువుల కోసమని నేను అమెరికాలో ఎనిమిదేళ్లు ఉన్నాను. దానివల్ల తెలుగులో ఓ పదం అటుఇటుగా పలికుండొచ్చు. దానికే నన్ను పప్పు...పప్పు అంటూ ఎగతాళి చేస్తున్నారు. మరి ముఖ్యమంత్రి జగన్ తెలుగు చూడండి. ఆయన మాట్లాడే తెలుగులో తప్పులు...ఇంగ్లీషులో తప్పులు...లెక్కల్లో కూడా ఎంత వీకో చూశారుకదా! ఇప్పుడు ఆయనను ఏమనాలి? గన్నేరు పప్పు అనొచ్చు కదా" అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ధ్వజమెత్తారు. అయినా, తన పదాల ఉచ్ఛారణలోని పొరపాటు వల్ల రాష్ట్రానికి ఏం అన్యాయం జరిగిందని, పెట్టుబడులు వెనక్కు పోయాయా అని, పోలవరం ఆగిందా...అమరావతి పనులు ఆగిపోయాయా అని ప్రశ్నించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల జగన్ సరిగ్గా ఉచ్ఛరించలేని తెలుగుపదాల తాలూకూ క్లిప్పింగ్‌లను ఈ సందర్భంగా మీడియా కోసం ఆయన ప్రదర్శించారు. "శాసనసభ సభ్యుణ్ణి కాని నా గురించి మంగళవారం మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు పదేపదే ప్రస్తావించి, విమర్శించారు. అయినా స్పీకర్ మిన్నకుండిపోయారు. అందుకే ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నవాడిగా మీడియా ముందుకువచ్చాను" అని వివరించారు. 11 కేసుల్లో ముద్దాయిగా ఉండి, ఇప్పుడు వారానికి ఒక రోజు కోర్టుకు వెళ్లాల్సిన జగన్... రేపోమాపో బెయిల్ రద్దయితే మళ్లీ జైలుకెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాంటి వ్యక్తి చెప్పే నీతులు వినడానికి ఎవరూ సిద్ధంగా లేరన్నారు. క్రమశిక్షణగా పెరిగానని, వీళ్లలా తానేమీ వీధి రౌడీలా పెరుగలేదన్నారు. 'నన్ను విమర్శించే మంత్రులకు ధైర్యముంటే శాసనమండలికి వచ్చి చర్చించాలని సవాల్ చేస్తున్నా. మా నాయకుడి గురించి...మీ నాయకుడి గురించి...మీనాయకుడిపై వున్న కేసులను చర్చించుకుందాం" అని తీవ్రస్వరం వినిపించారు. అమరావతిలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేశామని ఆరోపిస్తున్నారని, వచ్చిన ఈ ఆర్నెల్లలో ఏం చేశారని ప్రశ్నించారు.

### పత్రికను జగన్ రూ.2కే అమ్మొచ్చుగా..

"హెరిటేజ్ ఫ్రెష్‌ను అమ్మేశామని చంద్రబాబు అసెంబ్లీలో చెప్పారు. అయినా అందులో మాకు షేర్లున్నాయని మంత్రి బుగ్గన ఆరోపించారు. బుగ్గనకు పలు కంపెనీల్లో వేల షేర్లు ఉన్నాయి. ఆ కంపెనీల యాజమాన్యం ధరలు పెంచితే వాటికి ఆయన బాధ్యత వహిస్తారా? జగన్ పత్రిక ప్రారంభంలో పత్రికను రూ.రెండుకు అమ్మాలని ఆయన పెద్ద ఉద్యమం చేశారు కదా! పత్రిక వారిదే.. షేర్లు వారివే...యాజమాన్యం వారిదే... మరి ఆ పత్రికను ఏడు రూపాయలకు పెంచి అమ్ముతున్నారేం?" అని లోకేశ్ ప్రశ్నించారు. పాదయాత్రలో అది పెంచుతా, ఇది పెంచుతా అని అంటుంటే.. పింఛను, రేషన్ పెంచుతాడేమోనని పేదలు ఆశ పట్టారనీ, కానీ, ఆయన వచ్చి ఇసుక, ఉల్లి, మద్యం, జగన్ పత్రిక, ఆర్టీసి ఛార్జీలు ఇలా అన్ని ధరలూ పెంచేశారన్నారు. రేపోమాపో విద్యుత్ చార్జీలూ పెంచుతారన్నారు. గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖ మంత్రిగా చేసిన కృషికి 53 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు రాష్ట్రానికి లభించాయని, అలాంటి నన్ను ఇంత అవమానకరంగా మాట్లాడతారా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా మంగళగిరి నుంచి సచివాలయానికి బస్సులో ప్రయాణిస్తున్న లోకేశ్

**మంగళగిరిలో పోటీపై..**

"సొంత కొడుకును గెలిపించుకోలేకపోయారని చంద్రబాబును ఉద్దేశించి పదేపదే అంటున్నారు. వారికి ఒక్కటే చెబుతున్నా. నేనేమీ చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకునే బ్యాచ్ కాదు. నాన్న గెలిచిన చోటే గెలిచి కాలరెగరేసే రకం కానేకాను. పార్టీ ఎక్కడ గెలవలేదో అక్కడ నుంచొని గెలవాలనే లక్ష్యంతో పని చేశాను. సరే...ఓడిపోయాను. అలాగని నియోజకవర్గానికి దూరంగా వెళ్లలేదే! ప్రజల్లోనే తిరుగుతున్నా.ఇది తప్పా" అని లోకేశ్ నిలదీశారు.

## చార్జీలు పెంచబోమని మేనిఫెస్టోలో పెట్టలేదు

**▸▸ విలీనం చేస్తామన్నాం.. చేశాం: బొత్స**



అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చార్జీలు పెంచబోమని తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఎక్కడా పెట్టలేదని పురపాలక మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. బుధవారంఅసెంబ్లీ లాబీల్లో ఆయన మాట్లాడారు. 'మా మేనిఫెస్టో మాకు బైబిల్.. భగవద్గీత. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని అందులో పెట్టాం. చేశాం. చార్జీలు పెంచబోమని అందులో పెట్టలేదు' అన్నారు. పెంచిన ఆర్టీసీ చార్జీలు తగ్గించాలని కోరుతూ టీడీపీ శాసనమండలిని స్తంభింపజేయడం సరికాదన్నారు. 'ఆర్టీసీ అనేక సమస్యల్లో ఉంది. అందువల్ల చార్జీలు పెంచాలనుకున్నాం. దానిపై వారిని చర్చించమనండి. చర్చే జరగకుండా ముందే చార్జీలు తగ్గించాలని డిమాండ్ పెట్టడం సరికాదు. అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు ఆర్టీసీ చార్జీలు తగ్గించాలని అడగరు. మండలిలో మాత్రం అడ్డుపడతారు. మండలిలో ఉన్న రిమోట్ అసెంబ్లీలోనూ టీడీపీని నడిపిస్తోంది. ఆరిమోట్ పేరు లోకేశ్. అదే సమస్య' అన్నారు.

### మండలిలో 'చార్జీల' సెగలు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చార్జీల పెంపుపై బుధవారం శాసనమండలి అట్టుడికింది. కొత్త చార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలంటూ టీడీపీ సభ్యులు సభను దాదాపు స్తంభింపజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ నినాదాలతో హోరెత్తించారు. మూడు సార్లు తాత్కాలిక వాయిదా వేసినా, పరిస్థితి మారకపోవడంతో చివరకు సభ గురువారానికి వాయిదా పడింది. పెంచిన ఆర్టీసీ చార్జీలు మంగళవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన టీడీపీ.. అదే వేడిని బుధవారం మండలిలో ప్రదర్శించింది. ఈ అంశంపై వెంటనే చర్చకు అనుమతించాలంటూ ఆ పార్టీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ షరీఫ్ తిరస్కరించారు. దీంతో టీడీపీ సభ్యులు పోడియం దగ్గరకు వెళ్లి నిరసన తెలపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.35 వరకూ నిరసన పర్వం కొనసాగింది. రోజూ ఏదో కారణంతో సభను అడ్డుకొంటున్నారంటూ టీడీపీ సభ్యుల తీరును వైసీపీ సభ్యుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తప్పుబట్టారు. దీనిపై టీడీపీ సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పందించారు. ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ చార్జీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని, ఆ తరువాతే మిగతా అంశాలపై స్పందిస్తామని తేల్చి చెప్పారు.

## చార్జీల పెంపు ఆర్టీసీ కోసమే ఆ సొమ్ము ఇంటికి తీసుకెళ్లను

**▸▸ బాబు బాటలోనే 'రౌండాఫ్'.. మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలు**

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని బతికించడం కోసమే తమ ప్రభుత్వం చార్జీలను పెంచిందని, అయినా.. చార్జీలను పెంచబోమని ఎన్నికలకు ముందు ఎక్కడా చెప్పలేదని రవాణాశాఖ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు. అప్పుల్లో కూరుకుపోయిన ఆర్టీసీని బయట పడేయాలనే చార్జీలను పెంచామన్నారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లో ముచ్చటించారు. రౌండాఫ్ చార్జీల విషయంలో తండ్రి, తనయుల బాటలోనే తామూ నడుస్తున్నామని చంద్రబాబు, లోకేశ్‌లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 10, 20 పైసలు పెంచుతామంటూ రౌండాఫ్ పేరుతో రూ.5 వరకు పెంచడాన్ని ఎలా సమర్థించుకుంటారని విలేకరులు ప్రశ్నించారు. దీనిపై స్పందిస్తూ.. 'తండ్రి, తనయుల బాటలోనే మేమూ నడుస్తున్నాం.. ఇది మా నిర్ణయం కాదు. వాళ్లు(టీడీపీ) ప్రవేశ పెట్టిందే. అయినా, పెంచిన చార్జీల సొమ్ము ఆర్టీసీకే తప్ప మా ఇంటికేం కాదు కదా?" అని ఎదురు ప్రశ్నించారు.

# సామాన్యుల నడ్డి విరుస్తారా!

**ప్రభుత్వంపై విపక్షాల ఫైర్.. ఆర్టీసీ చార్జీల పెంపు, ఉల్లి ధరలపై నిరసనలు**

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

ఆర్టీసీ బస్సు చార్జీల పెంపు, ఆకాశాన్నంటుతున్న ఉల్లిపాయల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'సామాన్యుల నడ్డి విరుస్తారా?' అంటూ నిలదీశాయి. ఉల్లి ధరలు, ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం సీపీఐ, సీపీఎం, టీడీపీ వేర్వేరుగా ఆందోళనకు దిగాయి. శ్రీకాకుళంలో సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, ఎస్.నర్సింహులు, న్యూడెమొక్రసీ నాయకులు టి.ప్రకాశ్ మాట్లాడుతూ, ఆర్టీసీ చార్జీల పెంపుతో సామాన్యులపై ప్రభుత్వం పెనుభారం మోపిందని విమర్శించారు. పెరిగిన ధరలతో సామాన్యులు బతకలేక పోతున్నారని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని పశ్చిమగోదావరి జిల్లాలో చేపట్టిన నిరసనలో వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఏలూరులో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. విశాఖలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఎలమంచిలిలో ర్యాలీ నిర్వహించారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం, ఎస్‌యూసీఐ, సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రకాశం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. టీడీపీ కార్యకర్తలు ఒంగోలు ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు.




ఏలూరులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

వరల్డ్ టూర్ ఫైనల్స్
ఉ.8.30 నుంచి
స్టార్‌స్పోర్ట్స్ 1, 3లలో

పాకిస్థాన్ x శ్రీలంక
తొలి టెస్ట్ - రెండో రోజు
ఉ.10.15 నుంచి
సోనీ సిక్స్‌లో

తొలుత రోహిత్ శర్మ, అతడికి తోడుగా కేఎల్ రాహుల్, చివర్లో కెప్టెన్ కోహ్లీ.. వెస్టిండీస్ బౌలర్ల భరతం పట్టారు. ఆకాశమే హద్దుగా చెలరేగారు. అలవోకగా సిక్సర్లు, బౌండరీలు బాదేసి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. భారత్ స్కోరును 250కి చేరువ చేశారు. సొంత గ్రౌండ్‌లో వేలాదిమంది ప్రేక్షకులు.. రోహిత్ రోహిత్ అని నినదిస్తుండగా టీమిండియా వైస్ కెప్టెన్ రెచ్చిపోయాడు. తొలి రెండు టీ20ల్లో విఫలమైన తన బ్యాట్‌కు పనిచెప్పక పోతే సిరీస్ చేజారే ప్రమాదం ఏర్పడిన వేళ రోహిత్ విశ్వరూపం ప్రదర్శించాడు. భారీ సిక్సర్లు, చూడముచ్చటైన ఫోర్లతో 71 రన్స్ చేశాడు. రోహిత్ స్ఫూర్తితో రాహుల్ విజృంభించగా.. కళాత్మక షాట్లతో విరాట్ సిక్సర్ల సునామీ సృష్టించిన వేళ.. వాంఖడేలో పరుగులు వెల్లువెత్తాయి. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌ను భారత బౌలర్లు స్వల్పస్కోరుకే పరిమితం చేసి 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకున్నారు.



ఎడాపెడా

# దంచేశారు



చెలరేగిన రోహిత్, రాహుల్, కోహ్లీ

## విండీస్‌పై భారత్ ఘన విజయం

## 2-1తో టీ20 సిరీస్ కైవసం

**ముంబై:** సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో టీమిండియా అమోఘ ప్రదర్శన చేసింది. చెత్త ఫీల్డింగ్, అంతంతమాత్రం బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో విమర్శలు ఎదుర్కొంటున్న తరుణాన పట్టుదలగా ఆడింది. అటు బ్యాట్స్‌మెన్, ఇటు బౌలర్లు సమష్టిగా రాణించడంతో ఆఖరి టీ20లో వెస్టిండీస్‌ను 67 రన్స్ తేడాతో చిత్తుగా ఓడించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో గెలుచుకుంది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 240 రన్స్ చేసింది. రోహిత్ శర్మ (34 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 71), కేఎల్ రాహుల్ (56 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 91), కోహ్లీ (29 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సర్లతో 70 నాటౌట్) సూపర్ హాఫ్ సెంచరీలు చేశారు. భారీ ఛేదనలో వెస్టిండీస్ ఓవర్లన్నీ ఆడి 8 వికెట్లకు 173 పరుగులే చేసింది. పొలార్డ్ (39 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 68), హెట్‌మయెర్ (24 బంతుల్లో ఫోర్, 5 సిక్సర్లతో 41) మాత్రమే రాణించారు. దీపక్ చాహర్, భువనేశ్వర్, షమి, కుల్దీప్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. రాహుల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, కోహ్లీ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు.

### రెండో ఓవర్లోనే షాక్

భారీ లక్ష్య ఛేదనలో విండీస్‌కు రెండో ఓవర్లోనే కింగ్ (5)ను అవుట్ చేయడం ద్వారా భువనేశ్వర్ షాకిచ్చాడు. షమి తన మొదటి ఓవర్లోనే సిమన్స్ (7)ను అవుట్ చేయగా..నాలుగో ఓవర్లో పూరన్ (0)ను చాహర్ పెవిలియన్‌కు పంపడంతో విండీస్ 17/3తో కష్టాల్లో పడింది. కానీ పొలార్డ్-హెట్‌మయెర్ భారీషాట్లతో భారత్‌లో కలవరం కలిగించారు. 4వ వికెట్‌కు 74 రన్స్ జోడించి ప్రమాదకరంగా మారుతుండగా..హెట్‌మయెర్‌ను రాహుల్ ద్వారా క్యాచవుట్ చేసిన కుల్దీప్ ఈ జోడీని విడదీశాడు. వెంటనే హోల్డర్ (8)ను కూడా కుల్దీప్ అవుట్ చేశాడు. భారీషాట్లతో చెలరేగుతున్న పొలార్డ్ ఇన్నింగ్స్‌కు భువీ ముగింపు పలికాడు. అనంతరం వాల్ష్ (11), పియర్ (6) త్వరగా నిష్క్రమించగా.. విలియమ్స్ (13), కాట్రెల్ (4) నాటౌట్‌గా నిలిచారు.



రాహుల్ (91)

### రోహిత్, రాహుల్ దూకుడు..

అంతకుముందు భారత ఇన్నింగ్స్‌లో కాట్రెల్ వేసిన తొలి ఓవర్ రెండో బంతిని రోహిత్ బౌండరీకి తరలించగా.. రెండో ఓవర్లో రాహుల్ 2 బౌండరీలు కొట్టాడు. అయితే కాట్రెల్ వేసిన రెండో ఓవర్ మొదటి బంతిని డీప్ మిడ్ వికెట్ దిశగా సిక్సర్‌గా దంచిన రోహిత్.. రెండో బంతిని మిడ్‌వికెట్‌లో బౌండరీగా మలిచాడు. చివరి బంతికి మరో ఫోర్ కొట్టడంతో మూడో ఓవర్లో భారత్‌కు 16 రన్స్ వచ్చాయి. హోల్డర్ వేసిన నాలుగో ఓవర్లో రాహుల్ వరుసగా 2 ఫోర్లు కొట్టగా.. ఐదో ఓవర్లో బౌలింగ్‌కు దిగిన లెఫ్టామ్ స్పిన్నర్ పియర్‌ను రోహిత్ సిక్సర్‌తో ఆహ్వానించాడు. మూడో బంతిని రోహిత్ బౌండరీకి తరలించడంతో ఆ ఓవర్లో 14 రన్స్ లభించాయి. అటు రాహుల్ కూడా బ్యాటుకు పని చెబుతూ విలియమ్స్ వేసిన ఆరో ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో ప్రేక్షకులను అలరించాడు. దాంతో పవర్ ప్లే ముగిసేసరికి భారత్ 72 రన్స్ చేసింది. ఇక..పియర్ వేసిన 8వ ఓవర్లో ఆకాశమే హద్దుగా రెచ్చిపోయిన రోహిత్.. రెండు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అతడు చివరి బంతిని బౌండరీకి తరలించాడు. ఆపై రాహుల్ కూడా అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. కానీ 12వ ఓవర్లో కెస్రిక్ విలియమ్స్.. రోహిత్‌ను అవుట్ చేయడంతో విండీస్ ఊపిరిపీల్చుకుంది. రోహిత్, రాహుల్ తొలి వికెట్‌కు 135 రన్స్ జోడించారు.

### కోహ్లీ, రాహుల్..ఆకాశమే హద్దు

బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన పంత్ (0) భారీషాట్ కొట్టబోయి హోల్డర్‌కు క్యాచ్ ఇచ్చాడు. వరుసగా రెండు వికెట్లు పడడంతో రన్‌రేట్‌కు కొంత బ్రేక్ పడినా.. లెగ్‌స్పిన్నర్ వాల్ష్ వేసిన 14వ ఓవర్ ఆఖరి బంతిని స్లాగ్‌స్వీప్‌తో కోహ్లీ సిక్సర్‌గా మలిచాడు. తదుపరి ఓవర్లో హోల్డర్ వేసిన ఫుల్‌లెంగ్త్ బంతిని లెగ్‌స్టంప్ అవతలికి వెళ్లి.. ఎక్స్‌ట్రా కవర్ దిశగా రాహుల్ సిక్సర్‌గా కొట్టిన తీరు అద్భుతం. ఇదే ఓవర్లో రెచ్చిపోయిన కోహ్లీ 4,6,4 దంచడంతో ఆ 15వ ఓవర్లో భారత్ 22 రన్స్ రాబట్టింది. ఇక్కడి నుంచి రాహుల్, కోహ్లీ బ్యాట్లు మరింత ఝుళిపించారు. 18వ ఓవర్లో రాహుల్, విరాట్ చెరో సిక్సర్ సాధించగా.. పొలార్డ్ వేసిన 19 ఓవర్లో విరాట్ 6,6,4,6 కొట్టి హాఫ్ సెంచరీ దాటడంతో స్టేడియం హోరెత్తింది. కాట్రెల్ వేసిన ఆఖరి ఓవర్ రెండో బంతికి విండీస్ జట్టు కోహ్లీ కాట్ బిహైండ్‌ అప్పీలు చేసింది. అంపైర్ నితిన్ మెనన్ అవుటివ్వగా.. కోహ్లీ సమీక్షకు వెళ్లాడు. అయితే బంతి హెల్మెట్‌కు తగిలినట్టు రివ్యూలో తేలడంతో మూడో అంపైర్ విరాట్‌ను నాటౌట్‌గా ప్రకటించాడు. నాలుగో బంతికి రాహుల్‌ను కాట్రెల్ వెనక్కిపంపగా..ఆఖరి బంతికి అద్భుత సిక్సర్‌తో కోహ్లీ ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.



రోహిత్ (71)

**400**

కాట్రెల్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్ తొలి బంతిని సిక్సర్‌గా మలిచిన రోహిత్‌కు అన్ని ఫార్మాట్లలో అది 400వ సిక్సర్. ఈ ఘనత సాధించిన మొదటి భారత బ్యాట్స్‌మన్‌గా అతడు రికార్డు నెలకొల్పాడు.

కోహ్లీ (70 నాటౌట్)

**1**

స్వదేశంలో టీ20ల్లో వేయికిపైగా పరుగులు చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్ కోహ్లీ

వాంఖడేలో ఇదే (240/3) అత్యధిక స్కోరు. గతంలో ఇక్కడ 2016 టీ20 వరల్డ్‌కప్‌లో సౌతాఫ్రికాపై ఇంగ్లండ్ 230 స్కోరు చేసింది.

### స్కోరు బోర్డు

**భారత్:** రోహిత్ శర్మ (సి) హేడెన్ (బి) విలియమ్స్ 71, కేఎల్ రాహుల్ (సి) పూరన్ (బి) కాట్రెల్ 91, రిషభ్ పంత్ (సి) హోల్డర్ (బి) పొలార్డ్ 0, కోహ్లీ (నాటౌట్) 70, శ్రేయాస్ అయ్యర్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 240/3; వికెట్ల పతనం:** 1-135, 2-138, 3-233; **బౌలింగ్:** షెల్డన్ కాట్రెల్ 4-0-40-1, హోల్డర్ 4-0-54-0, పియర్ 2-0-35-0, విలియమ్స్ 4-0-37-1, హేడెన్ వాల్ష్ 4-0-38-0, పొలార్డ్ 2-0-33-1.

**వెస్టిండీస్:** లెండిల్ సిమన్స్ (సి) శ్రేయాస్ (బి) షమి 7, బ్రండన్ కింగ్ (సి) కేఎల్ రాహుల్ (బి) భువనేశ్వర్ 5, షిమ్రన్ హెట్‌మయర్ (సి) కేఎల్ రాహుల్ (బి) కుల్దీప్ 41, నికొలస్ పూరన్ (సి) దూబే (బి) దీపక్ 0, పొలార్డ్ (సి/సబ్) జడేజా (బి) భువనేశ్వర్ 68, హోల్డర్ (సి/సబ్) మనీష్ పాండే (బి) కుల్దీప్ 8, హేడెన్ వాల్ష్ (బి) షమి 11, పియర్ (సి/సబ్) జడేజా (బి) దీపక్ 6, కెస్రిక్ విలియమ్స్ (నాటౌట్) 13, కాట్రెల్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 173/8; వికెట్ల పతనం:** 1-12, 2-17, 3-17, 4-91, 5-103, 6-141, 7-152, 8-169; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-20-2, భువనేశ్వర్ 4-0-41-2, మహమ్మద్ షమి 4-0-25-2, శివమ్ దూబే 3-0-32-0, కుల్దీప్ యాదవ్ 4-0-45-2, వాషింగ్టన్ సుందర్ 1-0-5-0.3

## డోపీలు సంగ్వాన్, రవి



రవికుమార్



సుమీత్ సంగ్వాన్

**న్యూఢిల్లీ:** ఒలింపిక్స్‌కు ఏడు నెలల ముందు భారత్‌ను డోపింగ్ కలవర పెడుతోంది. బాక్సర్ సుమీత్ సంగ్వాన్, షూటర్ రవికుమార్ డోపింగ్‌లో పట్టుబడ్డారు. టోక్యో ఒలింపిక్స్ సన్నాహకాల్లో ఉండగా.. డోపింగ్‌లో సంగ్వాన్ పాజిటివ్‌గా తేలడం అందరినీ షాక్‌కు గురి చేసింది. సుమీత్ అందజేసిన మూత్రం శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకం ఎసిటజోలమైడ్‌ను కనుగొన్నట్టు 'నాడా' తెలిపింది. అయితే, సంగ్వాన్ కంటి గాయానికి ప్రైవేటు డాక్టర్ వద్ద చికిత్స తీసుకుంటున్నాడు. కానీ, మినహాయింపుల అనుమతిని 'నాడా' నుంచి తీసుకోకపోవడం అతడికి శాపమైంది. దీంతో వచ్చే ఏడాది వుహాన్‌లో జరిగే ఒలింపిక్ క్వాలిఫయర్ ఈవెంట్‌లో పాల్గొనే చాన్స్ సంగ్వాన్‌కు లేనట్టే..! వరల్డ్‌కప్, కామన్వెల్త్ గేమ్స్ పతక విజేత రవికుమార్ శాంపిల్‌లో నిషేధిత ప్రొప్రనొలోల్ అవశేషాలున్నట్టు 'నాడా' తెలిపింది. మైగ్రెయిన్ చికిత్సలో ఇలాంటి డ్రగ్స్‌ను ఉపయోగిస్తారు.

## ఆదుకున్న కరుణరత్నే, ఒషాడ

లంక 202/5

పాక్‌తో తొలి టెస్టు

**రావల్పిండి:** పాకిస్థాన్ గడ్డపై పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న టెస్టులో తొలి రోజు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పర్యాటక శ్రీలంక 5 వికెట్లకు 202 పరుగులు చేసింది. దిమిత్ కరుణరత్నే (59), ఒషాడ ఫెర్నాండో (40) రాణించారు. ఆట చివరికి డిక్వెల్లా (11), ధనంజయ డిసిల్వా (38) క్రీజులో ఉన్నారు. వెలుతురు మందగించడంతో ఆటను నిర్ణీత సమయం కంటే ముందే నిలిపివేశారు. కాగా 2009లో లంక జట్టుపై ఉగ్రవాదుల దాడి తర్వాత పాక్‌లో టెస్టు మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి.



## సింధుకు ఝలక్

### యమగూచి చేతిలో ఓటమి

### వరల్డ్ టూర్ ఫైనల్స్

**గ్వాంగ్‌ఝౌ (చైనా):** వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో పీవీ సింధుకు తొలి మ్యాచ్‌లోనే షాక్ తగిలింది. మహిళల సింగిల్స్ గ్రూప్-ఎలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సింధు 21-18, 18-21, 8-21తో అకానె యమగూచి (జపాన్) చేతిలో పరాజయం పాలైంది. చెన్ యూఫీ, హి బింగ్జియాతో ఇంకా ఆడాల్సి ఉంది. గంటా ఎనిమిది నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో సింధు తొలి గేమ్ నెగ్గినా.. అదే జోరును కొనసాగించలేక పోయింది. అకానె కొంత పోరాడినా ప్రత్యర్థిని మరో అవకాశం ఇవ్వకుండా సింధు 21-18తో తొలి గేమ్‌ను నెగ్గింది. ఇక రెండోగేమ్ చివర్లో వరుసగా రెండు పాయింట్లు సాధించి 21-18తో ఆ గేమ్‌ను నెగ్గి మ్యాచ్ ఫలితాన్ని చివరి గేమ్‌కు తీసుకెళ్లింది. నిర్ణాయక మూడో గేమ్‌లో యమగూచి జోరు ముందు సింధు నిలబడలేక పోయింది. 0-5తో వెనుకబడిన సింధు ఏమాత్రం కోలుకోలేక పోయింది. దీంతో 8-20తో మూడో గేమ్‌తో పాటు మ్యాచ్‌నూ చేజార్చుకుంది.




## గణేష్ డబుల్ సెంచరీ

### స్టీఫెన్‌కు 5 వికెట్లు

### విదర్భతో రంజీ



గణేష్ సతీష్ (237)



స్టీఫెన్ (5/110)

**విజయవాడ(స్పోర్ట్స్):** విదర్భ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ గణేష్ సతీష్ (237) తన శతకాన్ని డబుల్ సెంచరీగా మలచడంలో విజయవంతమయ్యాడు. విజయవాడ శివార్లలోని మూలపాడు మైదానంలో ఆంధ్ర తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో గణేష్ అండతో పర్యాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 441 పరుగుల భారీ స్కోరు సాధించగలిగింది. ఆంధ్ర మీడియం పేసర్ సీవీ స్టీఫెన్ ఐదు వికెట్లతో అదరగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు మూడో రోజు ఆట ముగిసేసరికి 2 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసింది. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఆంధ్ర ఇంకా 130 పరుగుల వెనుకంజలో ఉంది. కెప్టెన్ హనుమ విహారి (27), ఓపెనర్ ప్రశాంత్ కుమార్ (17) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. క్రీజులో ఓపెనర్ జ్ఞానేశ్వర్ (42), రికీ భుయ్ (14) ఉన్నారు. గుర్బానీ, లలిత్ యాదవ్ చెరో వికెట్ తీశారు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.




Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.